www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 3-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 276 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా. 7.49 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తర మ. 2.47 తదుపరి హస్త వర్జ్యం: రా. 12.09-1.56; దుర్ముహూర్తం: ఉ. 11.58-12.42; అమృతఘడియలు: తె. ఉ. 8.28 వరకు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సింగరేణి నుంచి శ్రీధర్ ఔట్



సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరిస్తున్న బలరాం

2

డైరెక్టర్ బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలు

నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

2015 నుంచి సీఎండీగా ఉన్న శ్రీధర్‌పై పలు ఆరోపణలు

కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేసినా అప్పట్లో బేఖాతరు

ఓపెన్ కాస్ట్ టెండర్లు ప్రైవేట్ సంస్థకు వెళ్లేలా ఉదాసీనత

సీఎస్‌ఆర్ నిధుల తరలింపు కారణంతో వేటు వేసినట్లు చర్చ!

అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ శ్రీదేవి తొలగింపు

ప్రజలకు పెట్రో నరకం

ట్యాంకర్ డ్రైవర్ల సమ్మెతో వాహనదారుల్లో ఆందోళన.. పెట్రోల్‌బంకుల వద్ద భారీగా బారులు

మధ్యాహ్నానికే పలు బంకుల వద్ద నోస్టాక్ బోర్డులు.. బంకుల వద్ద కిలోమీటర్ మేర వ్యాపించిన క్యూలు

ఆ వాహనాల దెబ్బకు ఎక్కడికక్కడ నిలిచిన ట్రాఫిక్.. హైదరాబాద్ నలుమూలలా స్తంభించిన దారులు

అరగంట దూరానికి 2 గంటలకుపైగా ప్రయాణం.. ట్రాఫిక్ నరకయాతన తట్టుకోలేక అల్లాడిన ప్రజలు

బంకుల వద్ద ఘర్షణ.. పోలీస్ పహారాతో సరఫరా.. ఎట్టకేలకు ట్రక్కు డ్రైవర్ల ఆందోళన విరమణ 14

కొత్త చట్టం అమలుకు ముందు మరోమారు సమావేశమై చర్చిద్దాం.. కేంద్ర హోంశాఖ కార్యదర్శి హామీ



హైదరాబాద్‌లోని ఓ బంకు వద్ద..



14

లొంగిపోతే బెయిల్..

లేకపోతే కఠిన శిక్ష

హిట్-అండ్-రన్ కేసులకు భారీ మూల్యం

భారత న్యాయ సంహిత చెబుతుందిదే

ప్రమాదం జరగ్గానే ఠాణాకు వెళ్తే బెదిరే..

లేకుంటే పదేళ్ల ఖైదు, రూ.7 లక్షల జరిమానా

ఐపీసీలో ఈ తరహా నేరానికి 2 ఏళ్ల శిక్షే

మళ్లీ బీఆర్‌ఎస్.. ఎల్‌ఆర్‌ఎస్



సచివాలయంలో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్రమబద్ధీకరణకు కొత్త దరఖాస్తులకు చాన్స్, పాతవాటి పరిష్కారం

కటాఫ్ గడువు పెంపుతో ఎక్కువ మందికి లబ్ధి.. సర్కారు పరిశీలన

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అపరిష్కృతంగా 25.59 లక్షల దరఖాస్తులు

పాత కటాఫ్ 2020 ఆగస్టు 26.. అనంతరం ఏడాది, రెండేళ్లు పెంపు

పాతవి, కొత్తవి కలిపితే ఎల్‌ఆర్‌ఎస్ కింద రూ.10 వేల కోట్లు!

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఖజానాకు భారీగా కాసులు కురిపించే 'క్రమబద్ధీకరణ' పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కటాఫ్ గడువు పెంపు ద్వారా ఎక్కువ మందికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. అనధికార లే ఔట్లలోని స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్), అనుమతి లేకుండా చేపట్టిన భవనాల క్రమబద్ధీకరణ (బీఆర్‌ఎస్) పథకాలను మళ్లీ తెరపైకి తీసుకురానుంది. వీటి కింద పెండింగ్‌లో ఉన్న లక్షల దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు, కొత్తగా దరఖాస్తుకు

మిగతా 2వ పేజీలో...

అదనపు రుణం ఇప్పించండి

కేంద్రం, రాష్ట్రానికి మధ్యవర్తిత్వం నెరపండి

నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం

ఆయనకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించిన ముఖ్యమంత్రి

వెనుకబడిన జిల్లాల గ్రాంటు 1,800 కోట్లు ఇప్పించండి

16వ ఆర్థిక సంఘం ద్వారా ఎక్కువ నిధులు ఇవ్వాలని వినతి

ఆ 8 కొత్త వైద్య కళాశాలల పరిస్థితేంటి?

ఈ నెలలోనే ఎన్‌ఎంసీ తనిఖీలు.. కొత్త సర్కారు తర్జనభర్జన 13

మెట్రో ఫేజ్-2లో మార్పులు

ఇన్నర్ రింగ్ రోడ్డుపై రాజేంద్రనగర్ వరకు మెట్రో

కొత్తగా ఏర్పాటయ్యే హైకోర్టుకు రవాణా సౌకర్యం

నాగోలు-ఎల్బీనగర్-చాంద్రాయణగుట్ట మీదుగా ప్లాన్

అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ సూచన

మియాపూర్ స్టేషన్-పటాన్‌చెరు, రాయదుర్గం-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఎల్బీనగర్-హయత్‌నగర్ వరకు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

రేపే కాంగ్రెస్‌లోకి షర్మిల

రాహుల్, ఖర్గే సమక్షంలో చేరనున్న వైఎస్ కుమార్తె.. నేడు సాయంత్రం ఢిల్లీకి



లోటస్‌పాండ్‌లో వైఎస్సార్టీపీ ముఖ్యులతో సమావేశం.. కాంగ్రెస్‌లో చేరికపై స్పష్టత

తనకు ఏఐసీసీలో చోటు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు ఇస్తారని వెల్లడి

తెలంగాణలో మా పార్టీ పోటీ చేయనందునే హస్తం పార్టీకి అధికారం దక్కింది

కాంగ్రెస్‌తో పనిచేయాలని ఇదివరకే నిర్ణయం.. నాతో నడుస్తానన్న ఆళ్లకు ధన్యవాదాలు

ఇడుపులపాయలో షర్మిల.. వైఎస్ సమాధి వద్ద కుమారుడి పెళ్లి పత్రిక ఉంచి ఆశీర్వాదం

వేంపల్లె-హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, ముఖ్యమంత్రి జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిక ఖరారైంది. గురువారం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల సమక్షంలో ఆమె ఆ పార్టీలో చేరనున్నారు. వైఎస్‌ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటిస్తారు. ఇందుకోసం ఆమె బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. వైఎస్‌ఆర్‌టీపీ ముఖ్యనాయకులు వాడుక రాజగోపాల్, తూడి దేవేందర్‌రెడ్డి, పిట్టా రాంరెడ్డి తదితరులూ వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు.. షర్మిల మంగళవారం లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్టీపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీని

మిగతా 3వ పేజీలో...

అన్నా.. మేనల్లుడి

పెళ్లికి రా!

కొడుకు వివాహానికి జగన్‌ను ఆహ్వానించనున్న షర్మిల 3

నేడు తాడేపల్లిలో సమావేశం

తర్వాత గన్నవరం నుంచి ఢిల్లీకి

భూకంప మృతులు 55

జపాన్‌లో ఒక్క రోజులోనే 155 ప్రకంపనలు

వేలాదిమంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

వాజిమాలోని ఒకే వీధిలో 200 ఇళ్లు దగ్ధం

ఇషికావాలో అంధకారంలో 45 వేల నివాసాలు

టోక్యోలో రన్ వేపై 2 విమానాలు ఢీ

ఒకటి 367 మంది ప్రయాణికులతో అప్పుడే దిగింది..

మరొకటి బయలుదేరబోయే కోస్టు గార్డు విమానం

చూస్తుండగానే వ్యాపించిన మంటలు 2

ఎమర్జెన్సీ స్లైడర్‌తో ప్రయాణికుల్ని దించిన సిబ్బంది

మరో విమానంలోని ఐదుగురు సిబ్బంది దుర్మరణం



వాజిమాలో భూకంపం కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

గృహలక్ష్మి పథకం రద్దు

గత ప్రభుత్వం మంజూరు చేసిన పత్రాలు కూడా..

దాని స్థానంలో అభయహస్తం

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం 3

దమ్ముంటే కాళేశ్వరంపై

సీబీఐ దర్యాప్తు కోరండి

48 గంటల్లో విచారణ మొదలవుతుంది

సీఎం రేవంత్.. ఎందుకు లేఖ రాయడం లేదు

ప్రాజెక్టు భవిష్యత్తు ఏంటి..?: కిషన్‌రెడ్డి 12



బీఆర్‌ఎస్, బీజేపీ తోడుదొంగలు



12

కాళేశ్వరం అవినీతిలో ఇద్దరూ భాగస్వాములే

కిషన్‌రెడ్డి కామన్‌సెన్స్ ఉండే మాట్లాడుతున్నారా?

కేసీఆర్ అవినీతిపై గత పదేళ్లుగా ఏం చేశారు?

విద్యుత్తు రుణ సంస్థలు సాగునీటికెలా అప్పిచ్చాయి?

వారం రోజుల్లో కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణ

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ఒకప్పుడు కాంగ్రెస్ అనే పార్టీ ఉండేది

ఆప్ నేత మాన్ తీవ్ర వ్యాఖ్యలు.. 'ఇండియా'లో లుకలుకలు

న్యూఢిల్లీ/కోల్‌కతా, జనవరి 2: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు బహిర్గతమవుతున్నాయి. కూటమి నేతలు ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీపై పంజాబ్ సీఎం, ఆప్ నేత భగవంత్ మాన్ విరుచుకుపడ్డారు. చండీగఢ్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి గత వైభవంగా మారిందని, త్వరలోనే పంజాబ్, ఢిల్లీలోని తల్లులు తమ పిల్లలకు "ఒకప్పుడు కాంగ్రెస్ అనే పార్టీ ఉండేది" అని చిన్న కథలుగా చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ దీటుగా కౌంటర్ ఇచ్చింది. 'అప్పట్లో భగవంత్ మాన్ అనే జోకర్ ఉండేవాడు' అని పేర్కొంది. కాంగ్రెస్ రహిత భారత్ గురించి ప్రధాని మోదీ, ఆప్ కలలు కంటున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా మండిపడ్డారు. ఇదిలాఉండగా, బెంగాల్‌లో పొత్తు అవకాశాలను టీఎంసీ అధినేత్రి మమత నాశనం చేశారని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ఆరోపించారు.

కర్ణాటకలో కరసేవకుడి అరెస్టు.. బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయ ప్రారంభ వేళ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త వివాదంలో చిక్కుకుంది. అయోధ్యలో 1992 నాటి రామ మందిర ఉద్యమంలో చోటు చేసుకున్న హింసకు సంబంధించి నమోదైన కేసుల్లో నిందితులను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకోవడం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా హుబ్బళ్లిలో స్థానిక కరసేవకుడు శ్రీకాంత్ పూజారిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే, 30 సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ కేసును తిరగదోడి, రామభక్తులను అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కాంగ్రెస్ తన హిందూ వ్యతిరేకతను చాటుకుంటోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆరోపించారు. కరసేవకుడి అరెస్టును ఖండిస్తూ బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. కాగా కరసేవకుడి అరెస్టుపై బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, మతాన్ని లాగుతోందని సీఎం సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. పాత కేసులను క్లియర్ చేయాలని న్యాయస్థానాలు చేసిన సూచన మేరకు, అప్పట్లో హింసకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశారని తెలిపారు. ఇది విద్వేష రాజకీయం కాదని, రామభక్తులను తాము ఎక్కడా వేధించడం లేదని స్పష్టం చేశారు.

భర్తను కాదని నేరుగా పిల్లలకు ఫ్యామిలీ పెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 2: వివాహ బంధానికి సంబంధించిన కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పుడు మహిళా ఉద్యోగులు తమ ఫ్యామిలీ పెన్షన్ భర్తకు బదులు పిల్లలకు చెందేలా ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. పిల్లలను నావినీగా పెట్టుకోవచ్చు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. విడాకుల పిటిషన్, భర్తపై గృహ హింస నిరోధక చట్టం కింద పెట్టిన కేసులు, వరకట్నం కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు మహిళా ఉద్యోగులు ఇలాంటి నిర్ణయం తీసుకోవచ్చు. ఇందుకోసం ముందుగా శాఖాధిపతికి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని పెన్షనర్ల సంక్షేమవిభాగం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

అయోధ్యకు కానుకలుగా బియ్యం,కూరగాయలు

అయోధ్య, జనవరి 2: అయోధ్యలో ఈ నెల 22న జరిగే ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా భక్తులు బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర ఆహారపదార్థాలను కానుకలుగా పంపుతున్నారు. మొత్తంగా ఇప్పటివరకు దాదాపు 300 టన్నుల బియ్యాన్ని భక్తులు అయోధ్యకు పంపినట్లు సమాచారం. రాముడి తల్లిగారి ఊరిగా భావించే ప్రస్తుత ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నుంచి భారీ సంఖ్యలో బియ్యం ట్రక్కులు అయోధ్యకు వస్తున్నాయని అధికారులు తెలిపారు. రామాలయ ప్రారంభోత్సవానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారని, ఆ రోజు భక్తులందరికీ అన్నదానం చేయాలని ఆలయ కమిటీ భావిస్తోంది.

మెట్టు దిగిన హమాస్

- గాజాలో పాలస్తీనా అథారిటీ సర్కారుకు ఓకే
- ప్రకటించిన హమాస్ నేత ఇస్మాయిల్ హనియే
- ఐడీఎఫ్ దాడుల్లో హమాస్ నేత సలేహ్ అరౌరీ హతం

ఇజ్రాయెల్‌పై భీకర పోరు చేస్తున్న హమాస్ ఉగ్ర సంస్థ ఎట్టకేలకు మెట్టు దిగింది. వెస్ట్‌బ్యాంక్‌తోపాటు.. గాజాలో పాలస్తీనా అథారిటీ ప్రభుత్వ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసింది. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తాము అంగీకరిస్తామని హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతి ఇస్మాయిల్ హనియే మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు టెలివిజన్ ప్రసంగం చేశారు. "ఈ నిర్ణయం వెనక ఖతార్, ఈజిప్ట్ మధ్యవర్తిత్వం ఉంది. ఈ యుద్ధంతో అమాయక పౌరులు చనిపోతున్నారు. వారి కోసం కాల్పుల విరమణను కోరుతున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ నుంచి అపహరించిన బందీలను అప్పగించడానికి.. తమ ఖైదీలను విడుదల చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. బందీలు-ఖైదీల మార్పిడి జరగాల్సిందేనన్నారు. గతంలో కాల్పుల విరమణ సందర్భంగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా అథారిటీ సర్కారు డిమాండ్‌ను ముందు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు హమాస్ కూడా అందుకు అంగీకరించడంతో.. యుద్ధం ముగిసే అవకాశాలున్నట్లు ఈజిప్ట్ తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని మిష్రిఫియాలోని హిజ్బుల్లా షెల్టర్‌లో హమాస్ అగ్రనేతలు తలదాచుకున్నారనే సమాచారంతో ఐడీఎఫ్ మంగళవారం ఆ ప్రాంతాలపై రాకెట్ల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో హమాస్ పొలిటికల్ బ్యూరో డిప్యూటీ చీఫ్ సలేహ్ అల్-అరౌరీ హతమయ్యాడు. కాగా, ఇజ్రాయెల్ గివాటి బ్రిగేడ్‌లో డివిజన్ కమాండర్ హరేల్ ఇటా.. ఓ నవజాత శిశువును గాజా స్ట్రిప్ నుంచి అపహరించడంపై ఆధారాలు లభించాయని, దర్యాప్తు చేస్తున్నామని ఐడీఎఫ్ మంగళవారం తెలిపింది. - సెంట్రల్ డెస్క్

జపాన్ భూకంప మృతులు 55

ఒక్క రోజులోనే 155 సార్లు ప్రకంపనలు

- వాజిమాలోని ఒకే వీధిలో దగ్ధమైన 200 ఇళ్లు
- ఇషికావాలో అంధకారంలో 45 వేల నివాసాలు



జపాన్‌లో సోమవారం భూకంపం ధాటికి నేల మట్టమైన ఇళ్లు

టోక్యో, జనవరి 2: ద్వీప దేశం జపాన్‌లో భూకంపం మృతుల సంఖ్య భారీగానే ఉంది. 55 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. కొత్త సంవత్సరం తొలి రోజున పశ్చిమ తీర ప్రాంతంలో సంభవించిన ఈ విపత్తులో మరణాలు ఇంకా పెరిగే ప్రమాదం ఉందని అంచనా. సోమవారం ఒక్క రోజే 155 ప్రకంపనలు నమోదైనట్లు తేలింది. వీటిలో ఒకదాని తీవ్రత గరిష్ఠంగా 7.6 కాగా, మిగతావి 3 నుంచి 6 మధ్యన ఉన్నట్లు జపాన్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. మంగళవారం కూడా ఆరుసార్లు భూమి కంపించింది. వీటిలో ఒకదాని తీవ్రత 5.6గా ఉంది. భూకంప కేంద్రం ఇషికావా, మరికొన్ని ప్రభావిత ప్రాంతాల్లో 45 వేల ఇళ్లు అంధకారంలో ఉన్నాయి. వాజిమాలోని అసైచి వీధిలో ప్రకంపనల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగి 200 ఇళ్లు దగ్ధమయ్యాయి. కాగా, వేలాదిమందిని ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సైన్యం పెద్దఎత్తున సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమైంది. రోడ్లు దెబ్బతినడం, తీరంలోని కీలక విమానాశ్రయం రన్ వేకు పగుళ్లు రావడంతో సహాయ చర్యలకు ఇబ్బంది ఎదురవుతోంది. దేశంలోని పలు జాతీయ రహదారులు సహా ప్రధాన రహదారులను ఇంకా మూసే ఉంచారు. చాలా రైల్, విమాన సర్వీసులను పునరుద్ధరించలేదు. ప్రభుత్వ యంత్రాంగం విపత్తు నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉంది. మారుమూల నోటో ద్వీపంలో తాగేందుకు మంచినీరు కూడా లేదు. భవనాలు దగ్ధమయ్యాయి. కొన్ని కూలిపోయాయి. చేపల వేటకు వాడే బోట్లు కొట్టుకుపోయాయి. ఎగసిన అలలకు సుజు నగరంలోనూ కార్లు, పడవలు సముద్రంలోకి కొట్టుకుపోయాయి.

మరిన్ని శక్తిమంతమైన ప్రకంపనల హెచ్చరిక

రాబోయే రోజుల్లో మరిన్ని శక్తిమంతమైన ప్రకంపనలు వచ్చే ముప్పుందని.. జాగ్రత్తగా ఉండాలని జపాన్ ప్రభుత్వం హెచ్చరించింది. సోమవారమే రష్యా, ఉత్తర, దక్షిణ కొరియాలు సునామీ హెచ్చరికలను జారీ చేయగా.. దక్షిణ కొరియా తూర్పు తీరాన్ని 3.3 అడుగుల సునామీ అల తాకినట్లు అధికారులు చెప్పారు.

టోక్యోలో రన్ వేపై 2 విమానాలు ఢీ



మంటల్లో జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం

- జపాన్ ఎయిర్‌లైన్స్ విమానంలో 367 మంది ప్రయాణికులు క్షేమం
- కోస్ట్‌గార్డ్ విమాన సిబ్బంది 5గురు మృతి

టోక్యో, జనవరి 2: జపాన్ రాజధాని టోక్యోలోని హనేడా విమానాశ్రయం రన్ వేపై మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 367 మంది ప్రయాణికులతో అప్పుడే దిగిన జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం.. బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న కోస్ట్ గార్డు విమానాన్ని ఢీకొంది. రెండు విమానాల్లోనూ మంటలు రేగాయి. కోస్ట్ గార్డు విమానం సిబ్బంది ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కెప్టెన్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎయిర్‌లైన్స్ విమానం పూర్తిగా మంటల్లో చిక్కుకోక ముందే పైలట్లు, సిబ్బంది ఎమర్జెన్సీ స్లైడర్ వేసి ప్రయాణికులందర్నీ కిందకు దింపేశారు. దానిపై జారుతూ ప్రయాణికులు అందరూ దిగిన తర్వాతే సిబ్బంది బయటకొచ్చారు. 'మా విమానం దిగిన కొద్దిసేపటికే పెద్ద శబ్దం వచ్చింది. అందరం ఉలిక్కిపడ్డాం. క్షణాల్లో క్యాబిన్‌లో పొగ అలుముకోవడం మొదలైంద'ని పలువురు ప్రయాణికులు వణికిపోతూ చెప్పారు. ఏం జరుగుతోందో తెలియక హాహాకారాలు చేశామన్నారు. మొదట కుడి రెక్క భాగం నుంచి మంటలు అంటుకున్నాయి. విమానం నిప్పులు చిమ్ముతూ.. పొగలు కక్కుతూ రన్ వేపై కొంతదూరం పరుగు తీసిన దృశ్యం భయం పుట్టించింది. చూస్తుండగానే విమానమంతటా మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు దాదాపు 70 ఫైర్ ఇంజన్లను రప్పించారు. ఈ విమానం (ఎయిర్‌బస్ ఏ350) జపాన్‌లోని హొక్కాడో న్యూ చిటోస్ ఎయిర్‌పోర్టు నుంచి టోక్యో వచ్చింది. కోస్ట్ గార్డ్ విమానం నిగాట ప్రాంత భూకంప బాధితులకు అందించేందుకు సామగ్రి తీసుకెళ్లాల్సి ఉంది. కొత్త ఏడాది తొలి రోజే వరుస భూకంపాలతో జపాన్ చిగురుటాకులా వణికిపోయింది. మరుసటి రోజే ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం జపనీయులను ఆందోళనకు గురిచేస్తోంది.

లోకం తీరు



మెగసెసే అవార్డును తిరిగిచ్చేసిన

సందీప్ పాండే



న్యూఢిల్లీ, జనవరి 2: తనకు బహూకరించిన రామన్ మెగసెసే అవార్డును ప్రముఖ సామాజిక కార్యకర్త సందీప్ పాండే మంగళవారం వాపసు చేశారు. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు అమెరికా మద్దతు తెలుపుతున్నందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఈ అవార్డును నెలకొల్పింది. అమెరికాకే చెందిన ఫోర్డు ఫౌండేషన్ సహకారం అందించింది. 2002లో ఆయనకు బహూకరించిన ఈ అవార్డును తిప్పి పంపుతున్నట్లు ప్రకటించారు. అమెరికా యూనివర్సిటీలు ఇచ్చిన రెండు ఎం.ఎస్. డిగ్రీలను కూడా వాపసు చేస్తున్నట్లు తెలిపారు. 21,500 మందికిపైగా పాలస్తీనా పౌరులను హతమార్చిన ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని తాను తట్టుకోలేకపోతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీసుకువచ్చిన న్యాయ సంస్కరణలను ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన సంగతి తెలిసిందే.

చిక్కుల్లో చైనా ఆర్థిక రంగం

- ఉద్యోగాలు లేవు, కష్టాల్లో కంపెనీలు
- కనీసావసరాల కోసమూ జనం కష్టాలు
- స్వయంగా అంగీకరించిన జిన్‌పింగ్



బీజింగ్, జనవరి 2: చైనా ఆర్థిక పరిస్థితి సరిగా లేదని స్వయంగా ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ అంగీకరించారు. ఆర్థికరంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా దేశ ప్రజానీకాన్ని ఉద్దేశించి ఆయన టీవీలో ప్రసంగించారు. కొన్ని కంపెనీలు, పారిశ్రామిక రంగాలు తీవ్ర కష్టాల్లో ఉన్నాయని, ప్రజలకు ఉద్యోగాలు లభించటం లేదని, కనీస అవసరాలు తీర్చుకోవటానికి కూడా జనం ఇబ్బందులు పడుతున్నారని జిన్‌పింగ్ చెప్పారు. ఇటువంటి సమస్యలు ఉన్నప్పటికీ.. ఆర్థిక రంగాన్ని చక్కదిద్దుతామని ఆయన భరోసా వ్యక్తం చేశారు. జిన్‌పింగ్ సందేశానికి కేవలం కొన్ని గంటల ముందే.. దేశంలోని పరిశ్రమల పనితీరుకు సంబంధించి జాతీయ గణాంకాల బ్యూరో డిసెంబరు నెల 'పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్' (పీఎంఐ)ను వెలువరించింది. ఆ నెలలో ఫ్యాక్టరీల్లో కార్యకలాపాలు గత ఆరునెలల కనిష్ఠానికి పడిపోయాయని వెల్లడైంది. నవంబరులో తయారీ రంగం పీఎంఐ 49.4గా నమోదు కాగా, డిసెంబరులో అది మరింత తగ్గి 49కి పడిపోయింది. పీఎంఐ రీడింగ్ 50కి పైన ఉంటేనే పరిశ్రమల కార్యకలాపాలు బాగా నడుస్తున్నాయని లెక్క. 50కన్నా తక్కువ ఉంటే పరిశ్రమలు నెమ్మదించాయని అర్థం చేసుకోవాలి. 3నెలలుగా పీఎంఐ 50కి తక్కువగానే ఉంది.

ఆశించిన ఫలితాలనివ్వని ప్రభుత్వ చర్యలు

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనాను నిరుద్యోగం, ధరల పతనం, తగ్గిన డిమాండ్, స్థానిక ప్రభుత్వాలపై కొండలా పెరిగిపోయిన ఆర్థికభారం వంటివి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆర్థికరంగాన్ని తిరిగి పట్టాలెక్కించి, ఉద్యోగావకాశాలు కల్పించటానికి చైనా ప్రభుత్వం గత ఏడాది కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాలేదు. జిన్‌పింగ్ హయాంలో ఆర్థికరంగంపై ప్రభుత్వ నియంత్రణ బాగా పెరగటం వల్ల ప్రైవేటు రంగంలో వృద్ధి మందగించింది. జాతీయ భద్రత పేరుతో కార్పొరేట్ కంపెనీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో అంతర్జాతీయ పెట్టుబడిదారులు చైనా ముఖం చూడటం లేదు. మరోవైపు, దేశీయ దిగ్గజం అలీబాబా అంతర్జాతీయ స్థాయి కంపెనీగా ఎదగటంతో, ఆర్థికరంగం ఎక్కడ తమ చెప్పుచేతుల్లోంచి జారిపోతుందోనన్న అనుమానంతో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆ కంపెనీపై కొరడా ఝుళిపించింది. దీంతో అలీబాబా గ్రూపు కంపెనీలు కూడా బలహీనపడిపోయాయి.

బీజేపీదీ సబ్సిడీ సంస్కృతే!

వేరే పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు దీటుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాయితీలు


- ఆర్బీఐ తాజా నివేదిక ద్వారా వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 2: "రేవడీ కల్చర్".. పేదలకు ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలు, సబ్సిడీల గురించి ప్రధాని మోదీ దగ్గర నుంచి బీజేపీలో పలువురు సీనియర్ నేతల దాకా అదేదో అపరాధమన్నట్లు చెప్పే మాట ఇది! నిరుడు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మోదీ.. ఈ ఉచితాల సంస్కృతి వల్ల రాష్ట్రాలు అప్పులపాలయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు గుర్తుందా? కానీ.. 2018-23 నడుమ దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సబ్సిడీల పెరుగుదల బీజేపీయేతర రాష్ట్రాలకు దీటుగా ఉందని ఆర్బీఐ తాజా నివేదికలో తేలింది. ఈ ఐదేళ్లలో రాష్ట్రాలు సమర్పించిన బడ్జెట్‌లను పరిశీలించి ఆర్బీఐ ఈ నివేదిక రూపొందించింది. దాని ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల బడ్జెట్లలో సబ్సిడీ కేటాయింపులు సగటున 2.2 రెట్లు పెరిగినట్టు అందులో పేర్కొంది. 2018 నాటికి రాష్ట్రాల సబ్సిడీల భారం రూ.1.9 లక్షల కోట్లుండగా.. 2023 నాటికి అది రూ.4.2 లక్షల కోట్లకు చేరినట్టు వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం..

- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను.. దేశవ్యాప్తంగా కేటాయించిన సబ్సిడీల్లో బీజేపీ పాలిత రాష్ట్రాల వాటా 34%. ఆప్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సబ్సిడీల వాటా 20%.
- గుజరాత్‌లో 2018-19 నాటికి రూ.17 వేల కోట్లున్న సబ్సిడీలు.. 2023 నాటికి రూ.30 వేల కోట్లు దాటాయి. హరియాణాలో రూ.8 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు, కర్ణాటకలో రూ.23 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు, మధ్యప్రదేశ్‌లో రూ.12 వేల కోట్ల నుంచి రూ.28 వేల కోట్లకు, యూపీలో రూ.14 వేల కోట్ల నుంచి రూ.26 వేల కోట్లకు సబ్సిడీలు పెరిగాయి.
- అసోంలో 2018-19 నాటికి రూ.1323 కోట్లుగా ఉన్న సబ్సిడీల భారం.. 2021-22 నాటికి రూ.2005 కోట్లకు చేరింది. కానీ, 2022-23లో దాన్ని రూ.499కోట్లకు, 2023-24లో కేవలం రూ.31.5 కోట్లకు పరిమితం చేయడం గమనార్హం. ఇక, కేంద్ర ప్రభుత్వం సైతం గడిచిన మూడేళ్లుగా సబ్సిడీలపై చేస్తున్న ఖర్చును పెంచుతూనే ఉంది. 2018-19 బడ్జెట్‌లో సబ్సిడీలకు కేంద్రం కేటాయించిన మొత్తం రూ.2.92లక్షల కోట్లు. 2019-20 బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.2.95లక్షల కోట్లకు పెంచింది.

తమిళనాడుకు అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువ నిధులిస్తున్నాం

- తిరుచ్చి బహిరంగ సభలో ప్రధాని మోదీ



చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంపద, సంస్కృతీ సంప్రదాయాల ప్రతిబింబమే తమిళనాడు అని, తమిళభాష అత్యంత ప్రాచీనమైనదని, కనుకనే తాను దేశవిదేశాల్లో పాల్గొనే సభల్లో ఆ భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటుతున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర అని, ఆ దిశగానే విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యనందించి యువకులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తమిళనాడు పర్యటన సందర్భంగా తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం జరిగిన స్నాతకోత్సవానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెర్మినల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తమిళనాడుకు అన్ని రాష్ట్రాల కంటే అధికంగా నిధులు కేటాయిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా చెప్పారు. ఇదిలా ఉండగా, చైనా విషయంలో వాస్తవిక విధానాన్ని(రియలిజం) అనుసరించడం చాలా ముఖ్యమని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. చైనా విషయంలో నెహ్రూ 'రొమాంటికిజాన్ని' అవలంబించారని, ఆదర్శపూర్వక స్నేహాన్ని ప్రదర్శించారని విమర్శించారు. అదే సమయంలో భారతదేశ ప్రయోజనాలు, ప్రపంచ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని చైనా పట్ల వాస్తవిక విధానాన్ని అవలంబించాలని నాటి హోంమంత్రి వల్లభ్‌భాయ్ పటేల్ చెప్పేవారని తెలిపారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం పటేల్ సూచించిన రియలిజాన్ని అనుసరిస్తోందని జైశంకర్ అన్నారు.

సింగరేణి నుంచి శ్రీధర్ ఔట్

హైదరాబాద్, కొత్తగూడెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎన్.శ్రీధర్‌ను ఆ పదవి నుంచి తప్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి డైరెక్టర్ (పా-ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్) ఎన్.బలరాంకు సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతోనే సింగరేణి సీఎండీ మార్పు ఖాయమని, భారీ ప్రక్షాళన జరుగుతుందనే ప్రచారం సాగింది. దీనికితగ్గట్లే.. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించిన వారం రోజుల్లోపే ఛైర్మన్‌ను పక్కనపెట్టడం గమనార్హం. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను సింగరేణి సమీప ప్రాంతాలకు కాకుండా సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్, నిజామాబాద్ తదితరచోట్లకు తరలించారని కార్మిక నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీధర్‌ను పక్కన పెట్టిందనే చర్చ కోల్ బెల్ట్‌లో జరుగుతోంది. కాగా, తన నియామకం అనంతరం బలరాం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీలను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఏకధాటిగా.. 9 ఏళ్లుగా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. శ్రీధర్ 2015 జనవరి 1న సీఎండీగా నియమితులయ్యారు. బీఆర్ఎస్ విధేయుడని, ప్రధానంగా మాజీ సీఎం కేసీఆర్ అదేశాలు మాత్రమే పాటిస్తారని ఆయనపై ఆరోపణలున్నాయి. కోల్‌బెల్ట్‌లో కాంట్రాక్టుల నుంచి ఉద్యోగ నియామకాల వరకు గత సర్కారుకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలూ వచ్చాయి. శ్రీధర్‌ను కొనసాగించడంపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతినిధులు సింగరేణి పాలక మండలి సమావేశాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినా బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదు. ఓ దశలో జాతీయ ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) సీఎండీ పోస్టుకూ శ్రీధర్ దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నియామక మండలి ఆయన పేరును సిఫారసు చేసింది. అయితే, ప్రధానమంత్రి నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ అనుమతి ఇవ్వలేదు.

నియామకాల్లో అక్రమాలు..

శ్రీధర్ హయాంలో 2016లో నిర్వహించిన 478 క్లరికల్ పోస్టుల రాత పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, కొన్ని జిల్లాల్లో ఒకే కుటుంబానికి చెందినవారికి ఉద్యోగాలు వచ్చాయంటూ కార్మిక సంఘాల నాయకులు గత ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో డీజిల్ కుంభకోణంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకుండా రెండు ఇంక్రిమెంట్ల కోత విధించి విధుల్లో కొనసాగించారనే ఆరోపణలున్నాయి. సింగరేణి నిధులను భారీగా సమకూర్చిన రామగుండం వైద్య కళాశాలలో కార్మికుల పిల్లలకు సీట్లు చాలా తక్కువగా కేటాయించారని, అదే నిధులతో సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోలేదనే శ్రీధర్‌పై విమర్శలు వచ్చాయి. నాలుగు కీలక ఓసీలైన కోయగూడెం, సత్తుపల్లి, శ్రావణపల్లి, శాంతి గనులకు కేంద్రం టెండర్లను పిలిచినా సింగరేణి యాజమాన్యం టెండర్లు దాఖలు చేయకపోవడం వల్ల అవి ప్రైవేటు సంస్థలకు వెళ్లాయనే ఆరోపణలు వచ్చాయి. సింగరేణి ఉన్నత ఉద్యోగుల మస్టర్ల విక్రయాలపై కాగ్ తీవ్రంగా తప్పుపట్టిందని కూడా కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయి.

అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ ఔట్

రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవిని ప్రభుత్వం తొలగించింది. ఈమేరకు ఆమె పదవిని రద్దు చేస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్ కోసం అప్పట్లో నియమితులైన సిబ్బందిని సైతం వారి మాతృ శాఖకు పంపుతూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాగా, 2022 జూన్ 30న శ్రీదేవిని బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించింది.

సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడు నరేంద్రరావు ఫుడ్ కమిషన్‌కు..

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా పదేళ్ల పాటు చక్రం తిప్పిన ఎం.నరేంద్రరావుపై బదిలీ వేటు పడింది. రెవెన్యూలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న నరేంద్రరావును ఫుడ్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా బదిలీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత కాలం నరేంద్రరావు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొందరు ఉద్యోగులు సీఎం రేవంత్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. దీనిపై దృష్టిసారించిన ప్రభుత్వం.. నరేంద్రరావును బదిలీ చేసింది.

మళ్లీ ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్!

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఇచ్చే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు సాగిస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాఖ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ ఇటీవల రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా క్రమబద్ధీకరణ పథకాలపై చర్చించారు. ఆదాయ మార్గాలు ఏమిటి? వృథా ఖర్చులను అరికట్టడం ఎలా? అనే అంశాలపైనే ఎక్కువగా దృష్టిసారించారు. ఇందులోభాగంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, అందుకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు వివరించారు.

అప్పట్లో దరఖాస్తు ఫీజు కిందే రూ.257.47 కోట్లు

ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ కింద 25.59 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జీవో 58, 59లలో వచ్చిన దాదాపు 50 వేల దరఖాస్తుల్లోనూ కొన్ని పరిష్కారం కాలేదు. జీవో 59 కింద రుసుము వసూలు చేసినా.. జీవో 58 దరఖాస్తుల క్రమబద్ధీకరణ ఉచితమే. కాగా, 25.59 లక్షల దరఖాస్తుల్లో పంచాయతీలవి 10,83,394, మున్సిపాలిటీవి 10,60,013, కార్పొరేషన్ల పరిధిలోవి 4,16,155 ఉన్నాయి. దరఖాస్తుల్లో స్థలానికి రూ.1,000, లే అవుట్లకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం వసూలు చేసింది. దీని ద్వారానే రూ.257.47 కోట్ల ఆదాయం వచ్చింది. అనంతరం దరఖాస్తులన్నిటినీ పరిశీలించి.. ఎల్ఆర్ఎస్ కింద ఆమోదించే ప్రక్రియను ప్రారంభించింది. రూ.6 వేల కోట్ల ఆదాయం అంచనా వేసింది. అయితే, పథకంపై కొన్ని సామాజిక సంస్థలు కేసులు వేశాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళల్లోనూ ఇలాంటి పథకానికి సంబంధించి కేసులు పడ్డాయి. ఇవన్నీ ఒకే కేసుగా ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్నాయి. ఇదే కేసులో కొత్త ప్రభుత్వం ముందుకు వెళ్లనుందని సమాచారం. కాగా, ఎల్ఆర్ఎస్ కింద పాతవి, కొత్తవి దరఖాస్తుల పరిష్కారం ద్వారా రూ.10 వేల కోట్లు రావొచ్చని అంచనా. బీఆర్ఎస్‌పై 2015లోనే కొందరు హైకోర్టులో కేసు వేశారు. నాటి ప్రభుత్వం కౌంటర్ ఇవ్వకపోవడంతో పెండింగ్‌లో ఉంది.

కటాఫ్ గడువు పెంచే అవకాశాలపై పరిశీలన

బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్ కటాఫ్ గడువును కూడా పెంచనున్నారని సమాచారం. 2020 ఆగస్టు 31న ప్రకటించినపుడు.. 26.8.2020 తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన అనధికార లే అవుట్లలోని స్థలాలకే క్రమబద్ధీకరణకు అనుమతించారు. ఇప్పుడు ఆ గడువును మరో ఏడాది, రెండేళ్ల పాటు పెంచే అంశాన్ని పరిశీలించనున్నట్లు తెలిసింది. అయితే, వీటన్నింటికీ కోర్టు అనుమతివ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే.. ఎల్ఆర్ఎస్‌లో వసూలు చేసిన మొత్తాన్ని ఆయా లే అవుట్లలో మౌలిక సదుపాయాలకు ఉపయోగిస్తామని ప్రభుత్వం కోర్టులో చెప్పనుంది. ఈ మేరకు గత ప్రభుత్వమే సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయగా.. అదే అంశాన్ని మరింత బలంగా చెప్పాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోంది. మరోవైపు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఆదాయం కోసం అనేక ప్రయత్నాలు చేసినా కోర్టులో కేసు ఉండడంతో సాధ్యం కాలేదు. దీంతో 2020డిసెంబరు 30న పురపాలక శాఖ ఒక మెమోను జారీచేసింది. ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ చేయించుకోకున్నా.. 14 శాతం ఫీజు, ఆ చార్జీలపై 33శాతం కాంపౌండ్ ఫీజు కడితే భవన నిర్మాణాలకు అనుమతిచ్చేందుకు అవకాశం కల్పించింది.

అంటే 26.8.2020 లోపు రిజిస్ట్రేషన్లు అయిన అనధికార లే అవుట్‌ల లోని స్థలాలు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ కానప్పటికీ భవనాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎల్ఆర్ఎస్‌పై కేసు ఉండడంతో నిలిచిపోయిన ఈ ఆదాయం ఈ మెమో రూపంలోనైనా వస్తుందని, సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందని భావించింది. అయితే దీని వల్ల కొంతమంది మాత్రమే భవనాల నిర్మాణాలకు పెనాల్టీలు చెల్లించి అనుమతులు తీసుకున్నారు. మిగతావారంతా తమ ప్లాట్లు నగరాలు, పట్టణాలు, గ్రామాలకు దూరంలో ఉండడంతో నిర్మాణాలకు మొగ్గు చూపలేదు. వారి దరఖాస్తులూ పరిష్కారం కాలేదు. ఇవన్నీ 24 లక్షలపైనే ఉంటాయని అంచనా. వీటి పరిష్కారం దిశగా ఏం చేయాలన్న ఆలోచనలో కొత్త ప్రభుత్వం ఉంది. మరోవైపు జీవో 59 దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవాటిని క్రమబద్ధీకరించి ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. గతంలో మాదిరిగానే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న స్థలాలు, 30 అడుగుల రోడ్లు లేని ఇళ్ల స్థలాలు, చట్టపరమైన ఇతర ఉల్లంఘనలు ఉన్న స్థలాలు, లే అవుట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అనుమతి ఇవ్వకపోవచ్చని తెలిసింది.

వైసీపీకి దాడి ఫ్యామిలీ రాజీనామా

» కుమారులతో కలసి నేడు టీడీపీలోకి వీరభద్రరావు

అనకాపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీ వైసీపీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు కుటుంబం పార్టీకి రాజీనామా చేసింది. వీరభద్రరావుతో పాటు ఆయన కుమారులు దాడి రత్నాకర్, దాడి జైవీర్‌లు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పార్టీ అధినేత, సీఎం జగన్‌తో పాటు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం వీరభద్రరావు ఇద్దరు కుమారులు మీడియాతో మాట్లాడారు. తగిన ప్రాధాన్యం లేనందునే రాజీనామా చేసినట్టు తెలిపారు. తమ అనుచరులు కూడా రాజీనామా చేస్తారని చెప్పారు. బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు. తన తండ్రి సుదీర్ఘకాలం పనిచేసిన, రాజకీయ మాతృ సంస్థ టీడీపీలో చేరుతున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు.

దళితుడిగా పుట్టడమే తప్పా?

» అధిష్ఠానంపై ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం

చిత్తూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు బాగాలేదని రాష్ట్రవ్యాప్తంగా దళిత ఎమ్మెల్యేలను మార్చేస్తూ అగ్రకులాల వారికి మాత్రం మళ్లీ సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. కేవలం దళితులపై మాత్రమే వ్యతిరేకత ఉందా? అని ఆయన ప్రశ్నించారు. డబ్బులిస్తే సర్వేలు చేసే ఐప్యాక్ పేరు చెప్పి తనకు సీటు నిరాకరించడం దారుణమన్నారు. 2019 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ఎంఎస్ బాబుకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని వైసీపీ అధిష్ఠానం తేల్చిచెప్పడంతో మంగళవారం ఆయన చిత్తూరులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఐప్యాక్ సర్వే కరెక్టు కాదు. డబ్బులిస్తే సర్వే ఫలితాలను మార్చేస్తారు. నా వ్యాపారాలు, కుటుంబాన్ని వదిలేసి పార్టీ కోసమే ఈ ఐదేళ్లు కష్టపడ్డాను. ఇప్పుడు నాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు. సీఎం గారూ! దళితులకు మోసం చేయొద్దు. న్యాయం చేయండి.' అని ఆవేదన వెలిబుచ్చారు.

రేపే కాంగ్రెస్‌లోకి షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు వారికి స్పష్టత ఇచ్చారు. ఏఐసీసీలో కీలక పదవి, ఆంధ్రప్రదేశ్ పీసీసీ బాధ్యతలు తనకిచ్చే అవకాశం ఉందనీ వారికి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యనాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అధిష్ఠానం ఏ బాధ్యత ఇచ్చినా స్వీకరించాలని, ఊగిసలాట వద్దని తూడి దేవేందర్‌రెడ్డి సూచించారు. ఊగిసలాట ఉండదని, విలీనం తర్వాత కాంగ్రెస్ ఇచ్చిన బాధ్యత స్వీకరించి పోరాటానికి సిద్ధపడతానని షర్మిల పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం లేదా నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఒకరిద్దరు నేతలు సూచన చేశారు. సమావేశం అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. అన్ని అంశాలపై రెండ్రోజుల్లో స్పష్టత ఇస్తానన్నారు. తన వెంట నడుస్తానని ప్రకటించిన ఆళ్ల రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆమె ఇడుపులపాయ బయల్దేరి వెళ్లారు.

చేరికపై ఇదివరకే నిర్ణయం: షర్మిల

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని, దీనిపై ఇది వరకే నిర్ణయం తీసుకున్నానని షర్మిల తెలిపారు. ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వేదికగా సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించారు. మంగళవారం వైఎస్ఆర్ ఘాట్‌ను షర్మిల, ఆమె తల్లి వైఎస్ విజయలక్ష్మి, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ, ఆమె తల్లిదండ్రులు అట్లూరి శ్రీనివాస్, మాధవితో కలిసి సందర్శించారు. కుమారుడి వివాహ పత్రికను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఉంచారు. సమాధి వద్ద, ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని తండ్రి చెంతకు వచ్చామని, ఆయన ఆశీర్వాదం


తండ్రి సమాధిపై కుమారుడి వివాహ పత్రికను ఉంచి ఆశీర్వాదం పొందుతున్న షర్మిల, కుటుంబ సభ్యులు

తీసుకున్నామని షర్మిల అన్నారు. కాంగ్రెస్‌లో పనిచేయాలని ఇదివరకే నిర్ణయించామని, తెలంగాణలో కాంగ్రెస్‌కు తాము మద్దతివ్వడం వల్లే అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని దించడంలో వైఎస్ఆర్‌టీపీ చాలా పెద్దపాత్ర పోషించిందని.. 31 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, తాము పోటీచేయకపోవడమే దీనికి కారణమని తెలిపారు. తాము పోటీ చేసి ఉంటే కాంగ్రెస్‌కు ఇబ్బంది తలెత్తేదని, తమ పార్టీ, తాను చేసిన త్యాగానికి విలువిచ్చి.. కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. 'ఆ పార్టీతో కలిసి పనిచేసేందుకు అభ్యంతరం లేదు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ. ప్రజల భద్రత కోసం పనిచేసే పార్టీని బలపరచాలని నిర్ణయించాం. బుధవారమే ఢిల్లీ వెళ్తున్నా. ఒకట్రెండు రోజుల్లో మీ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది' అని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరాక షర్మిల విజయవాడ రానున్నారు. ఆమె సమక్షంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులతో కలసి పార్టీలో చేరతారు.

అన్నా.. మేనల్లుడి పెళ్లికి రా!

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టనున్న వైఎస్ఆర్‌టీపీ నాయకురాలు వైఎస్ షర్మిల.. తన అన్న, సీఎం జగన్మోహన్‌రెడ్డితో బుధవారం తాడేపల్లిలో సమావేశం కానున్నారు. తన కుమారుడు, ఆయన మేనల్లుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేయనున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి ప్యాలెస్‌కు రావాలని షర్మిలకు జగన్ నుంచి సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె విజయవాడ రానున్నారు. తాడేపల్లి వెళ్లి జగన్‌కు పెళ్లి పత్రికను అందజేసి ఆహ్వానించాక.. నేరుగా గన్నవరం విమానాశ్రయం వెళ్లి.. ఢిల్లీ బయల్దేరతారు. తన విజయవాడ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని ఆమె కాంగ్రెస్ నేతలకు తెలియజేసినట్లు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారం ఉదయమే ఢిల్లీ వెళ్తున్నారు.

మార్పులు.. మంటలు!

మరో 24 మంది వైసీపీ సిటింగ్‌లు అవుట్!.. మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై జగన్ వేటు!

» వైసీపీ ఇన్‌చార్జుల రెండో జాబితా
» ఎంపీ గోరంట్ల మాధవ్‌కు మొండిచేయి
» గొల్ల బాబూరావు, మల్లాది విష్ణుకు కూడా
» ఐదు చోట్ల వారసులకు చాన్సు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇన్‌చార్జుల నియామకం.. ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో ఆగ్రహజ్వాలలు రేపుతోంది. గ్రాఫ్ పడిపోయిందని.. ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉందంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డి తమకు మొండిచేయి చూపడంపై మండిపడుతున్నారు. రెండో జాబితాలో ఆయన మరో 24 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు టికెట్ నిరాకరించారు. మరో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రామచంద్రపురం నుంచి రాజమండ్రి రూరల్‌కు పంపించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును తొలగించి.. మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును విజయవాడ వెస్ట్ నుంచి అక్కడకు తరలించారు. తొలి జాబితాలో 11 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను ప్రకటించిన జగన్.. మంగళవారం రెండో జాబితాలోనూ మూడు ఎంపీ స్థానాలు, 24 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారుచేశారు. ఈ జాబితాను మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. తాజా జాబితాలో.. పార్టీ పెట్టినప్పటి నుంచి ఉన్న సిటింగ్‌లను తొలగించారు. ఐదుచోట్లవారసులకు బాధ్యతలు అప్పగించారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డికి, చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి, మచిలీపట్నంలో పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే షేక్ ముస్తాఫా కుమార్తె షేక్ నూర్‌ఫాతిమా, రామచంద్రపురంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్‌కు అవకాశం కల్పించారు. బళ్లారి మాజీ ఎంపీ శాంత మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ కలిసి వైసీపీలో చేరారు. ఆమెను హిందూపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. హిందూపురం సిటింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను ఇంతకాలం వెనకేసుకొచ్చిన జగన్.. అకస్మాత్తుగా తప్పించి శాంతకు అవకాశం కల్పించారు. పెనుగొండ ఎమ్మెల్యే మాజీమంత్రి ఎం.శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. అరకు ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించి.. అరకు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి లోక్‌సభ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. విజయనగరం జిల్లా రాజాం(ఎస్సీ) ఎమ్మెల్యే కంబాల జోగులును అనకాపల్లి జిల్లా పాయకరావుపేట(ఎస్సీ) నియోజవర్గానికి బదిలీ చేశారు. వైసీపీ స్థాపించిన నాటి నుంచి జగన్ వెంట నడుస్తున్న గొల్ల బాబూరావుకు రిక్తహస్తం చూపించారు. అనకాపల్లిలో మంత్రి అమర్నాథ్ స్థానంలో మలసాల భరత్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మార్చి.. వరుపుల సుబ్బారావుకు అవకాశం కల్పించారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ ఇన్‌చార్జిగా పంపారు. రాజమండ్రి లోక్‌సభకు అభ్యర్థిని ప్రకటించలేదు. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి స్థానంలో బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను నియమించారు. యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ స్థానంలో తాడిపత్రి చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జిగా పెట్టారు. సురేశ్‌ను తొలి జాబితాలోనే కొండపికి పంపించిన విషయం తెలిసిందే. జగన్ వైసీపీ



స్థాపించిన నాటి నుంచి జగన్ వెంట నడచిన పోలవరం (ఎస్టీ) ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గ్రాఫ్ పడిపోయిందంటూ ఆయన భార్య రాజ్యలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. కల్యాణదుర్గం అసెంబ్లీ స్థానం బాధ్యతను అనంతపురం ఎంపీ తలారి రంగయ్యకు అప్పగించారు. విజయవాడ పశ్చిమలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు స్థానంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్‌ను నియమించారు. మల్లాది విష్ణుకు మొండిచేయి చూపి.. వెలంపల్లిని విజయవాడ సెంట్రల్‌కు బదలాయించారు. ఈ ఎపిసోడ్‌లో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన విష్ణును బలిపశువును చేశారన్న విమర్శలు వస్తున్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు టికెట్ దక్కలేదు. ఆయన స్థానంలో మాజీ మంత్రి తోట నరసింహానికి అవకాశమిచ్చారు. కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం అసెంబ్లీ సీటు దక్కింది. పెండెం దొరబాబుకు టికెట్ దక్కలేదు. కాకినాడ ఎంపీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. తొలి జాబితాలో 11 మందిని మార్చినప్పుడు.. అందులో ఎంపీ మోపిదేవి వెంకట రమణను రేపల్లె ఇన్‌చార్జిగా తప్పించడంపై ఇప్పటికీ అక్కడ నిరసనలు సాగుతున్నాయి.

కడదాకా మంతనాలు!

అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జుల ప్రకటనపై కడదాకా వైసీపీ అధిష్ఠానం మంతనాలు సాగించింది. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కలిశారు. నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని జగన్ ఆయన్ను ఆదేశించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కొన్ని షరతులు విధించారని సమాచారం. నెల్లూరు సిటీలో మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను, కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, ఉదయగిరిలో మేకపాటి రామ్‌గోపాల్‌రెడ్డిని మార్చాలని సూచించినట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. అయితే అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి పోటీ చేస్తారని జగన్ స్పష్టం చేశారు. ఉదయగిరికి రామ్‌గోపాల్‌కంటే మంచి అభ్యర్థి ఉంటే తీసుకురావాలని వేమిరెడ్డికి సూచించారని తెలిసింది. 'నెల్లూరు ఎంపీగా పోటీకి ఎందుకు భయపడుతున్నావ్? కచ్చితంగా మనమే గెలుస్తాం. ధైర్యంగా పోటీ చేయి' అని స్పష్టం చేశారు.


కామారెడ్డి జిల్లా నాచుపల్లిలో రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఇసుక దోపిడీకి పాల్పడితే క్రిమినల్ కేసులు

» కాంగ్రెస్ శ్రేణులను వేధిస్తే.. బీఆర్ఎస్ నాయకులను వదలం
» మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక

బాన్సువాడ, జనవరి 2: మంజీరాలో ఇసుక మాఫియా ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్విందో వెంటనే సర్వే చేయాలని కామారెడ్డి జిల్లా మైనింగ్ అధికారులను ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఇసుక దోపిడీదారులను గుర్తించి.. పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. అక్రమాలకు పాల్పడినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా నస్రూల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల చేతిలో హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములు కుటుంబాన్ని మంగళవారం జూపల్లి పరామర్శించారు. బాన్సువాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాములును చంపినవారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లారా ఖబడ్దార్.. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై దాడులకు దిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుస్తాడనే రాములుపై బీఆర్ఎస్ నాయకులు కక్ష కట్టి హత్య చేశారని ఆరోపించారు. ఇసుక మాఫియా నాయకుడు, నాచుపల్లి విండో చైర్మన్ సుధీర్ ప్రణాళిక ప్రకారం మరో నలుగురు ఈ హత్యలో పాల్గొన్నారని.. వీరు ఊచలు లెక్కపెట్టేలా చేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాములు కుటుంబాన్ని పరామర్శించానని, పార్టీ ఫండ్ కింద రూ.లక్ష అందజేశామని వివరించారు.

ఆ 8 వైద్య కాలేజీల పరిస్థితేంటి?

» కొత్త కాలేజీలకు హడావుడిగా గత ప్రభుత్వం దరఖాస్తు
» మహేశ్వరం, అల్వాల్, యాదగిరిగుట్టలో ఆస్పత్రులే లేవు!
» జనవరి, ఫిబ్రవరిలోనే ఎన్ఎంసీ తనిఖీలు?
» కొత్త కాలేజీల ఏర్పాటుపై ముందుకా? వెనక్కా?

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కారు గత ఏడాది హడావుడిగా ఎనిమిది కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసేసింది. ఇప్పుడా కాలేజీలను ఏర్పాటు చేయాలా? వద్దా? అనే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఆ కాలేజీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలా..? లేక ఆపేయాలా? అన్నదానిపై స్పష్టతకు రాలేకపోతోంది. దీనిపై రెండు రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చించినట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వైద్యులతోనూ మాట్లాడినట్లు తెలిసింది. ఉన్న కాలేజీలు సరిపోతాయని, కొత్తగా దరఖాస్తు చేసిన వాటిని ఏర్పాటు చేయకపోవడమే ఉత్తమమని ఆ ఎమ్మెల్యేలు మంత్రికి సూచించినట్లు సమాచారం. పైగా ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని, అంతమందిని సర్దుబాటు చేయలేమని చెప్పినట్లు తెలుస్తోంది. ఓవైపు రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల పరిస్థితిపై సర్కారు తర్జనభర్జన పడుతుండగా.. మరోవైపు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) రాష్ట్రానికి తనిఖీలకు రానుంది. జనవరి, ఫిబ్రవరిలోనే ఈ తనిఖీలుంటాయని వైద్యవర్గాలు తెలిపాయి. తనిఖీల సమయానికల్లా కొత్త కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, తరగతుల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి. నిబంధనల మేరకు వసతులుంటేనే ఎన్ఎంసీ అనుమతులిస్తుంది. లేకపోతే ఇవ్వదు. ఆ 8 కొత్త కాలేజీల ఏర్పాటుకై గత సర్కారు జీవోలిచ్చింది. అయితే వాటిలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మేడ్చల్ జిల్లా అల్వాల్, యాదాద్రి జిల్లా భువనగిరిలో కనీస ఆస్పత్రులు కూడా లేవు. రాష్ట్రంలో గత సర్కారు వరసగా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. దీంతో వైద్య విద్యాశాఖ ఉక్కిరిబిక్కిరైంది. ప్రధానంగా వైద్యవిద్య అధ్యాపకులను సర్దుబాటు చేసుకోవడం తలకు మించిన భారమైంది. పైగా సర్కారు ఇచ్చే జీతాలకు వైద్యులు స్పందించలేదు. మెడికల్ బోర్డు ద్వారా నియామక ప్రక్రియ చేపట్టినా.. ఆశించిన స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు జరగలేదు. దాంతో వెంటవెంటనే మెడికల్ కాలేజీల ఏర్పాటు సాధ్యం కాదని మాజీ డీఎంఈ రమేశ్‌రెడ్డి గత సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నింటినీ వివరిస్తూ లేఖ కూడా రాసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయాలనుకుంటున్న 8 కాలేజీలను ఏడాది పాటు వాయిదా వేయాలని అందులో సూచించినట్లు పేర్కొన్నారు. కానీ, కేసీఆర్ సర్కారు పట్టించుకోలేదు.

చివరి నిమిషంలో దరఖాస్తు..

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి పది జిల్లాల్లో ఐదు మెడికల్ కాలేజీలు ఉండేవి. కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత తొలుత 4 కొత్త కాలేజీలు వచ్చాయి. 2021లో మరో 8 కాలేజీల ఏర్పాటుతో మరో 1200 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం 2022లో మరో 9 చోట్ల వైద్య కళాశాలలను ఏర్పాటు చేసింది. వాటిలో 900 సీట్లు వచ్చాయి. 2023లో కూడా మరో 8 చోట్ల 50 సీట్లతో కొత్త మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేసింది. చివరి నిమిషంలో, అదీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ దరఖాస్తు చేయడం గమనార్హం. గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఈ కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన ఘనత తమకే దక్కుతుందని భావించింది. వాస్తవానికి 50 సీట్లతో కొత్త మెడికల్ కాలేజీల కోసం ఎవరూ దరఖాస్తు చేయరు. గత ప్రభుత్వం మాత్రం దరఖాస్తు చేసింది. 8 కాలేజీల ఏర్పాటు కేసీఆర్ సర్కారుకు ఇష్టం లేదని, ఎన్నికల నేపథ్యంలో తప్పనిసరై దరఖాస్తు చేసిందని అధికారులు చెబుతున్నారు.

ఏఆర్ఆర్ దాఖలుకు నెలరోజుల గడువు?

2024-25కుగాను వార్షిక ఆదాయ అవసరాలు(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించడానికి నెలరోజుల పాటు గడువు పొడిగించాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ)ని డిస్కంలు కోరాయి. ఏఆర్ఆర్ దాఖలు చేయడానికి ఈఆర్సీ ఇచ్చిన గడువు మంగళవారంతో ముగియడంతో ఈ మేరకు డిస్కంలు గడువును పెంచాలని కోరుతూ విజ్ఞప్తి చేశాయి. దాంతో జనవరి 2లోపు దాఖలు చేయడానికి అవకాశం ఇస్తూ ఈఆర్సీ నిర్ణయం తీసుకుంది. కాగా, ఓపెన్ యాక్సెస్ ద్వారా కరెంట్ కొనుగోలు చేసేవారి నుంచి యూనిట్‌కు రూ.1.95 అదనపు సర్‌చార్జీగా వసూలు చేయాలని డిస్కంలు నిర్ణయించాయి. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి అర్ధవార్షికం(ఏప్రిల్ 1నుంచి సెప్టెంబరు నెలాఖరుదాకా) యూనిట్‌కు రూ.1.95లు వసూలు చేయడానికి అనుమతి కోరుతూ ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాయి. తొలి అర్ధవార్షికంలో ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయాలు 354.75 మిలియన్ యూనిట్లుగా ఉంటాయని అంచనా.


డీఆర్వోకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు

నర్సంపేట మునిసిపాలిటీలో ముసలం

» చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం

నర్సంపేట, జనవరి 2 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీలో రాజకీయ ముసలం రేగింది. నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినిపై బీఆర్ఎస్‌కు చెందిన 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఇందుకు సంబంధించిన తీర్మాన పత్రాన్ని వరంగల్ కలెక్టరేట్‌లో డీఆర్వో వాసుచంద్రకు మంగళవారం అందజేశారు. నర్సంపేట మునిసిపాలిటీలో 24 వార్డులు ఉండగా ఇందులో 18 వార్డుల్లో బీఆర్ఎస్, 6 వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 18 మందిలో 17 మంది చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెడుతున్నట్లు వెల్లడించారు. గతంలోనూ మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు ప్రయత్నించారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు క్యాంప్ కూడా పెట్టుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి జనవరి 27 వరకు అవకాశం లేదని తెలిసి తిరిగివచ్చారు. ఇప్పుడు మళ్లీ అవిశ్వాసం పెట్టారు. అయితే, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి తెలిసే ఇదంతా జరిగిందా ? అనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

గృహలక్ష్మి పథకం రద్దు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ సర్కారు రద్దు చేసింది. ఈ పథకం స్థానంలో 'అభయహస్తం' పేరుతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొంది. సొంత జాగా కలిగిన పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థికసాయం చేసేలా గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తెచ్చిన విషయం తెలిసిందే. దీని కింద రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మందికి ఇళ్ల నిర్మాణానికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2,12,095 మందికి మంజూరు పత్రాలను కూడా జారీ చేశారు. అయితే దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. జారీ చేసిన మంజూరు పత్రాలను కూడా రద్దు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా అభయహస్తం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించింది.

డిజిటల్ కంప్లైంట్ బాక్సులకు.. 1.38 లక్షల ఫిర్యాదులు!

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ వాడకం పెరిగిన తర్వాత ఠాణా మెట్లు ఎక్కకుండానే నేరుగా ఫిర్యాదు చేసే వెసులుబాటును రాష్ట్ర పోలీసులు కల్పించారు. అందుకోసం డిజిటల్ కంప్లైంట్ బాక్సులు(ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్) ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఈ ఫిర్యాదులను బీట్ కానిస్టేబుల్ మొదలు.. ఎస్పీలు, కమిషనర్ల దాకా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో.. సమస్యలకు వెంటనే పరిష్కారాలు లభిస్తున్నాయి. గతేడాది సోషల్ మీడియా వేదికగా 1,38,783 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. దీనికి తెలంగాణ పోలీసు యాప్ హాక్-ఐ ద్వారా వచ్చిన 15,579 ఫిర్యాదులు అదనమని, డయల్-100, ఎస్వోఎస్-112 ద్వారా 16,09,616 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు.

డివైడర్‌ను దాటివచ్చిన మృత్యువు!

» రెండు కార్లు ఢీకొని ముగ్గురి మృతి
» 8 మందికి తీవ్ర గాయాలు
» మృతులు హైదరాబాద్ వాసులు
» ఏపీలోని బంధపురం వద్ద ప్రమాదం

దేవరపల్లి/కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2: కొత్త సంవత్సరాన్ని ఎంతో ఆనందంగా స్వాగతించిన ఆ కుటుంబం.. అంతలోనే తీవ్ర విషాదంలో మునిగిపోయింది. డివైడర్ దాటి వచ్చి మరో కారు ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం తూర్పుగోదావరి జిల్లాలో జాతీయరహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. బాధితులంతా హైదరాబాద్‌కు చెందిన వారే. దివ్యప్రియ సొంతూరు విశాఖపట్నంలోని గాజువాక. అత్తింటివారిది హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం! డిసెంబరు 31, జనవరి 1 సెలవులను సంతోషంగా గడిపేందుకు అత్త రమాదేవి, భర్త సుభాష్ గౌడ్, 19నెలల కుమార్తె, మరికొందరు కుటుంబసభ్యులతో కలిసి డిసెంబరు 30న విశాఖపట్నం వచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు 'ఎర్టిగా' కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 1.45 గంటలకు వీరు ప్రయాణిస్తున్న వాహనం... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బంధపురం వద్దకు చేరుకుంది. కారును సుభాష్ గౌడ్ నడుపుతున్నారు. అదే సమయంలో... అటువైపు నుంచి వస్తున్న మరో 'ఎర్టిగా' కారు హైవేపై డివైడర్ దాటి ఇటువైపునకు వచ్చింది. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోగానే... అటు వైపు నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. అందులో... కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పాస్టర్ వేల్పుల విజయ మోహన్,


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

వేల్పుల సంజనీగ్రేస్, రోహిన్, అమితశ్రీ ఉన్నారు. ఆ వాహనాన్ని పాస్టర్ విజయ్ మోహన్ నడుపుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలుపగా... టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పిందని విజయ్ మోహన్ చెబుతున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సుభాష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఆయన తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25)ను కొవ్వూరు ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె కనిష్క (19నెలలు) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సుభాష్ బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటి వచ్చి ఢీకొట్టిన కారులో ఉన్నవారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అయిన వారిని కోల్పోయి...

ప్రమాదంలో తన తల్లి, భార్య, కుమార్తె చనిపోయినట్టు సుభాష్‌కు మంగళవారం అర్ధరాత్రి దాకా తెలియదు. "నేను హైదరాబాద్‌లో ఇంటీరియర్ డెకరేషన్ బిజినెస్ చేస్తున్నా. నేను డ్రైవింగ్ చేస్తుండగా నా భార్య, పాప నా పక్క సీటులో కూర్చున్నారు. నా తల్లి, చెల్లి, బావ, మేనల్లుడు వెనుక సీటులో కూర్చున్నారు. ప్రమాదం జరిగిన తరువాత ఏం జరిగిందో తెలియదు. మావాళ్లు ఎలా ఉన్నారో చెప్పండి'.. అంటూ సుభాష్ కన్నీటి పర్యంతమయ్యారు. ఆయనకు దేవరపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత విజయం

గత ఏడాది చరిత్రాత్మక చంద్రయానంతో అద్భుతాన్ని సృష్టించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), మరో చక్కని విజయంతో ఈ కొత్త సంవత్సరంలోకి ప్రవేశించింది. సోమవారం ఉదయం పదకొండు పరికరాలు, ఉపగ్రహాలతో కూడిన పీఎస్ఎల్‌వి–సీ58 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయి తన కర్తవ్యాన్ని సంపూర్ణంగా నెరవేర్చింది. ఆ పేలోడ్‌లో మిగతావి అటుంచితే, 480 కిలోగ్రాముల బరువున్న ఎక్స్‌రే పొలారిమీటర్ సాటిలైట్– ఎక్స్‌పోశాట్ మన ఖగోళ అధ్యయనంలో ఒక అద్భుత పురోగతి. తన ఐదేళ్ళ జీవితకాలాన్ని ఇది ప్రధానంగా కృష్ణబిలాలను అధ్యయనం చేయడానికి వినియోగిస్తుంది. ఎక్స్‌రే ఫోటాన్లు, వాటి పోలరైజేషన్ తెలుసుకోవడం ద్వారా కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల రేడియేషన్ గుట్టు విప్పుతుంది.

కాస్మిక్ ఎక్స్‌రేలను అధ్యయనం చేయడానికి భారతదేశం ఇలా అంతరిక్షంలోనే ఒక అబ్జర్వేటరీని ఏర్పాటు చేసుకుంది. అమెరికా మాత్రమే ఈ విషయంలో మనకంటే ముందున్నది కనుక ఇది సగర్వంగా చెప్పుకోవాల్సిన పరిణామం. కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల గురించి ఎంతోకొంత అవగాహన ఉన్నా, వాటి పుట్టుపూర్వోత్తరాల విషయంలో మనిషి తెలుసుకోవాల్సింది చాలానే ఉన్నది. చివరకు కాంతిని సైతం దిగమింగే బలమైన అయస్కాంత శక్తితో, లక్షలాది సూర్యుల ద్రవ్యరాశితో అంతులేని ఆకాశంలో అంతుచిక్కని బ్రహ్మ రహస్యం కృష్ణబిలం. వాటినుంచి వెలువడే శక్తిమంతమైన ఎక్స్‌రేల ప్రవర్తనను సక్రమంగా విశ్లేషించినప్పుడు ఆవిర్భావక్రమాన్ని కొంతమేరకు అర్థం చేసుకోగలం. నాసాకు చెందిన 'ఇమేజింగ్ ఎక్స్‌రే పొలారిమెట్రీ ఎక్స్‌ప్లోరర్ (ఐఎక్స్‌పిఇ) 2021డిసెంబరు నుంచి ఇదే అధ్యయనాన్ని మొదలుపెట్టింది. అయితే, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని సాధించే లక్షణం ఉన్న ఇస్రో ఈ విషయంలోనూ పైచేయిగానే ఉంది. ఐఎక్స్‌పీఈ కోసం నాసా 188 మిలియన్ డాలర్లు ఖర్చుచేస్తే, దాని జీవితకాలం రెండేళ్ళు మాత్రమే. ఎక్స్‌పోశాట్ కోసం మనం వెచ్చించింది 30 మిలియన్ డాలర్లు, దీని జీవితకాలం ఐదేళ్ళు. అంతరిక్షంనుంచి వెలువడే యాభైరకాల కాంతిపుంజాలను అధ్యయనం చేయడానికి కేవలం 250కోట్ల రూపాయలతో అంతరిక్షంలోనే ఓ అబ్జర్వేటరీని నెలకొల్పుకోవడం వంటి విన్యాసాలు ఇస్రోకు కొత్తేమీ కాదు. హాలీవుడ్ సినిమాకంటే తక్కువ ఖర్చుతో అది చంద్రయానం చేసింది. అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్‌ను, సాంకేతికంగా అత్యున్నతమైన ఉపగ్రహాలను నామమాత్రపు ఖర్చుతో అభివృద్ధి చేసుకుంది. దేశవిదేశీ ఉపగ్రహాల ప్రయోగాన్ని విజయవంతంగా నెరవేర్చుతూ దానిని లాభాలబాట పట్టించిన పీఎస్ఎల్‌వి ఈ ప్రయోగంలోనూ అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది. భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులో ఎక్స్‌పోశాట్‌ను జారవిడిచిన తరువాత, నాలుగోదశలో రాకెట్ తనకు తానుగా 350 కిలోమీటర్లు తగ్గి, మిగతా పని పూర్తిచేయడం ఓ ఆశ్చర్యకరమైన విన్యాసం.

ఎక్స్‌పోశాట్ మాదిరిగానే, ఇటీవలి ఆదిత్య ఎల్1 కూడా స్పేస్ అబ్జర్వేటరీయే. చందమామను చేరడానికి పెట్టిన ఖర్చులో సగం వెచ్చించి సూర్యుడిని తెలుసుకోవడానికి ఇస్రో సిద్ధపడింది. జనవరి 6న ఆదిత్య ఎల్1 తన చిట్టచివరి విన్యాసాన్ని ముగించుకొని గమ్యాన్ని చేరబోతున్నది. ఆగస్టులో చంద్రయానం జరగ్గానే, సెప్టెంబరులోనే ఆదిత్యకు అంకురార్పణ చేయడం ఓ సాహసం. ఇస్రో తొలి అడుగులు వేస్తున్నప్పటికే, అమెరికా చంద్రుడిమీదకు వ్యోమగాములను దించింది. అటువంటిది ఇప్పటివరకూ ఎవరూ కాలూనని, అత్యంత కఠినమైన చంద్రుడి దక్షిణ ధ్రువంలో సాఫ్ట్‌ల్యాండింగ్ విజయవంతం చేయడం ఇస్రో కీర్తికిరీటంలో ఓ కలికితురాయి. చంద్రుడిమీదకు సున్నితంగా వాలే ఆ 'ఫిఫ్టీన్ మినిట్స్ ఆఫ్ టెర్రర్'లో ఎదురయ్యే అవాంతరాలను ల్యాండర్ మాడ్యుల్ స్వయంగా అధిగమించే రీతిలో తయారు చేయడం ఇస్రో దూరదృష్టికి నిదర్శనం. ప్రయాణమార్గంలో అడ్డువచ్చిన అగాధాన్ని తనకుతానుగా తప్పించుకొని తిరిగి తనపని తాను చేసుకుపోయిన రోవర్ ప్రజ్ఞాన్ కూడా ఓ అద్భుతమే. చంద్రయాన్, ఆదిత్య మాత్రమే కాదు, గత ఏడాది రీయూజబుల్ లాంచ్ వెహికల్‌ను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగానికి కొద్ది క్షణాలముందు రాకెట్లో ఓ లోపాన్ని గుర్తించి, గంటలోపే సరిచేసుకొని, మానవ సహిత గగనయానికి అత్యంత కీలకమైన క్ర్యూ ఎస్కేప్ మోడల్ పరీక్షను కూడా అది దిగ్విజయం చేసుకుంది. భారత అంతరిక్ష చరిత్రలో 2023 ఇస్రోకు విజయవంతమైన ఏడాది. చేతిలో 14ప్రాజెక్టులతో, మరిన్ని ఉన్నతమైన లక్ష్యాలతో ఈ కొత్త సంవత్సరంలో అది మరింత దూసు-

రామమందిరం సరే, రామరాజ్యం ఎక్కడ?

బాబ్రీ మసీదు కట్టడం నేలమట్టం కావడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ సంఘటన సంభవించిన డిసెంబర్ 6, 1992 ముందు రోజు రామజన్మభూమి మీడియా సెంటర్ డైరెక్టర్ రమాశంకర్ అగ్నిహోత్రిని కలిసినప్పుడు ఆ కట్టడాన్ని కూల్చివేయనున్నారని ఆయన సూచన ప్రాయంగానైనా వెల్లడించలేదు (అగ్నిహోత్రి సాధారణ వ్యక్తి కాదు. ఆరఎసఎస్ సర్ సంఘ్ చాలక్ ఆరఎస్ సుదర్శన్‌ను స్వయం సేవక్‌గా మార్చిన వ్యక్తి) ఆ మరునాడు అద్వాణీ, మురళీ మనోహర్ జోషీ, ఉమాభారతి, వినయ్ కతియార్, సాధ్వీ రితంబర తదితరులు ఉద్వేగపూరితంగా, ఉద్రిక్తభరితంగా ప్రసంగాలు చేస్తుండగా కరసేవకులు బాబ్రీ కట్టడాన్ని కూల్చివేశారు. గుమ్మటాలపై ఎక్కినవారు వాటిని కూలుస్తూనే తాము కూడా శిథిలాలతో పాటూ నేల కూలిపోతున్నా ఆ భావోద్వేగంలో వారు లెక్కచేయలేదు. ఆ కట్టడం కూల్చివేసిన స్థలంలోనే మూడు దశాబ్దాల తర్వాత శ్రీరాముడి మందిరాన్ని ప్రారంభిస్తారని నాడు ఎవరనుకున్నారు? ఆ బీభత్స దృశ్యాలూ ఇంకా కళ్లముందు కదలాడుతున్నాయి. దేశ ప్రజలకు ఇవాళ అయోధ్యలో శ్రీరాముడి మందిరం మాత్రమే కనపడవచ్చు. కాని దాని వెనుక ఉన్న చరిత్ర, ఆ చరిత్రలో జరిగిన విధ్వంసం, వందలాది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం గురించి ఇప్పుడెక్కడా చర్చ జరగడం లేదు.



'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని సుగ్రీవుడు అడిగితే 'అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించేవాణ్ణి' అని రాముడు జవాబిస్తాడు. రాజ్యాన్ని తృణప్రాయంగా వదులుకున్న సుగుణోత్తముడు శ్రీరాముడు. మరి ఆ పుణ్య పురుషుడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి భారతీయ జనతాపార్టీ నాయకులు ఎటువంటివారు? అయోధ్యలో శ్రీరాముడి మందిర ప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది.

రామమందిరంకోసం నాడు బీజేపీ నేత అద్వాణీ రథ యాత్ర జరిపారు. ఈ రథయాత్ర మూలంగా బీజేపీ రాజకీయంగా బలపడింది. 1989 ఎన్నికలతో పోలిస్తే 1991లో బీజేపీ దేశ వ్యాప్తంగా తన ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకున్నది. పార్లమెంట్‌లో రెండవ అతిపెద్ద పార్టీగా ఎదిగింది. ఇవాళ అదే రామమందిరం నిర్మాణం ఘనతను తనకు ఆపాదించుకున్న నరేంద్రమోదీ ఈ మందిరం ఆధారంగా 2024లో మూడోసారి గెలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శ్రీరాముడు, రామమందిరం బీజేపీ రాజకీయ ఎజెండా మాత్రమేనని ఇవాళ అందరికీ తెలుసు. రామమందిరాన్ని నిర్మించింది ట్రస్ట్ అయితే దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ ఎందుకు భావిస్తోంది? రథయాత్ర ప్రారంభించి, బాబ్రీ మసీదు కూల్చివేతను ప్రత్యక్షంగా తిలకించిన అద్వాణీకి ఇవాళ ఈ మందిర ప్రారంభోత్సవ ఘట్టంలో ఎక్కడా ప్రాధాన్యత లభించడం లేదు. ప్రధాని మోదీయే ఆ మందిరాన్ని ప్రారంభిస్తున్నారు. మందిర నిర్మాణాన్ని దేశ చరిత్రలో ఒక బృహత్తర ఘట్టంగా జరుగుతోన్న ప్రచారానికి ఆయనే సారథ్యం వహిస్తున్నారు. గత వారం బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆలయ ప్రారంభోత్సవమే ప్రధాన ఎజెండాగా చర్చించారు. ఈ ఆలయ నిర్మాణంలో బీజేపీ ఎలాంటి కీలక పాత్ర పోషించిందీ ఇంటింటికి వెళ్లి వివరించమని మోదీ ఆదేశించారు. రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆ రోజు ప్రతి భారతీయుడి ఇంటిలో మరో దీపావళి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం మళ్లీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించి జనవరి 22 తర్వాత అయోధ్యలో రామమందిర ప్రారంభం తర్వాత పెద్ద ఎత్తున మందిర్ దర్శన్ అభియాన్‌ను ఎలా కొనసాగించాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్ణయించారు. మందిర ప్రారంభాన్ని దేశమంతటా ప్రత్యక్ష ప్రసారం ద్వారా కోట్లాది ప్రజలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కనీసం రెండున్నర కోట్లమందిని అయోధ్యకు రప్పించి దర్శనం చేయించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఒకప్పుడు మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడంపై దేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి. రాను రానూ మతాన్ని ఉపయోగించుకోవడం సర్వసాధారణమైపోయింది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి స్వయంగా 'జై బజరంగ్ బలీ' అని నినాదాలు చేశారు. అధికారంలో ఉన్న పార్టీ బాహాటంగా మతాన్ని ఉపయోగించుకునేందుకు రామమందిర ప్రారంభం ఇప్పుడు స్పష్టంగా ఉపయోగపడుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పుల్వామా, బాలాకోట్ మోదీకి ఆయుధాలుగా మారితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో రామమందిరం ప్రధానాస్త్రంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ప్రజల్లో నెలకొన్న భక్తి విశ్వాసాలను ఒక రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఎంతవరకు సబబు? ఇది ప్రజాస్వామ్యంలో సరైనదేనా? దీనిపై న్యాయస్థానాలు కానీ, ఎన్నికల కమిషన్ కానీ కలుగచేసుకునే అవకాశాలు లేవా? అయినా ఇవాళ వ్యవస్థలు స్వతంత్రంగా, విచక్షణాయుతంగా నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎక్కడిది?

బాల్యంలో ఆంజనేయుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారం. హనుమంతుడి కథలు విని నడుముకు తోకలాగా ఏదో గుడ్డ తగిలించుకుని ఆడుకునేవారం. రాముడిలా చీపురుపుల్లలతో బాణాలు వేసేవారం. ఎన్టీఆర్ శ్రీరాముడి వేషంతో రాక్షసులను వధిస్తుంటే ఉత్కంఠతో చూసేవారం. సీతారామకల్యాణం సినిమా టిక్కెట్లకోసం కిక్కిరిసిన లైన్లలో నిలుచున్న దృశ్యం ఇంకా గుర్తుంది. లైబ్రరీలో బాలల బొమ్మల రామాయణం ఆసక్తిగా చదువుకునేవారం. పెద్దలు రామకోటి రాస్తుంటే చూసేవారం. శ్రీరామ నీవే కలవు అన్న అక్షరాలతో అమ్మ నాడు రాసిన ఉత్తరాలు ఇంకా ఉన్నాయి. కాని నాడెవరూ శ్రీరాముడిని రాజకీయాలకు ఉపయోగించుకోలేదు. సీత అగ్నిప్రవేశం, శంబూక వధ లాంటిపై ప్రశ్నలు రేగినప్పటికీ ఒక కథగా రామాయణం ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటుంది. విన్నంతవరకూ, చదివినంతవరకూ శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. సత్యవాక్పరిపాలకుడు. మర్యాద పురుషోత్తముడు. 'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు కూడా లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని రాముడిని సుగ్రీవుడు అడుగుతాడు. 'రావణుడే కనుక లొంగిపోతే అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించేవాడిని' అని రాముడు జవాబిస్తాడు. నాటి రాముడు అధికారానికి, పదవులకు అతీతుడు. తృణప్రాయంగా పదవిని వదులుకున్నవాడు. కాని రాముడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి బీజేపీ నేతలు ఎటువంటివారు?

రామరాజ్యం సుపరిపాలనకు సంకేతం అంటారు. రాముడు వేలాది సంవత్సరాల పాటు చేసిన పాలనలో వృద్ధులు యువకులకు అంత్యక్రియలు జరపాల్సిన అవసరం లేదు అని వాల్మీకి యుద్ధకాండలో రామరాజ్యాన్ని వర్ణించాడు. అంటే అకాల మరణాలు ఉండేవి కావని అర్థం. రామరాజ్యం ఎలా ఉండేది? సామాజిక సామరస్యం, న్యాయం వెల్లివిరిసేవి. ఎలాంటి రోగాలు, బాధలు లేకుండా ప్రజలు జీవించేవారు. అసలు ప్రజలు దాన ధర్మాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఉండేది కాదు. అందరూ సమాన హక్కులతో జీవించేవారు. అందరూ విద్యావంతులై ఉండేవారు. శాంతిభద్రతల పరిస్థితి కానీ, అంతర్గత కల్లోలాలు కానీ, ఇతర రాజ్యాల నుంచి సమస్యలు కానీ ఉండేవి కాదు. ప్రజల సంక్షేమం తప్ప రాముడికి వేరేది పట్టేది కాదు. రాజుగా తాను విఫలమైతే అంతకంటే శాపం మరొకటి లేదనుకునేవాడు. ఆదాయం ఎప్పుడూ వ్యయం కంటే ఎక్కువగా ఉండేది. పన్నులు ప్రజలకు ఏ మాత్రం భారం అయ్యేవి కాదు. అంతా సుభిక్షంగా జీవించేవారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా విధానాల రూపకల్పన జరిగేది. రాజ్యం భూలోక వైకుంఠంలా ఉండేదని వాల్మీకి ఒక్క మాటలో వర్ణించారు.

మహాత్మాగాంధీ కూడా శ్రీరాముడు చారిత్రక పురుషుడా కాదా అన్నది పట్టించుకోలేదు. ఆయన రామరాజ్య భావన పైనే దృష్టి కేంద్రీకరించారు. రాజుకూ, పేదకూ సమాన హక్కులున్నాయని రామాయణం చెప్పిందని గాంధీ అన్నారు. '1921లో సరయూ నది ఒడ్డున సాధువులతో గాంధీ రామరాజ్యం గురించి మాట్లాడారు. రాముడు సీతను ప్రేమించినట్లుగా, మనం బలహీనుల్ని కాపాడాలి. కేవలం మన రక్షణ కోసమే రాముడిని ఆరాధించడం పాపం అని స్పష్టీకరించారు' అని ఆరఎసఎస్ నేత రామ్‌మాధవ్ కూడా ఒక రచనలో పేర్కొన్నారు. మరి ఇప్పుడెలాంటి రాజ్యం ఉన్నది? ఇవాళ ఒక రాజకీయ పార్టీ మతాన్నే తన అస్తిత్వంగా మార్చుకుంది.. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం, రైతుల ఆత్మహత్యలు, అధిక ధరలు, బలహీనుల అణచివేతలు, స్త్రీలపై అత్యాచారాలు, కొద్ది మంది సంపన్నులకు దేశ సంపదను ధారాదత్తం చేయడం, కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిని రక్షించడం, ప్రజలపై భారీ అప్పులు మోపడం, నేతలు అధికారం సంపాదించిన కొద్ది సంవత్సరాల్లోనే వేల కోట్ల ఆస్తులు పోగేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభాగ్యులు సరైన చికిత్స అందకుండా మరణించడం ఎల్లెడలా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో గంగానదిలో శవాలు తేలిన, అభాగ్యులు మైళ్ల కొద్దీ నడుస్తూ, రైలు పట్టాలపై మరణించిన దేశమిది. ఈ దేశంలో 80 కోట్లమందికి ఉచితంగా ఆహారధాన్యాలు ఇస్తున్నానని ఈ దేశాధినేత చెప్పుకుంటారు. ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' అంటే మోదీ 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' అంటారు. ఏం తేడా?

ఇక ప్రజల హక్కుల గురించి ఏమి మాట్లాడగలం? పార్లమెంట్‌లోనే ప్రజా ప్రతినిధుల్ని బయటకు గెంటేసి ఇష్టం వచ్చినట్లు బిల్లులను ఆమోదిస్తున్నారు. వాల్మీకి ఒక కవిగా రామరాజ్యం గురించి కవితా గానం చేసి ఉండవచ్చు. కాని నేడు నేతలు అబద్ధాలతో, బూటకపు ప్రచారంలో నిత్యం నిమగ్నమయి ఉన్నారు. ప్రచారం లేకుండా వారికి పూటగడవని పరిస్థితి ఏర్పడింది. భారత రాజకీయాలు ఇప్పుడు సంధిదశలో ఉన్నాయి. అయోధ్యలో శ్రీరాముడి మందిరం ప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది.


(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఎస్సీ వర్గీకరణ: ఏం చేయాలి, ఎలా?

హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నవంబరు 11న నిర్వహించిన సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కావడం, ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా వ్యాఖ్యలు చేయడం దండోరా ఉద్యమ నాయకత్వంలో నూతన ఉత్తేజాన్ని నింపింది. దాదాపు మూడు దశాబ్దాల తమ పోరాటం ఫలించబోతుందన్న సంతోషం దండోరా నేతలలో వ్యక్తం అవుతుండగా, మాల మహానాడు కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేసింది.

ఉమ్మడి రిజర్వేషన్లలో జనాభా దామాషా ప్రకారం తమకు దక్కవలసిన భాగం దక్కటం లేదని, వాటిని మాల ఉపకులాలే కైంకర్యం చేస్తున్నాయని దండోరా ఉద్యమకారుల ఆరోపణ. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించటం ద్వారా తమ వాటా తమకు దక్కుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే, చదువు, ఉద్యోగాలు పొందినవాళ్లు ఇరువర్గాలలోను ఉన్నారని, మాల ఉపకులాలే రిజర్వేషన్లను అనుభవించాయన్న ప్రచారం వాస్తవ విరుద్ధమని మాలమహానాడు అంటోంది. దండోరా ఉద్యమ ఆరంభం నాటికే ఒక సామాజిక ఉద్యమ పరిణతిని సాధించిన దళిత సామాజిక నాయకత్వం ఈ వర్గీకరణ సమస్యకు శాస్త్రీయ పరిష్కారం కనుగొనటంలో ఘోరంగా విఫలమైంది. దళిత నాయకత్వం దీనిని తమ సొంత సమస్యలా భావించి చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. ఆ కారణంగా ఈ రెండు ఉప కులాల మధ్య పూరించలేనంత అగాధం ఏర్పడింది. ఈ సుదీర్ఘకాలం అనేక ఉమ్మడి సమస్యలను తెచ్చిపెట్టింది. వర్గీకరణకు అనుకూలంగా, దానికి వ్యతిరేకంగా ఈ రెండు వర్గాలు చేస్తున్న వాదనలు, భావనలు అర్ధసత్యాలే. సత్యాసత్యాలను నిగ్గుదేల్చేందుకు ఈనాటికీ మాల మాదిగ నాయకత్వం ప్రయత్నించకపోవడం నష్టదాయకం.

ఎస్సీ వర్గీకరణ జరిగితే మాదిగల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందా, మాలల అభివృద్ధి అడుగంటి పోతుందా? రిజర్వేషన్స్‌తోనే దళితుల సకల సమస్యలు సమసిపోతాయా? ప్రభుత్వ రంగం ఉండి, రిజర్వేషన్లను త్రికరణశుద్ధిగా అమలుచేస్తే 16 శాతం మంది మాత్రమే ప్రయోజనం పొందుతారు, మిగతా 84 శాతం అసంఘటిత రంగాలలో జీవనోపాధి పొందవలసి ఉంటుంది. రిజర్వేషన్ల కారణంగా ఎస్సీ మొత్తం జనాభాలో రెండు నుంచి మూడు శాతమే ఇప్పటికి అభివృద్ధి చెందారని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. మిగిలిన సుమారు 97 శాతం ఇంకా అభివృద్ధి చెందాల్సిన స్థితిలోనే ఉంది. ప్రైవేటు రంగం శరవేగంగా విస్తరిస్తున్న వర్తమానంలో కూడా ప్రభుత్వ రంగంలోని రిజర్వేషన్ల చుట్టూనే ఇరువర్గాలు తిరుగుతున్నాయి. రిజర్వేషన్లు కలిగించే ప్రయోజనాలకు పరిమితులున్నాయి.



పరిమితంగానే అమలయ్యే ఎస్సీ రిజర్వేషన్లని తమ వెనుకబాటుతనం ప్రాతిపదికన అవకాశాలు అందిపుచ్చుకోగల పద్ధతిని మొత్తం 60 ఉపకులాలూ అభివృద్ధి చేసుకోవాలి. అభివృద్ధి చెందని వారిని మొదటి లబ్ధిదారుగా, ఇప్పటికే అభివృద్ధి చెందినవారిని ద్వితీయ లబ్ధిదారుగా మార్చటం ద్వారా ఇది సుసాధ్యం అవుతుంది.

దళితులలో మాల, మాదిగ ఉపకులాలలోని రెండు వర్గాలలోనూ ఇప్పటికే అభివృద్ధి చెందిన వారున్నారు. ఉమ్మడి రిజర్వేషన్లు అమలయితే వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో తిరిగి వాళ్ళ వారసులే ముందు వరుసలో ఉండే అవకాశం అధికం. అలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి రిజర్వేషన్లు కొనసాగితే మాదిగలలో వెనుకబడిన వారితోపాటు మాలలలో వెనుకబడిన వారు కూడా రిజర్వేషన్ల ఫలాలను అందుకోవడంలో ఆమడ దూరాన నిలిచి పోతారు. అలాగే, దండోరా కోరుతున్నట్టుగా ఎస్సీ వర్గీకరణ జరిగితే, ఆ వర్గీకరణ తర్వాత కూడా ఆయా గ్రూపులలో అభివృద్ధి చెందినవారే తిరిగి అవకాశాలను చేజిక్కించుకోవటంలో ముందు వరుసలో ఉంటారు. అంటే, ఇప్పటివరకు కొనసాగుతున్న పద్ధతే వర్గీకరణ అనంతరం కూడా కొనసాగి, అంతిమంగా రిజర్వేషన్ల అసలు లక్ష్యం ఇప్పటిలాగే అప్పుడు కూడా దెబ్బతినిపోతుంది. స్వల్ప మార్పులతో పరిష్కార రూపంలో సమస్య యథాతథంగా మిగిలిపోతుంది.

ఇప్పుడు దండోరా చూపుతున్న దారి సమస్య సమసిపోవటానికి సరిపోనపుడు, మాలల ఏకీకరణవాదంతో యథాతథస్థితి కొనసాగితే సమగ్రాభివృద్ధి సాధ్యమయ్యే అవకాశం ఉందా? అస్సలే లేదు. ఇప్పటికే అభివృద్ధి చెందిన రెండు మూడు శాతమే తమ ప్రతిభతో మరలా అవకాశాలందుకుంటూ పోతుంటే ఇపుడిపుడే అక్షరాలు దిద్దుతున్న మిగిలిన ఉపకులాల వాళ్ళు సొంత సామాజిక వర్గంలోని వారితోనే పోటీపడలేక చతికిలపడి పోతారు. తమ సమూహంలోని చివరి మనిషికి మొదటి అవకాశం ఇవ్వడమే న్యాయమని, అదే రిజర్వేషన్ల అసలు లక్ష్యం అని నమ్మినపుడు, రిజర్వేషన్ల వర్గీకరణకు మాలలు విధిగా సానుకూలంగా స్పందించవలసి ఉంటుంది. లేదంటే తమ సమూహంలోనే ఇప్పటికే అభివృద్ధి చెందిన వారి మధ్య వెనుకబడిన వారి మధ్య గల అంతరం అంతకంతకూ పెరిగిపోతూ పెద్ద అగాధమే ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ స్థాయికి మాలలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వర్గీకరణ ఇరువర్గాల నడుమ ఏర్పడిన అగాధాన్ని పూడ్చుతుంది. ఉద్యోగులకు నిరుద్యోగులకు నడుమ గల వైరుధ్యాన్ని తగ్గిస్తుంది. అందరికీ అవకాశమొస్తుందన్న నమ్మకాన్ని కలిగిస్తుంది. పరిమితంగానైనా అందరి అభివృద్ధికి కారణభూతమౌతుంది.

ఏపీ ప్రభుత్వం గతంలో అమలు జరిపిన ఏ బి సి డి పద్ధతి సరైనదేనా? నాలుగు గ్రూపులుగా విభజించి అర్హమైన ఉప కులాలకు దామాషా ప్రకారం ఎలా సమన్యాయం చేయగలుగుతారు?. బీసీ ఉపకులాలలో ఇప్పటికే ఉన్న ఈ ఏ బి సి డి ఫార్ములా వైఫల్యం నుంచే కదా ఎంబిసి (అత్యంత వెనుకబడిన వర్గం) పుట్టింది. ఒక చోట సత్ఫలితాలు ఇవ్వని పద్ధతిని మరొక సామాజిక వర్గానికి అమలు చేయమని కోరటమూ, అందుకు ప్రభుత్వాలు ప్రయత్నించటమూ సహేతుకమేనా? ఏ బి సి డి పద్ధతి అశాస్త్రీయం. పరిష్కారమే మళ్లీ సమస్యగా మారే స్వభావం కలది. ఆయా ఉపకులాలలో అభివృద్ధి చెందినవాళ్ళే మరలా ఆయా ఉపకులాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఇచ్చే పద్ధతి. మాల ఉపకులాలలో వెనుకబడిన పాలేరు, మాదిగ ఉపకులాలలో చెప్పులు కుట్టేవాడు వర్గీకరణ అనంతరం కూడా యథాతథంగా కొనసాగే పద్ధతి.

మరి, పరిష్కారం ఏమిటి? మొత్తంగా 60 ఉపకులాలు పరిమితంగానే అమలయ్యే రిజర్వేషన్లని తమ వెనుకబాటుతనం ప్రాతిపదికన అవకాశాలు అందిపుచ్చుకోగల పద్ధతిని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందని వారిని మొదటి లబ్ధిదారుగా, ఇప్పటికే అభివృద్ధి చెందిన వారిని ద్వితీయ లబ్ధిదారుగా మార్చటం ద్వారా ఇది సుసాధ్యం అవుతుంది. దీనికి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సంబంధిత వ్యక్తులు పొందిన లబ్ధిని, వెనుకబాటు తనాన్నీ లెక్కించి వెయిటేజ్ మార్కులు ఇవ్వటం ద్వారా ఈ ఎంపిక ప్రక్రియను సమర్థంగా నిర్వహించవచ్చు. జే.ఎన్.యు. వంటి చోట్ల అడ్మిషన్లలో ఇటువంటి పద్ధతి ఎప్పటినుంచో అమలవుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత ఈ పనిని సులభతరం చేస్తుంది. ఇది ఒకే సామాజికవర్గంలోని సహోదరుల మధ్య అభివృద్ధిలో గల వ్యత్యాసం తగ్గించి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది. దీనికి రాజ్యాంగ సవరణ అక్కర్లేదు, పార్లమెంట్ తీర్మానమూ అక్కర్లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసినా సాంకేతికపరమైన, చట్టపరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉండదు (దీనికి ఆద్యుడు ఎస్.ఆర్.వేమన). పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో దళిత నాయకత్వం తమ దీర్ఘకాలిక సమస్యకు ముగింపు పలకవలసిన చారిత్రక సందర్భం ఇది. దీనిని అధిగమించి అనేక ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా సమాయత్తం కావాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

■ బడుగు భాస్కర్ జోగేష్

విజ్ఞాన వెలుగు సావిత్రిబాయి

అసమానతల సమాజంపై ధిక్కార స్వరాలై.. అట్టడుగు వర్గాల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన దంపతులు జ్యోతిరావు పూలే–సావిత్రిబాయి పూలే. వారి విశేష కృషి వల్లే నేడు ఈ సమాజంలో ప్రతీ ఒక్కరూ అక్షరాలు నేర్చుకోగలుగుతున్నారు. భర్త అడుగుజాడల్లో నడిచి సంఘంలో జరుగుతున్న అనేక అణచివేతలను ఎదురించిన దీశాలి సావిత్రిబాయి.



అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారు. బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాల కోసం అసమాన వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు.

ఆమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించింది. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లాలో, అదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు. బోధన్ ప్రాంతపు మున్నూరుకాపులు వీరికి చుట్టాలు. సావిత్రి 1840లో జ్యోతిరావు పూలేను వివాహమాడింది. నిరక్షరాస్యురాలైన ఆమెకు భర్తే మొదటి గురువు. ఆయన ప్రోత్సాహంతోనే ఇంట్లోనే విద్యావంతురాలైంది. అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848లో భర్తతో కలిసి అట్టడుగు కులాల బాలికల కోసం పుణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేసేవారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. అయినా రోజూ వేధింపులకు విసిగి ఒకరోజు ఒకడి చెంప పగులకొట్టింది. 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులు గృహ బహిష్కారానికి గురయ్యారు. ఈ దంపతులు వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు.

ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్‌ను కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల, పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషి చేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873లో భర్తతో కలసి 'సత్యశోధక్ సమాజ్'ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువుల పునర్వివాహాల కోసం అసమాన బ్రాహ్మణిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్‌గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు సావిత్రిబాయి.

1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. సమాజం కోసం సర్వస్వం త్యాగం చేసి అంధకార జీవితాల్లో అక్షర వెలుగులు పంచిన ఆ జ్ఞానజ్యోతులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా సమాజం కోసం మన స్థాయిలో కృషి చేయడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళి.

తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఒక్కడు!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, ఉభయ కమ్యూనిస్టు పార్టీల నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఒకే ఒక్కడు కూనంనేని సాంబశివరావు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కొత్తగూడెం నుంచి ఎన్నికల్లో సాధించిన విజయం ఘనమైనది. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు, మరో మాజీ మంత్రి, ఇంకా ఇతరులపైన ఈయన 27వేల పైచిలుకు భారీ మెజారిటీతో నెగ్గారు. కొత్తగూడెం నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుంచి జరిగిన ఎన్నికలలో ఇదే అత్యధిక మెజారిటీ.

కూనంనేని ప్రజల కోసం ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. టాడా లాంటి నిరంకుశ కేసులతో సైతం జైలుపాలు అయ్యారు. పోలీసు కాల్పులను కూడా ఎదుర్కొన్నారు. మూడు పర్యాయాలు వరంగల్ సెంట్రల్ జైళ్లలో నెలల తరబడి ఉన్నారు. ఆయన నిత్యం ప్రజల వెంటే ఉన్నారు. కొత్తగూడెంలో అనేక కాలనీలను నిర్మించి వేలాదిమందికి ఇంటి సౌకర్యం కల్పించారు. దాదాపు 35 నుంచి 40 అసంఘటితరంగ కార్మికుల సంఘాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల రంగంలో కమ్యూనిస్టులు కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, ఇతర పార్టీల పొత్తుతోపాటు పైన పేర్కొన్న అన్ని వర్గాల ప్రజల మద్దతుతో విజేతగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లోను, తర్వాత 2018 ఎన్నికల్లోనూ అసలు అసెంబ్లీలో ప్రాతినిధ్యమే లేని పరిస్థితి నుంచి ఇప్పుడు కాంగ్రెస్‌తో పొత్తుతో ఒకే ఒక్క సీటును సీపీఐ దక్కించుకున్నది. ఈ ఎన్నికల్లో సీపీఎం ఎవరితోను పొత్తు పెట్టుకోక ఒంటరిగా 19 నియోజక వర్గాల్లో పోటీ చేసి అన్నింటిలో డిపాజిట్లు కోల్పోయింది.

మునుగోడు ఉపఎన్నికల్లో వారి మద్దతు తీసుకుని, ఆ తర్వాత వదిలేసి, కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందని, వారు ప్రజల్లో లేరని హేళన చేసిన బీఆర్ఎస్ ఈ రోజు రాష్ట్రంలో అధికారం కోల్పోడానికి కారణం కొంతవరకూ కమ్యూనిస్టులే అంటే అతిశయోక్తి కాదు! కమ్యూనిస్ట్ పార్టీల అస్తిత్వాన్ని సవాల్ చేసినవారు కుప్పకూలిన దాఖలాలు కోకొల్లలు. కూనంనేని సాంబశివరావు ఒక్కడే అయినా, ఆయన నాలుగు కోట్ల ప్రజానీకం గొంతుగా ఉంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఒకసారి సాంబశివరావు కొత్తగూడెం నుంచి శాసనసభకు వెళ్లారు. ఆయన గతంలో ఆనాటి విశాలాంధ్ర సంపాదకులు రాఘవాచారి శిక్షణలో జర్నలిజం ఓనమాలు నేర్చుకున్నారు. శాసనసభ్యులుగా ఉన్న కాలంలో లక్షా నలభై వేల ఎకరాల కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకొచ్చి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం శాసనసభ లోపలా బయటా పెద్దయెత్తున పోరాటం చేశారు. అసెంబ్లీలో సోంపేట కాల్పులకు వ్యతిరేకంగా, తెలంగాణ ఉద్యమ సమయంలో ట్యాంక్‌బండ్ పైన విగ్రహాల కూల్చివేతకు వ్యతిరేకంగా, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర వహిస్తూనే విశ్లేషణాత్మకంగా చేసిన ప్రసంగాలు ఇప్పటికీ గుర్తుంటాయి. సింగరేణి బొగ్గుగని కార్మికుల హక్కు కోసం పోరాడి వారి కోసం జైళ్లకు వెళ్ళిన నేతగా ఆయన కార్మికుల అభిమానాన్ని పొందారు.

తెలంగాణ సాయుధ పోరాట ఘన చరిత్రకు వారసులుగా ఉన్న కమ్యూనిస్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మరింత బలంగా పురోగమిస్తారని అందరూ భావించారు. మొదటి ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులకు చెరొక స్థానం వచ్చినప్పటికీ, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా లభించకపోవడంతో కమ్యూనిస్టులు చట్టసభల్లో లేని లోటు సామాన్య ప్రజలకు స్పష్టంగా కనిపించింది. ఈ దశలోనే రాష్ట్ర రాజకీయాలు కింది నుంచి పైవరకు పార్టీ ఫిరాయింపులతో భ్రష్టు పట్టిపోయాయి. పాలకులు ప్రశ్నించే గొంతులను నులిమేశారు. హైదరాబాదులో నిరసన హక్కుకు చిహ్నంగా నిలిచిన ధర్నాచౌక్‌ను బందు చేశారు. సమ్మె హక్కులను కాలరాశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ ఆ కార్మికులకు కమ్యూనిస్టులు అండగా నిలిచారు. ఆ సమ్మెకు మద్దతుగా కూనంనేని సాంబశివరావు స్వయంగా ఆమరణ దీక్షకు దిగారు. రాష్ట్రంలో కార్మికుల హక్కులు కాలరాయబడకుండా ఉండేందుకు కమ్యూనిస్టులు సర్వం ధారపోశారు. ధర్నా చౌక్ పునరుద్ధరణకు మఖ్దూం భవన్‌లో దీక్షలు చేస్తూ కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర శక్తులు, పార్టీలు ఇతర సంఘాలకు పోరాట వేదికగా నిలిచింది సీపీఐ.



కమ్యూనిస్టు పార్టీలు ఖతం అని ప్రచారం చేస్తూ, మతవిద్వేషాలు సృష్టించే వారికి కూనంనేని సాంబశివరావు గెలుపు ఒక సవాల్. కమ్యూనిస్టులు లేని ప్రజాస్వామ్యం మనజాలదు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం లేనప్పటికీ కమ్యూనిస్టులు చట్టసభల వెలుపల తమ పోరాటాలను ఏ మాత్రం తగ్గనీయలేదు. పేదల కోసం అనేక చోట్ల గుడిసెలు వేయించారు. వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి తదితర జిల్లాల్లో వేల సంఖ్యలో నిరుపేదలకు గుడిసెలు వేసేందుకు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా సాంబశివరావు నాయకత్వంలో ఎర్రజెండా బాసటగా నిలిచింది. చివరకు రాష్ట్రంలో లౌకిక పునాదులను ధ్వంసం చేసేందుకు మోసపుటెత్తులతో దూసుకుపోతున్న బీజేపీకి కళ్ళెం వేసింది కూడా కమ్యూనిస్టు పార్టీనే. నాడు మునుగోడు ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న నిర్ణయంతో మతోన్మాద శక్తులకు ముకుతాడుపడింది. ఉప ఎన్నికల్లో పాలక పార్టీకి మద్దతు ఇచ్చినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ తన పోరాట బాటను విడవలేదు. గుడిసె వాసుల పోరాటం, ఆశ, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమ్మెలు, ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రొఫెసర్లు, రచయితలపై ఉపా, దేశద్రోహ చట్టాలను పెట్టి వారిని అణచివేసేందుకు ప్రయత్నించినప్పుడు కమ్యూనిస్టులే వారికి అండగా నిలిచారు.

ఒకవైపు దేశాన్ని మతోన్మాదం కబళిస్తూ, నిరంకుశ పాలకులు చెలరేగిపోతున్న సమయంలో పార్లమెంటులో, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడం పెద్దలోటు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోరాటాల ద్వారా ప్రజల సమస్యలను, హక్కులను ప్రధాన స్రవంతిలో వినిపించడం ఒక భాగమైతే, చట్టసభల్లో అందుకు అనుగుణమైన చట్టాలను తీసుకురావడం, ఉన్న చట్టాలను కోల్పోకుండా బలమైన వాణిని వినిపించడంలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం అత్యవసరం. ధనబలం, కండబలం, మద్యంతో మకిలిపట్టిన ఎన్నికల విధానంలో కమ్యూనిస్టులు నెగ్గుకు రావడం సవాలుగా మారింది. అందుకే కూనంనేని సాంబశివరావు హైదరాబాదులో నిర్వహించిన మొదటి మీడియా సమావేశంలోనే, 'నేను శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేను మాత్రమే కాదు, అన్ని వామపక్ష పార్టీలకు, ప్రజాస్వామ్యవాదులకు, ప్రగతిశీల శక్తులందరికీ ప్రతినిధిని' అని ప్రకటించడం యావన్మందికీ ఆనందాన్ని కలిగించింది.

కమ్యూనిస్టు పార్టీలు ఖతం అని ప్రచారం చేస్తూ, మతం విద్వేషాలు సృష్టించే వారికి కూనంనేని గెలుపు ఒక సవాల్. తెలంగాణలోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోను కూనంనేని గెలుపుతో ఎర్రజెండా పార్టీలు, అభిమానులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ప్రజల గొంతుకు అభినందనలు తెలిపారు. ధనస్వామ్యం, కార్పొరేట్ స్వామ్యాల ఉక్కు పిడికిలిలో ఎన్నికల రంగం నలిగిపోతున్న తరుణంలో ఎన్నికలలో దామాషా ప్రాతినిధ్యం కొరకు పోరుసల్పి దామాషా ఎన్నికల విధానాన్ని సాధిస్తే కమ్యూనిస్టుల వాణి చట్టసభల్లో మరింత ప్రతిధ్వనించగలదు. కమ్యూనిస్టులు లేని ప్రజాస్వామ్యం మనజాలదు. కమ్యూనిస్టులు తక్షణమే అధికారంలోకి రాలేకపోయినా ప్రజల తరఫున గొంతు వినిపించడంలో, పోరాటం చేయడంలో కమ్యూనిస్టుపార్టీలను మించి మరేపార్టీ ఉండదనడంలో అతిశయోక్తి లేదు. ప్రజల గొంతుకగా ఉంటానంటున్న కూనంనేనికి ఆల్ ది బెస్ట్!



'భవిత'కు భరోసా

- కేంద్రాల బలోపేతం దిశగా అడుగులు
- పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు
- ఐఆర్‌పీల నియామకం
- ప్రత్యేకవసరాల పిల్లలకు మెరుగైన సేవలు
- పిల్లల గుర్తింపునకు సర్వే

హనుమకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విధి వంచితులైన ప్రత్యేక అవసరాల పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో రెండు ఎక్స్‌క్లూజివ్ భవిత కేంద్రాలు, మండలానికి ఒక భవిత కేంద్రం ఉన్నాయి. ప్రత్యేక భవిత కేంద్రాల్లో ఒకటి హనుమకొండ, మరొకటి పరకాలలో పని చేస్తున్నాయి. వీటితో పాటు ప్రత్యేక అసవరాల పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో వారి కోసం దాదాపు అన్ని మండలాల్లో ఏర్పాటుచేసిన భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ రిసోర్స్ పర్సన్ (ఐఆర్‌పీలు) పని చేస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపి కోసం పరికరాలు కొనుగోలు చేయడానికి నాలుగు మండలాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో మండలానికి రూ. 50 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ మాత్రమే వచ్చాయి. నిధులు ఇంకా విడుదల కాలేదు. కాజీపేట, వేలేరు, ఐనవోలు, దామెర మండలాలకు వచ్చాయి.

కమిటీ ద్వారా కొనుగోలు

రాష్ట్ర విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలకు రూ. 2 లక్షల చొప్పున ఆరు జిల్లాల్లో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు మొత్తం రూ. 12 లక్షలు మంజూరు చేసింది. అవసరమైన సామగ్రి కొనుగోలు ధరలను కూడా రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు నిర్ణయించారు. జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా వాటిని కొనాల్సి ఉంటుంది. ఒక్కో కేంద్రంలో రెండు రౌండ్ టేబుళ్లు, నాలుగు కుర్చీలు, అల్మారా వంటి మొత్తం 33 రకాల పరికరాలు, చార్టులు తదితరాలు కొననున్నారు. ఉమ్మడి జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఉపకరణాలకు ఒక్కో కేంద్రానికి రూ. 500 చొప్పున, హోంబేస్డ్ విద్య నేర్పించేందుకు అవసరమైన ఉపకరణాలకు ఒక్కో విద్యార్థికి రూ. 500 చొప్పున, అంధ విద్యార్థులకు బ్రెయిలీ స్టేషనరీకి ఒక్కో విద్యార్థికి రూ. 100 చొప్పున నిధులు అందనున్నాయి.

మెరుగైన సేవలు

అన్ని జిల్లాల్లో ఐఆర్‌పీలు నియామకాలు జరిగాయి. ప్రత్యేక అవసరాల పిల్లలు ఎక్కడ ఎక్కువ సంఖ్యలో ఉన్నారో అక్కడ ఇంక్లూజివ్ రిసోర్స్ పర్సన్స్ (ఐఆర్‌పీ)లను నియమించారు. టీచర్లతో పాటు వీరు అదనంగా ఉంటారు. జిల్లాలో వాస్తవంగా తొమ్మిది ఖాళీలు ఉండగా ఆరుగురే అందుబాటులో ఉన్నారు. ఐఆర్‌పీ పోస్టుల కోసం జిల్లా నుంచి 30 మంది పరీక్ష రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది లిఖిత పరీక్ష రాసినప్పటికీ వారిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేసేందుకు అర్హతలు లేవు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేయడానికి ప్రత్యేక బీఈడీ అర్హత కలిగి ఉండాలి. దీంతో పాటు రిహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) నుంచి ఒక సర్టిఫికెట్ కూడా ఉండాలి. ఆర్‌సీఐలో వారు రిజిస్టర్ అయి ఉండాలి. అటువంటి వారే ఐఆర్‌పీలుగా నియామకానికి అర్హులు. ఇటువంటి వారు తక్కువ మంది ఉన్నారు. అందువల్లనే జిల్లాలోని తొమ్మిది ఖాళీల్లో ఆరుగురు మాత్రమే భర్తీ కాగలిగారు. అంతకు ముందు జిల్లాలో 18 మంది ఉన్నారు. దీనితో మొత్తం ఐఆర్‌పీల సంఖ్య 24కు పెరిగింది. రెండు, మూడు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లో ఇద్దరేసి ఐఆర్‌పీలు ప్రస్తుతం పని చేస్తున్నారు. రెండు ప్రత్యేక భవిత సెంటర్లలో కూడా ఇద్దరేసి ఐఆర్‌పీలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండింటిలో ఒకటి హనుమకొండలో, మరొకటి పరకాలలో నడుస్తున్నాయి. ప్రత్యేక అవసరాల పిల్లలకు గతంలో కన్నా ఇప్పుడు కాస్త మెరుగైన సేవలు అందుతున్నాయి. గతంలో ఐఆర్‌పీల కొరత వల్ల ఇబ్బందిగా ఉండేది. ప్రత్యేక అవసరాల పిల్లలకు తగిన ఫిజియోథెరపీ అందకపోయేది. ఇటువంటి పిల్లల తల్లిదండ్రులు ఆందోళన పడేవారు.

> **భవిత కేంద్రాల్లో..**
> మానసిక, శారీరక వైకల్యం గల బాలలకు అర్థమయ్యే విధంగా బోధన చేపట్టేందుకు ఏర్పాటైన ఈ భవిత కేంద్రాల్లో 21 రకాల వైకల్యాలు గల పిల్లలకు విద్యతో పాటు స్వతహాగా ఎదిగేందుకు అవసరమైన సేవలను అందిస్తారు. 5-14 ఏళ్లలోపు పిల్లలకు పలు అంశాలను ఐఆర్‌పీలు నేర్పిస్తారు. వీరు ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేపట్టడంతో పాటు కదలలేని బాలల ఇళ్లకు వెళ్లి బోధిస్తున్నారు. కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు అందిస్తున్నారు.

ఐఆర్‌పీలకు రవాణా భత్యం

ఐఆర్‌పీలకు రొటేషన్ ఇవ్వాల్సిన అసవరం ఉందని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఐఆర్‌పీలు ఒకే సెంటర్‌లో విధులు నిర్వర్తించడం వల్ల అక్కడ ఉన్న ఒకరిద్దరు పిల్లలను మాత్రమే చూసుకోగలుగుతారు. వాస్తవంగా ఒక ఐఆర్‌పీ 8 మంది పిల్లలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఒకే పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలు ఎనిమిది వరకు ఉండరు. భవిత ఎక్స్‌క్లూజివ్ సెంటర్లలో అంత మంది ఉంటారు కానీ పాఠశాలల్లో ఉండరు. కనుక ఐఆర్‌పీలు ఇతర పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలను చూసుకోవడానికి ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇందుకు వారికి రవాణా భత్యం ఇవ్వాలని కోరుతున్నారు.

అన్ని మండలాల్లో సర్వే

ప్రస్తుతం అన్ని మండలాల్లో ప్రత్యేక అసవరాల పిల్లలను గుర్తించే సర్వే జరుగుతోంది. న్యూసీడబ్ల్యుఎస్ఎన్ గుర్తింపు జరుగుతుంది. 80 వరకు కొత్త సీడబ్ల్యుఎస్ఎన్‌లను గుర్తించారు. అన్ని మండలాల్లో ఐఆర్‌పీలు ఉండడం వల్ల సర్వే బాగా జరుగుతుంది. కాంప్లెక్స్‌కు ఒకరి చొప్పున క్లస్టర్ రిసోర్సు పర్సన్స్ ఉంటారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, వారిని తిరిగి బడిలో చేర్పించడం వారి బాధ్యత. జనవరి 11 నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుంది.

ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన సేవలు

- బోయినపల్లి రాధ, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యునిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్



ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా గతంలో కన్నా ఇప్పుడు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రాల ఉన్నతికి, అందులో చదువుకుంటున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన ఫిజియోథెరపి పరికరాలు, ఫర్నీచర్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం మండలానికి రూ. 50 వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. దీనితో పాటు ఐఆర్‌పీల నియామకం కూడా జరిగింది. కొత్తగా ఆరుగురు నియమితులయ్యారు. దీనితో వీరి సంఖ్య పద్దెనిమిదికి పెరిగింది. ఐఆర్‌పీలకు ట్రావెలింగ్ అలవెన్స్ సౌకర్యం కలిగిస్తే వారు మరింత ఎక్కువ మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలు అందించేందుకు వీలు కలుగుతుంది.





అంబేద్కర్ జంక్షన్‌లోని పెట్రల్‌బంక్‌లో బారులుదీరిన ప్రజలు

పెంట్రోల్ బంకుల్లో బారులు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె విరమించినప్పటికీ పెట్రోల్‌పంపుల్లో ప్రజలు బారులుదీరి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. కొన్ని బంకుల్లో వినియోగదారుల తాకిడి పెరగడంతో పెట్రోల్, డీజిల్ అయిపోయిందని నో స్టాక్ బోర్డులు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ల సమ్మె చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం పెంట్రోల్ బంకుల్లో వినియోగదారుల రద్దీ పెరిగింది. అయితే ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె విరమించినట్లు ప్రకటించినా పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్‌కోసం వాహనదారులు ఎగబడ్డారు. పౌరసరఫరాల అధికారులు మాత్రం పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని విక్రయాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని చెబుతున్నారు.



కాళోజీ కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న 'కుడా' వైస్ చైర్మన్ రిజ్వాన్ బాషా

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలి

'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 2 : కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని, జాప్యం జరిగితే సహించేది లేదని 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పనివారి సంఖ్య పెంచి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 'కుడా' సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలపై వంద రోజులు వేచి చూద్దాం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

వేలేరు(ధర్మసాగర్) జనవరి 2 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా వంద రోజులు వేచి చూడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కులాల వారీగా జేఏసీని ఏర్పాటు చేసుకొని ప్రతీ ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సదరం సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాత దరఖాస్తులు తీసుకుంటే బాగుండేదని అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంపై వినతి పత్రం అందజేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చాలా స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. వారి ప్రకటనను మన అందరం స్వాగతిద్దామన్నారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని నిలబెట్టుకోవాలని ఆశిద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ సరిత,సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటి), జనవరి 2 : బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంగళవారం ఈ మేరకు కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపినట్లు సమాచారం. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. కొద్ది రోజులుగా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రెండు పార్టీలకు చెందిన కార్పొరేటర్లకు కాంగ్రెస్ నేతలు కూడా వల వేసినట్లు సమాచారం. బల్దియాలో కాంగ్రెస్‌కు నలుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అనధికారికంగా కాంగ్రెస్ గూటికి చేరారు. కొత్తగా చేరనున్న కార్పొరేటర్లతో కాంగ్రెస్ బలం 11 దాటనున్నట్లు తెలిసింది. వీరికి తోడు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి బల్దియా ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉండనున్నారు. ఈ క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ బలం మరింత పెరుగనుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్‌లో చేరనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, రాజు, నెక్కొండ కిషన్‌తోపాటు మరికొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. వీరితో పాటు మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్‌లు కుడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు సమాచారం.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సుబేదారిలోని వాటర్‌ట్యాంక్ వద్ద మంగళవారం 49వ డివిజన్ ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించగా ప్రజల నుంచి ఎమ్మెల్యే దరఖాస్తులు స్వీకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రజాపాలన కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు నాగపురి దయాకర్, కట్ట రఘుపాల్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

డివిజన్‌లోనే కేంద్రం ఏర్పాటు చేయాలి

గ్రేటర్ 49వ డివిజన్ పరిధిలో కాకుండా వేరే ప్రాంతంలో ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ తెలిపారు. రెవెన్యూ కాలనీలోని ఏ ప్రాంతంలోనైనా కేంద్రం ఏర్పాటు చేస్తే డివిజన్ ప్రజలకు సౌకర్యంగా ఉండేదన్నారు. అలా కాకుండా 59వ డివిజన్ పరిధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో మెయిన్ రోడ్డు దాటి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి డివిజన్‌లోనే ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు.

మార్చిలో 3 రోజుల అంతర్జాతీయ సదస్సు

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

8



వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం



ఐనవోలు జాతర ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ఐనవోలు, జనవరి 2: ఐనవోలు జాతర ఏర్పాట్లను దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆలయానికి వచ్చిన కమిషనర్ అధికారులతో సమావేశమై జాతర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంతకు ముందు కమిషనర్ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ కమీషనర్ టి. శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమీషనర్ ఆర్. సునీత, అధికారులు సంజీవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర పార్కింగ్.. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర పార్కింగ్ క్యూలైన్ల ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మామునూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే నాలుగుదారులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలతోపాటు క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న కమిషనర్ అనిల్‌కుమార్

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

▸ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నయీంనగర్, జనవరి 2: అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో మంగళవారం వివిధ శాఖల డైరెక్టర్లు, ఐన్‌టియూసీ-327 యూనియన్ నాయకులు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టిగా కంపెనీ ఉండాలంటే అందరూ కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. వినియోగదారులను గౌరవించడం వారి సమస్యలను పరిష్కరించడం ఏటి అండ్ సి నష్టాలను తగ్గించాలని ఆయన కోరారు. విద్యుత్ భద్రతా సూచనలు ఉద్యోగస్తులు, వినియోగదారులు విధిగా పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పిమోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, ఐన్‌టియూఈ-327 యూనియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్యగౌడ్, నీలారాపు శ్రీనివాస్, ఓదేలు, సోమయ్య, సీజీయంలు, జీయంలు పాల్గొన్నారు.


సీఎండీ వరుణ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు

అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..

- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 2 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటూ అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఎన్.సుధాకర్ రావు, దుగ్యాల శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా కొనసాగినా స్వరాష్ట్రంలో 2014, 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొనసాగుతూ కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన మేరకు కాలేదు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడాహుడిగా శంకుస్థాపనలు చేసి, ఎర్రబెల్లి ఓడిపోయారు. శంకుస్థాపన పనులు జరిగిన అభివృద్ధి పనులు ముందుగు సాగేనా, నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మిని ట్యాంకు బండ్, విద్యావైద్యం, బెడ్రూం ఇళ్లు, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముంది.


తొర్రూరు మండలం గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమ జరిగే స్థలం, శిలాఫలకం (ఫైల్)

మినీట్యాంకు బండ్, ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తి అయ్యేనా..?

తొర్రూరు పెద్దచెరువును మినీట్యాంకు బండ్ చేస్తామంటూ 2017-18 సంవత్సరంలో గత ప్రభుత్వం రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేసింది. బండ్ పనులకు హడావుడిగా టెండర్లు పిలిచారు. దీంతో రూ.2 కోట్ల 19 లక్షలతో కాంట్రాక్టర్లు కట్ట మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం కోసం పిల్లర్లు, పూడికతీత వంటి పనులు చేసి వదిలేశారు. మొత్తంగా బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పూర్తిస్థాయిలో ట్యాంక్ బండ్ నిర్మాణం కావాలంటే అధిక నిధులు కావాల్సి ఉంటుందంటూ అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరువ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ఆయిల్‌ఫాం పంట సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగానే పంటను విక్రయించుకోవడానికి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో సుమారు 85 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించారు. అందులో 45 ఎకరాల్లో రూ.175 కోట్ల నిధులతో అత్యాధునికమైన పరిశ్రమను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు సెప్టెంబరు 2023న ప్రారంభించారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా రైతులు 4,769 ఎకరాలలో పామాయిల్ సాగు కొనసాగతుండగా, 2023-24కుగాను 8 వేల ఎకరాల పంట సాగు చేయడానికి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది కొంత పంట చేతికి వచ్చే సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫాం రైతులు కోరుతున్నారు.

ఇళ్ల కేటాయింపు చేయాలి

తొర్రూరు మండలంలోని పేద ప్రజల సంక్షేమానికి ఇళ్లు లేనిపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడంతో కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించినా కేటాయింపులు చేయలేదు. గృహలక్ష్మీ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామనడంతో సుమారు 3,418 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని సుమారు 900 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 200 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే కర్కాల, కంఠాయపాలెం, గుర్తూర్, మాటేడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారుల ఎంపిక చేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. గుర్తూర్ గ్రామంలో 40 ఇళ్లకుగాను 20, కర్కాల గ్రామంలో 20 ఇళ్లు పూర్తైనా లబ్ధిదారుల కేటాయింపు చేయకపోవడంతో ప్రజలు వెళ్లి ఉంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో పాలేరు వాగు పై బ్రిడ్జి, గుర్తూర్ -ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్య ఆకేరు వాగు పై నిర్మించే బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే గుర్తూర్‌లో నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల 64 లక్షలకు టెండర్లు పిలిచి ఓపెన్ చేయలేదు. గుర్తూర్ గ్రామం నుంచి మడిపల్లి, పత్తేపురం, తొర్రూరు వచ్చే రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు. గోపాలగిరి, చెర్లపాలెం మధ్య రహదారి, చింతలపల్లి, కొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి, మున్సిపాలిటీలో పలు కాలనీల్లో కంకరపోసి వదిలేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మినీట్యాంకు బండ్ కోసం ఫిల్లర్ల నిర్మాణంకే పరిమితమైన తొర్రూరు పెద్ద చెరువు


తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో పూర్తి అయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

వంద పడకల ఆస్పత్రి కోసం ఎదురుచూపులు..

తొర్రూరు మండలంలో గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉంది. రోగుల తాకిడితో ఆస్పత్రి భవనం సరిపోకపోవడంతో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసి తొర్రూరు, మరిపెడ మండలాలకు సంబంధించి వంద పడకల ఆస్పత్రిని మరిపెడ మండల కేంద్రంలో అప్పట్టి వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అప్‌గ్రేడ్ అయినా ఆ స్థాయిలో వైద్యపరీక్షలు మాత్రం అందకపోగా, కనీసం ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎంబీబీఎస్ వైద్యులు నామమాత్రంగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణుల కోసం వరంగల్, ఖమ్మంతో పాటు ప్రసవాలకు వర్ధన్నపేట, వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్తున్నారు. అదేవిధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల నుంచి డిగ్రీ విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించే ఆర్థిక పరిస్థితి లేని పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేస్తున్నారు. ఇప్పటికైనా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణంతో అద్దె బస్సులకు డీజిల్ భారం

హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షుడు రాంరెడ్డి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత


ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ నాయకులు

సుబేదారి, జనవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అద్దె బస్సులకు డీజిల్ భారం పెరిగిందని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షులు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె. శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకానికి ముందు బస్సులలో 45 నుండి 60 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించేవారని, ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగి బస్సుల టైర్లపై భారం పడుతుందన్నారు. అలాగే బస్సుల కమాన్ పట్టీలు విరుగుతున్నాయని, బస్సు మెయింటెనెన్స్ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, దీనివల్ల 4.5 కేఎంపీఎల్ ఇవ్వాలన్నారు. జనవరి 5వ తేదీలోగా మా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 5 నుంచి సమ్మె చేస్తామని ఆర్ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాంరెడ్డి, తెలిపారు. ఆర్ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో హైర్ బస్సు ఓనర్స్ రాష్ట్ర నాయకులు లక్కం ప్రభాకర్, కె. సదానందం, వెంకటేశ్వర్లు, పి. కుమార్, వి. వెంకటరెడ్డిలు ఉన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

- మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఘటన


విజయ్‌ప్రకాష్ (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్, జనవరి 2 : కారు ఢీకొన్న ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండలం మచ్చర్లకు చెందిన చింతల వినోద-సుధాకర్ దంపతులు హైదరాబాద్‌కు వలస పోయి కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్‌ప్రకాష్ (8) ఆదే గ్రామంలోని అమ్మమ్మ ఈసం నర్సమ్మ వద్ద ఉంటూ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. సోమవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత మంగళవారం మధ్యాహ్నం మచ్చర్లకు వెళ్లేందుకు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఆటో ఎక్కుతున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి కురవికి వెళ్తున్న కారు ఆటోకు కుడివైపున ఉన్న బాలుడు విజయ్‌ప్రకాష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారు ఒక్కసారిగా షాక్ గురయ్యారు. కొద్దిసేపట్లో స్వగృహానికి వెళ్లాల్సిన బాలుడు అనంతలోకాలకు వెళ్లడంతో కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే బుధవారం రూ.2500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ధర్మారంలో ఉద్రిక్తత


లక్ష్మీ (ఫైల్)


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మీ బంధువులు

పరకాల, జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నడికూడ మండలం ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (40), ఎర్రన్న దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో గొడవపడి లక్ష్మి ఐదేళ్లుగా వేరే ఇంట్లో కిరాయికి ఉంటోంది. డిసెంబరు 28న రేషన్ కార్డు విషయమై తన భర్త ఎర్రన్న ఇంటికి వెళ్లి మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. బంధువులు, స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి చికిత్స పొందుతూ జనవరి 1 (సోమవారం) మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ మృతదేహాన్ని తన భర్త ఎర్రన్న ఇంటి ముందు వేసి బంధువులు రహదారిపై ధర్నా చేశారు. కొన్నేళ్లుగా ఎర్రన్న లక్ష్మీని పట్టించుకోలేదని, ఎర్రన్న ఆస్థిని లక్ష్మీ కూతురు పేరు మీద రాయాలని ఆందోళన చేశారు. ఎర్రన్న లక్ష్మీని ఇబ్బందులకు గురిచేసి కూతురు ఉన్నా వేరే పెళ్లి చే సుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువుల ను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా లక్ష్మీ బంధువులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలను పక్కకు నెట్టివేయడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ ఉమ, ఆమె భర్త సదానందం సీఐతో వాగ్వాదానికి దిగారు. మహిళలను నెట్టివేయడం సరికాదన్నారు. చివరకు పరారీలో ఉన్న లక్ష్మీ భర్త ఎర్రన్నను తీసుకువస్తామని సీఐ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యం

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు


నందనం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 2: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నందనంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐదు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మరిన్ని రోజుల గడువు ఇవ్వడానికి కృషిచేస్తుందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్ యాకర మంజులయాదగిరి, ఎంపీటీసీ జెట్టబోయిన లక్ష్మి, ఉప సర్పంచ్ మౌనికరాము, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు పెన్నులు, పెన్సిళ్లు ఎమ్మెల్యేకు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని గుంతలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందుగా వాటిని పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అడిషినల్ కలెక్టర్ మహేందర్‌జీకి సూచించగా పాఠశాలలను సందర్శించి నివేదికను అందజేస్తామని తెలిపారు. నందనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఫ్లెక్సీల వివాదం తలెత్తి ఫ్లెక్సీలను చింపి తొలగించారు. ఎమ్మెల్యే తొలి సారి ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామానికి వస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరినవారితోపాటు స్థానికంగా ఉండని వారు ఫ్లెక్సీల్లో తమ ఫోటోలను పెద్దవిగా ముద్రించుకొని సీనియర్ల ఫోటోలు పెట్టలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఫ్లెక్సీల వివాదానికి తెరతీసి చింపివేశారు. ఎమ్మెల్యే వస్తే పరువుపోతుందని గ్రామ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను మొత్తం తొలగించి వివాదానికి తెరదించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల షురూ


కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 104, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 15, మోడల్ స్కూల్స్ 8 వెరసీ 127 పాఠశాలలుండగా వాటిల్లో 4405 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో బాలురు 2296, బాలికలు 2109 మంది మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం 8 :30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున తరగతులు నిర్వహిస్తూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి జిల్లా వందశాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

ఆరు పేపర్లు, ఏడు పరీక్షలకు అనుగుణంగా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లుండగా ఏడు పరీక్షలు నిర్వహించేందుకు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రం 6 సబ్జెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు సామాన్య శాస్త్రంను భౌతికరసాయనశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లుగా విభజించి పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఏడు పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ తరగతులలో సిలబస్ రివిజన్ చేయడంతో పాటు హెచ్ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని


కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినందుకు ఎమ్మెల్యేకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైస్ మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హనుమకొండ రూరల్, జనవరి 2 : పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యాజమాన్యం గడువులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన గడువులోగా రైస్ మిల్లర్లు బియ్యానికి సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం నుంచి రావాల్సిన బియ్యం పలు మిల్లుల నుంచి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, డీఎం మహేందర్, సివిల్ సప్లయిస్ డీటీలు రమేశ్, కృష్ణ, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 17 మందిని తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవిలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరీక్షల కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన ఐదుగురిని, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని కళాశాలలో 8 మందిని, ఉమ్మడి ఖమ్మంలో జిల్లాల పరిధిలోని కళాశాలల్లో మరో 4 మంది డీబారైనట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి బోధనేతర కారుణ్య ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విధుల్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బోధనేతర సిబ్బంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఇద్దరికీ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్ష విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన నారగోని వెంకన్న కుమారుడు నారగోని శివాజీ గౌడ్‌కు క్లర్క్ కం టైపిస్టుగా, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పనిచేసిన బస్కుల పోచయ్య కుమారుడు బస్కుల సునిల్‌కు కామాటిగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్యోగ నియమాకాల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, వర్సిటీ ఉద్యోగులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 31, జనవరి 1న రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సుమారు 75 మందిని మద్యం తాగినట్టు గుర్తించి మంగళవారం కోర్టుకు తరలించారు. వీరిలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నారాయణతండాకు చెందిన అజ్మీర ప్రకాశ్, వరంగల్ దేశాయిపేటకు చెందిన తమ్మిశెట్టి తిరుపతిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇంకా 73 మందికి రూ. 1.22 లక్షల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిని కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాచకొండ రమేష్ పరకాల జైలు అధికారులకు అప్పగించారు.

ఉపాధి శిక్షణ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 2: మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి, గోద్రేజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మంగళవారం కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకులు రాసమల్ల మహేష్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గోద్రేజ్, రిలయన్స్, ఐఎస్ఫ్బీ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో ఆసక్తి గల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి,జెడ్‌పీటీసీ సరిత,సర్పంచ్ రాజిరెడ్డి,ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న డీటీయూ ఆవిర్భావ సభ

డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్


డీటీయూ ఆవిర్భావ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 2: మహనీయులు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, జాన్ డ్యూయి ఎడ్యుకేషనల్ ఫిలాసఫర్, బీఆర్. అంబేద్కర్ అందించినటు వంటి జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి ఆలోచన విధానంలో పనిచే యడం కోసం ఈ నెల 7న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఎస్‌వీకే కన్వెన్షన్ హాల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయకత్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్ తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో నిర్వహించిన డీటీయూ ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యుల సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. మహనీయుల ఆలోచనలతో ధర్మ టీచర్స్ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు సంఘటితం కావల్సిన సమయం ఆసన్న మైందని పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. డీటీయూ ఆవిర్భావ బాధ్యులు సాంబయ్య, శ్యాంసుందర్, సురేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 2: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న గోవులను మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిర్వాహకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం వేములవాడ గోశాల నుంచి మండలంలోని జీకే తండాకు 20గోవులను తరలించేందుకు పర్మిట్ తీసుకుని దారిమళ్లించి హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో గోశాల నిర్వాహకులు పట్టణ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. డీసీఎం నంబర్ టీఎస్ 30 టీఏ0850 లో తనిఖీ చేయగా 24గోవులు ఉన్నాయన్నారు. డీసీఎంలో ఉన్న ఎల్. భాస్కర్, ఎ. సంతోష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2 : హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య గల ఎల్కతుర్తి మండలంలోని బావుపేట రైల్వే గేటు (నెంబరు 9ఈ) ఈ నెల 4, 5వ తేదీ వరకు రెండు రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి జీపీ.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్-హనుమకొండ వెళ్లే మార్గం లోని ఏకైక గేటు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. కాగా హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వే లైన్ ట్రాఫిక్, పవర్ బ్లాకింగ్ అనుసంధాన పనుల వల్ల సికింద్రాబాద్ నుంచి కాగజ్ నగర్ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేయబడ్డాయని, కేవలం హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ట్రైన్ నెంబరు అప్ 17011, డౌన్ 17012 మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

పద్మశాలీ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సుబేదారి, జనవరి 2: 31వ డివిజన్ న్యూశాయంపేట పద్మశాలీ సేవా సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం న్యూశాయంపేటలోని పద్మశాలీభవన్‌లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ నాయకులు దేవులపల్లి జానకిరాములు, డాక్టర్ గుండు సదానందం, చందనాల సదానందం, కోడం సతీష్, కోడం సంపత్, చందనాల మురళీకృష్ణ, వలుపదాసు శ్యామ్, గుజ్జేటి రమేష్, గుజ్జేటి నాగరాజు, గాడిపల్లి మహేష్, కడవేరు శ్రీనివాస్, గోనె శివ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సేవా సంఘం నాయకులు

రేపు దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతాలు

హనుమకొండ కల్చరల్, జనవరి 2 : మార్గశిర మాసం జనవరి 4న నగరంలోని ములుగురోడ్‌లో గల శ్రీవరద దత్తక్షేత్రంలో వేయి మంది జంటలతో సామూహిక ప్రధాన శ్రీఅనఘాష్టమి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎస్ దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ప్రతీ ఏడాది మార్గశిర బౌళ అష్టమి రోజున ముఖ్యమైన పండగగా దత్తపీఠంలో వ్రతాలు ఆచరిస్తారని వరంగల్ నగరంలో కూడా గత 30 ఏళ్ల నుంచి ఈ వ్రతాలను ఆచరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవధూత దత్తపీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ భక్తులందరితో వ్రతాలను ఆచరింప చేస్తారని తెలిపారు.పెళ్లికాని వారు, అనారోగ్యం, కష్టాల్లో ఉన్నవారు ఈ వ్రతం ఆచరిస్తే మంచి ఫలితాలు కలుగుతాయని తెలిపారు. ఈ నెల 4న గురువారం ఉదయం 10 గంటలకు వ్రతాలు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తాయి. అనంతరం భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేసినట్లు ప్రధాన అనఘాష్టమి వ్రతాల్లో భక్తులందరు పాల్గొని దత్తస్వామి కృపకు పాత్రులు కావాలని వామన్‌రావు తెలిపారు.

33,353 అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ

హనుమకొండ సిటీ, జనవరి 2 : వరంగల్ మహానగర పరిధిలోని 66 డివిజన్లలో మంగళవారం అభయహస్తం దరఖాస్తులు మొత్తంగా 33,353 సమర్పితమయ్యాయి. డిసెంబరు 28 నుంచి ప్రజాపాలన ద్వారా అభయహస్తం దరఖాస్తులను స్వీకరిస్తున్న సంగతి విదితమే. రెండు రోజులు సెలవులు కావడంతో దరఖాస్తుల స్వీకరణ జరగలేదు. మంగళవారం నుంచి యధావిధిగా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. గడిచిన నాలుగు రోజుల్లో మొత్తం 120145 అభయహస్తం దరఖాస్తులు సమర్పితమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కలెక్టర్‌ను కలిసిన టీజీవో నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీవో నేతలు

హనుమకొండ రూరల్, జనవరి 2 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) నాయకులు మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం, పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీలను సైతం కలిసి వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవో ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ ఏ.జగన్‌మోహన్‌రావు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, హరిప్రసాద్, వేణు, సురేశ్ కుమార్, మాధవరెడ్డి, రాజేష్‌కుమార్, అజహర్ షరీఫ్, శ్రీనివాస్, సాయిరాజ్, రాంచంద్రరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో 3 రోజుల అంతర్జాతీయ సదస్సు

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ వెల్లడి

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో మార్చి 21, 22, 23 తేదీల్లో సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగం నేతృత్వంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ వెల్లడించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఉద్యోగులతో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది వీసీ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ రమేశ్ మాట్లాడుతూ.. 2023లో కేయూ గొప్ప విజయాలను సాధించినట్లు పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్, స్నాతకోత్సవం, బయో టెక్నాలజీలో అంతర్జాతీయ సదస్సు, 82వ ఐహెచ్‌సీ సదస్సులను నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పీఆర్వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ సంయోజకులుగా వ్యవహరించగా వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ బన్న ఐలయ్య ,ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఎస్. వాసుదేవారెడ్డి, డాక్టర్ ఎం. తిరుమలదేవి, ప్రొఫెసర్ షమిత, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ చాడ రాధికారెడ్డి, ప్రొఫెసర్ మంచాల సదానందం పాల్గొన్నారు.

పథకాలు అందించేందుకు ప్రణాళికలు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

మల్లక్‌పల్లిలో ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

కాజీపేట, జనవరి 2 : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట 47వ డివిజన్‌లో డీజిల్‌కాలనీలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి , కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాలు ప్రజలకు అందించేందుకు పెద్దఎత్తున ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, నాయకులు ఎండీ అంకూస్, డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, నాయకులు ఎండీ అంకూస్, డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, క్రాంతి, భరత్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. కాజీపేట 48వ డివిజన్‌లోని దర్గాలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6వరకు డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే ప్రజాపాలన సభలకు విచ్చేసి పథకాలకు సంబంధించి దరఖాస్తుల సమర్పణ పరంగా తమ తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సభలకు విచ్చేసే ప్రజలకు అధికారులు, సిబ్బంది సహకారమందిస్తారని తెలిపారు. అనంతరం లబ్దిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు, సిబ్బందితో దరఖాస్తు స్వీకరణ అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నిగ్ధా పట్నాయ క్, నగర పాలక సంస్థ కమిషనర్ రిజ్వాన్ బాషా, కార్పొరేటర్ డాక్టర్ సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూకర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ధర్మసాగర్ : ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. గ్రామస్థుల నుంచి ఎన్ని దరఖాస్తులను స్వీకరించేందుకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. జీపీ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి దరఖాస్తుదారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో జవహర్ రెడ్డి, ఎవో పద్మ, సర్పంచ్ రాజు, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో అయోధ్య రాముడి అక్షింతల వితరణ



ఇంటింటికీ అయోధ్య అక్షింతలను అందజేస్తున్న రామభక్తులు

మడికొండ, జనవరి 2: రామజన్మ భూమి తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో రామభక్తులు మంగళవారం మడికొండలో ప్రతీ ఇంటికీ తిరిగి అయోధ్యరాముడి అక్షింతలను అందజేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి భక్తిశ్రద్ధలతో అక్షింతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రామభక్తులు పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు అయోధ్యలో ఈనెల 22న అంగరంగ వైభవంగా బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ హిందూ ధర్మ రక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, మంత్రవాది వెంకటప్రసాద్, ముత్తోజు సురేష్, ఎలగొండ శివ, దొంతుల సూర్య ప్రకాశ్, గందె సురేష్, దార ధనుంజయ్, అన్వేష్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

మృతుడు హనుమకొండ వాసి



రోహిత్‌రెడ్డి (ఫైల్)

రాయదుర్గం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. గచ్చిబౌలి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన రోహిత్‌రెడ్డి(31) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి గౌలిదొడ్డిలో నివసిస్తూ ఓ కంపెనీలో సేఫ్టీ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ద్విచక్రవాహనంపై గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలి వెళ్తున్నాడు. ఐఎస్‌బీ గేటు ఎదుట వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుంది'

వేలేరు(ధర్మసాగర్) జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ వేలేరు మండల ఇన్‌చార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లికుదుర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని పక్కకు పెట్టారన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు ప్రజల పక్షాన కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

హనుమకొండ టౌన్, జనవరి 2 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావును పలువురు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, బీఆర్ ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్, మర్రి యాదవరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ జ్ఞాపకాలు గుర్తు చేసుకొని రాబో యే రోజులు మనవేనని, పార్టీ కోసం నిరంతరం కృషి చేయా లని మాజీ మంత్రి హరీష్‌రావు వారితో పంచుకున్నారు.



హరీశ్‌రావుకు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

6న బ్రహ్మకుమారి సంస్థ స్వర్ణోత్సవ సంబరాలు

వడ్డేపల్లి, జనవరి 2 : ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వరంగల్ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 6న సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూ శాయంపేటలో గల డీ- కన్వెన్షన్‌లో బ్రహ్మకుమారి సంస్థ స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజయోగిని బ్రహ్మకుమారి విమల, సునిత, రష్మీ తెలిపారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, విజయవాడ మంతెన సత్యనారాయణ రాజు, చారిటబుల్ ట్రస్టు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుతో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్. నాగరాజు, యశ స్విని రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మురళినాయక్, జాటోత్ రాంచంద్రునాయక్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్‌లు హాజరవుతారని తెలిపారు. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు అదే రోజు సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు మీ ఆరోగ్యం మీ చేతుల్లో అనే అంశం పై ప్రసంగిస్తారని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజ లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 7న ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రహ్మకుమారి సభ్యులతో ఆధ్యాత్మిక సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాలకు బీకే. విమల, సెల్ నంబర్: 85000 41499 లో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో బ్రహ్మకుమార్ కృష్ణమూర్తి, శ్యామ్, బుచ్చయ్య, రాధాకృష్ణ, శివానందం, జి. విధుమౌళి, వెంకట్రాం నర్సయ్య, సాంబయ్య, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి విమల, సునిత

విజయవంతం చేయాలి

కాజీపేట : జనవరి 6న హంటర్‌రోడ్ డీ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బ్రహ్మకుమారీ ఈశ్వరీయ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని కాజీపేట శాఖ నిర్వాహకులు బ్రహ్మకుమారీ శ్రీదేవీ తెలిపారు. కాజీపేట డీజిల్‌కాలనీ శాఖలో మంగళవారం శ్రీదేవీ మాట్లాడారు. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని బుధవారం వరంగల్ పోస్టాఫీస్ నుంచి కాజీపేట డీజిల్‌కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్యతోపాటు మౌంట్ అబు జాయింట్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ రాజయోగి బీ.కెసంతోషి డిడ్డీ, బీకె సుదేశ్ దిడ్డీ హాజరుకానున్నారని చెప్పారు.

కోటి హనుమాన్ చాలీసా పారాయణానికి తరలిరండి

హనుమకొండ కల్చరల్, జనవరి 2 : రాష్ట్రంలోని పలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 21న తిరుపతిలో ఎస్వీ యూనివర్సిటీ ఔట్‌డోర్ స్టేడియంలో భారీ ఎత్తున నిర్వహించే కోటి హనుమాన్ చాలీసా పారాయణానికి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ పిలుపునిచ్చారు. మంగళవారం వేయి స్తంభాల ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. అయోధ్యలో రామాలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం దిగ్విజయంగా జరుగాలని ఆకాంక్షిస్తూ ధర్మ సంస్థాపన కోసం నిర్వహించే పారాయణ కార్యక్రమానికి తెలంగాణ నుంచి కూడా భక్తులు తరలి వెళ్లాలన్నారు. విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి, కంచి స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి, విరూపాక్ష విద్యారణ్యస్వామి, సిద్దేశ్వరానంద భారతి లాంటి ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొంటారని ఆయన చెప్పారు. తిరుపతికి రాలేమనుకున్న వారు కార్యక్రమ విజయాన్ని ఆకాంక్షిస్తూ తమ పేరు గోత్రం వివరాలతో ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ధర్మసంస్థాపన చైర్మన్ ఉడుదల నర్సింహ రావు, ఎం.పవన్‌కుమారస్వామి, బి.నాగ శాస్త్రి పాల్గొన్నారు.



వెబ్‌సైట్ ఆవిష్కరించిన ఉపేంద్రశర్మ

ప్రజాపాలన దరఖాస్తులు అమ్మితే కఠిన చర్యలు

అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా

భీమదేవరపల్లి, జనవరి 2: ప్రజా పాలన దరఖాస్తులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. మంగళ వారం మండలంలోని ముల్కనూర్ మేజర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, ప్రజలతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజా పాలన దరఖాస్తులు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే కొందరు దరఖాస్తులు నింపేందుకు డబ్బులు వసూళ్లు చేస్తున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఇలా దరఖాస్తు లు నింపేందుకు ఎమైనా అనుమానాలు ఉంటే గ్రామాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది ప్రజలకు సహకరించి, ప్రజా పాలన దరఖాస్తులను నింపేందుకు ప్రజలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ కావడంతో 28కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు 1850దరఖాస్తులు ముల్కనూర్ మేజర్ గ్రామ పంచాయతీలో వచ్చినట్లు ఈవో పూర్ణచందర్ తెలిపారు. మేజర్ గ్రామపం చాయతీలో ప్రజలకు అవసరమైన ఏర్పాట్లను చేసినందుకు ఈవో పూర్ణచందర్, సర్పంచ్ మాడ్గుల కొంరయ్యలను అసిస్టెంట్ కలెక్టర్ అభినందించారు. మండలంలో మంగళవారం భీమదేవరపల్లి, కొత్తపల్లి, ముల్కనూర్, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



మడికొండలో ఎయిడ్స్ నివారణ పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మడికొండ, జనవరి 2: మడికొండలో జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, వర్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ పై స్పందన కళారంజని కళాకారులు పాటలు, నృత్యాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవీ మహమ్మారి అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అన్నారు. దాని పట్ల అవగాహన పెంచుకొని అపరిచితులతో శృంగారం, ఒకరు వాడిన సిరంజిలు మరొకరు వాడకుండా ఉండడం వంటి తగిన జాగ్రత్తలు పాటించి నివారించాలన్నారు. జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వర్డ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ జి. గోవర్ధన్, రాకేష్, రమేష్, విష్ణురాజు, ప్రణయ, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

రూ. 4,750 నగదు స్వాధీనం

హనుమకొండ క్రైం, జనవరి 2 : వరంగల్ దేశాయిపేట శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 4,750 నగదుతో పాటు 4 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపేట గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో మంగళవారం సాయంత్రం పేకాట శిబిరంపై మూకుమ్మడిగా దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిని తనిఖీ చేయగా పేక ముక్కలు, నగదు లభించాయి. మరి కొందరు అక్కడి నుంచి పారిపోయారు. జూదరులను ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు వెల్లడించారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులను ఏసీపీ అభినందించారు.

ఏబీ బర్ధన్ వర్ధంతి

సుబేదారి, జనవరి 2: భారత స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక పోషించి సమసమాజ స్థాపనకు కృషి చేసిన ఏబీ బర్ధన్ 8వ వర్ధంతి వేడుకలు మంగళవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ధన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

రెండు కుటుంబాల్లో విషాదం

మారేడుమిల్లి విహారయాత్రకు బయలు దేరి మృత్యుఒడికి..

మానుకోటలో స్కూటర్ తప్పించబోయి, చెట్టు ఢీకొన్న కారు

ఇద్దరు వరంగల్ యువకులు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



రవితేజ (ఫైల్)



సాయిరాం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పాతఛేదు జ్ఞాపకాలకు బై.. బై చెప్పి, అంతా శుభాలు జరగాలని ఆనందంగా ఉండే నూతన సంవత్సరాది ఆరంభం రోజున జరిగిన రోడ్డు ప్రమాద ఘటన రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వరంగల్ నుంచి మారేడిమిల్లి విహారయాత్రకు ఈనెల 1వ తేదీన కారు మహబూబాబాద్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం తప్పించబోయి, చెట్టుకొనడంతో.. ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.

వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ ప్రాంతానికి చెందిన యువకులు గుగ్గిళ్ల రవితేజ (29), వెంగళ సాయిరాం (27) సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, సాయితేజ వరంగల్ నుంచి సోమవారం రాత్రి పొద్దుపోయాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా మారేడుమిల్లి విహారయాత్రకు రవితేజ కారులో బయలు దేరారు. మానుకోట జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డతండ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న గుగ్గిళ్ల రవితేజ, వెంగళ సాయిరాంలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, జి.సాయితేజకు తీవ్ర గాయాలుకాగా, అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం, వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవితేజ, సాయిరాం మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మంగళవారం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు మానుకోట టౌన్ సీఐ సతీష్ తెలిపారు.

ఆ రెండు కుటుంబాల్లో విషాదం..

తమకు అంతా మంచి జరగాలని ఏడాది పొడవునా సంతోషంగా ఉండాలని కుటుంబమంతా ఒకేచోట గడిపే నూతన సంవత్సరం ఆరంభం రోజున జరిగిన రోడ్డు ప్రమాదం ఆ రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. వరంగల్ జిల్లా కేంద్రంలోని మట్టెవాడకు చెందిన ఏఎస్సై గుగ్గిళ్లరామకృష్ణచారి-రవీంద్రమ్మ దంపతుల ఏకైక కుమారుడు రవితేజ (29), వెంగళ కుమారస్వామి- లలిత దంపతుల ఏకైక కుమారుడు సాయిరాం (27)లు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయా కుటుంబాల వారసులు మృత్యువాతపడడంతో ఆ రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.





ఒంటికి మెత్తగా తగులుతూ, తేలికగా, సౌకర్యంగా ఉండే కాటన్ చీరలను ఇష్టపడని మహిళలంటూ ఉండరు. మరీ ముఖ్యంగా జైపూర్ బగ్రూ కాటన్ చీరలు ఇటీవలి కాలంలో మహిళల మనసులను దోచుకుంటున్నాయి. ఆకర్షణీయమైన రంగులు, అద్దకాలతో అలరిస్తున్న బగ్రూ హ్యాండ్ ప్రింట్ కాటన్ చీరలు ఇవే!

భలే 'బగ్రూ'

ఘన చరిత్ర

300 ఏళ్ల నాటి బగ్రూ చేతి అద్దకం టెక్నిక్ మూలాలు, రాజస్థాన్, జైపూర్‌కు చెందిన 'బగ్రూ' అనే ఒక మారుమూల కుగ్రామంలో ఉన్నాయి. సంజారియా నది చుట్టుముట్టి ఉండే, బగోరా దీవి నుంచే 'బగ్రూ' అనే పేరు పుట్టుకొచ్చింది. ఆఫ్ వైట్ బ్యాక్‌గ్రౌండ్ మీద ముదురు రంగు మోటిఫ్స్ ముద్రించి ఉండడం ఈ చీరల ప్రత్యేకత. రాజస్థాన్‌లోని 'చిప్ప', 'ఖరాడి' అనే కమ్యూనిటీకి చెందిన వాళ్లు ఈ సంప్రదాయ అద్దకాన్ని వందల ఏళ్ల నుంచీ కొనసాగిస్తూ ఉండడం విశేషం.



పరిమిత డిజైన్లలో...

వైవిధ్యమైన పూల మోటిఫ్స్‌ను కలిగి ఉండే బగ్రూ చీరలు ఎక్కువగా ఇండిగో, నారింజ, పసుపు రంగుల్లో తయారవుతూ ఉంటాయి. మోటిఫ్స్‌తో పాటు బుటా, ఝర్ లేదా బార్డర్‌లను కలిగి ఉండడం ఈ చీరల ప్రత్యేకత. ఈ చీరలన్నీ పాత కళాకృతులు, పొద్దుతిరుగుడు, గులాబీ, ఇతర స్థానిక పువ్వుల డిజైన్లనే కలిగి ఉంటాయి.



ఇలా శింగారించాలి

బగ్రూ కాటన్ చీరలను డైలీ వేర్‌గా, ఆఫీస్ వేర్‌గా వాడుకోవచ్చు. ఫ్యాషన్ ఐకాన్‌గా కనిపించాలనుకుంటే, మెటల్ జ్యువెలరీ ధరించాలి. చీరకు మ్యాచింగ్ బ్లౌజ్ స్టైలిష్‌గా ఉండేలా చూసుకోవాలి. కొల్హాపురి చెప్పులు ఈ చీరలకు చక్కగా సూటవుతాయి. వీలైనంత వరకూ సింపుల్ జ్యువెలరీనే ఎంచుకోవాలి.





ఆమె వంటకు మాస్టర్ షెఫ్‌లు ఫిదా అయిపోతారు. ఒకటో తరగతి కూడా చదవని ఆమె... ఇంట్లో అప్పాల అమ్మకం మొదలుపెట్టి... నేడు దాన్ని ఒక పరిశ్రమ స్థాయికి తీసుకువెళ్లారు. తెలంగాణ పిండి వంటలకు బ్రాండ్ ఇమేజ్ తెచ్చి... ఎనభై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో గరిటె తిప్పుతున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ఇటీవల ఆవిష్కరించిన '50మంది స్ఫూర్తిదాయక మహిళలు' పుస్తకంలో ప్రత్యేక స్థానం పొందిన **వంగపల్లి సావిత్రమ్మ** తన పాతికేళ్ల ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.



'అప్పాలమ్ముకుంటావా' అని నవ్వారు..!

"నా చిన్నతనంలో సంక్రాంతి, దసరా లాంటి పండుగలప్పుడు మా ఇంట్లో వారం ముందే సందడి మొదలయ్యేది. ఇరుగుపొరుగు మహిళలందరూ ఒకచోట చేరి పిండి వంటలు చేసేవారు. అప్పాలు ఒత్తడం, అరిసెల పాకం పట్టడం, సకినాలు చుట్టడం, మురుకులకు పిండి కలపడం... వాళ్ల పక్కనే కూర్చొని అన్నిటినీ ఆసక్తిగా గమనిస్తుండే దాన్ని. కొన్నాళ్లకు నేను కూడా వారితో కలిసి గరిటె తిప్పడం ప్రారంభించాను. ఆ ఇష్టమే ఇవాళ నన్ను 'సకినాల సావిత్రమ్మ'గా ఈ లోకానికి పరిచయం చేసింది. నేడు నా చేతి పిండి వంటలు, పచ్చళ్లు దేశ, విదేశాలకు వెళుతున్నాయి. చిన్నజీయర్‌స్వామి లాంటి మహానుభావుల నుంచి సత్కారాన్ని అందుకున్నాను. 'తెలంగాణ పిండివంటలకు మంచి పేరు తెచ్చావమ్మా' అని తెలిసినవారంతా అంటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. అయితే ఇంతటి పేరు వెనుక కొన్నేళ్ల కష్టం ఉంది.

'బావున్నాయమ్మా' అంటే...

చిన్నతనం నుంచి పిండివంటలు చేయడం, వాటిని ఇతరులకు ఇవ్వడం నాకు చాలా ఇష్టం. అవి తిన్నవారు 'బావున్నాయమ్మా' అంటే... ఆనందంతో నా కడుపు నిండిపోతుంది. ఖాళీగా కూర్చోడమంటే నాకు మహాచికాకు. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తుండాలి. అది నలుగురికీ మేలు చేసేది అయుండాలని అనుకొంటాను. నేనేమీ చదువుకోకున్నా... ఇదివరకు జగిత్యాలలో కొంతమంది కేరళ ఉపాధ్యాయులతో స్కూలు నిర్వహించాను. పదేళ్లు దాన్ని విజయవంతంగా నడిపించాను. హన్మకొండలో విద్యార్థుల కోసం హాస్టల్ పెట్టాను. కొంత కాలం మెస్ కూడా నడిపాను. మా సొంతూరు కరీంనగర్ జిల్లా బీర్పూర్. నా భర్త సత్యంరావు సివిల్ కాంట్రాక్టర్. 1990లో మేం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాం. అప్పుడు మా ఇంటి ముందే టెలిఫోన్‌బూత్ ప్రారంభించాను. నలుగురికీ వండిపెట్టిన చెయ్యి కదా... ఊరికే ఉండలేకపోయాను. ఒకరోజు మూడు గ్లాసుల బియ్యం మిక్సీ పట్టి సకినాలు చేశాను. వాటిని మా ఎస్టీడీ బూత్ ముందు పెడితే అన్నీ ఒక్కపూటలో అమ్ముడయ్యాయి.

కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ...

క్రమంగా సకినాలకు ఆదరణ పెరిగింది. దాంతో సర్వపిండి, మురుకులు, లడ్డూ... ఇలా ఒక్కో వంటకం రోజుకు రెండు కేజీల చొప్పున చేయడం మొదలుపెట్టాను. ఆనోటా ఈనోటా పాకడంతో తక్కువ సమయంలోనే అమ్మకాలు పుంజుకున్నాయి. మెల్లగా పెళ్లి, వడిబియ్యం సారెలకు పిండివంటల ఆర్డర్లు వచ్చాయి. సంప్రదాయాలమీద నాకు కొంత అవగాహన ఉండటంతో శుభకార్యాలనుబట్టి సారెకు ఎన్ని రకాల ఐటెమ్స్ పంపాలి, అందులోనూ ఎన్ని చుట్లు సకినాలు చేయాలి లాంటి విషయాలను కస్టమర్లకు చెబుతుండే దాన్ని. దాంతో 'సావిత్రమ్మ దగ్గర సారె వంటలు తీసుకెళితే' అవతలి వైపు నుంచి పల్లెత్తు మాట రాదని వారంతా అనుకొనేవారు. అలా కేటీఆర్ పెళ్లి సారె, కవిత ఒడిబియ్యం సారె... ఇలా కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ పిండివంటలు మా దగ్గర నుంచే వెళ్లాయి. ఇంతవరకు 'మా పిండి వంటలు కొనండి' అని నేనెన్నడూ ఒక కరపత్రం వేయించలేదు. గోడ పత్రిక ముద్రించలేదు. మా కస్టమర్లే మాకు ప్రచారకర్తలు.

నన్ను చూసి నవ్వినవారే...

నా చేతి వంటలకు మంచి ఆదరణ రావడంతో నా కోడలు రేణుకతో కలిసి 1998లో 'శ్రీదేవి తెలంగాణ పిండివంటకాలు' పేరుతో స్వగృహ ఫుడ్స్ ప్రారంభించాం. రోజుకు రెండు కేజీల అప్పాలతో మొదలైన వ్యాపారం ఇప్పుడు ఆరు క్వింటాళ్లకు అమ్మకాల స్థాయి పెరిగింది. పండుగలప్పుడైతే పది క్వింటాళ్లు కూడా చేస్తుంటాం. మొదట్లో మా ఊళ్లో వారంతా 'పట్నం పోయి అప్పాలమ్ముకుంటున్నావా' అంటూ నన్ను చూసి నవ్వారు. ఇప్పుడు వారే నా గురించి నలుగురికీ గర్వంగా చెబుతుంటారు. ఇంకొందరు సొంతంగా అప్పాలు చేసి తెలంగాణ పిండివంటల పేరుతో అమ్ముతున్నారు. అందుకు నాకూ సంతోషంగా ఉంది. పదిహేనేళ్ల కిందట నిజాం కాలేజీ మైదానంలో తెలంగాణ సంబురాలప్పుడు ప్రత్యేక స్టాల్ పెట్టాం. అందులో గట్కా, సర్వపిండి, అరిసెలు, సకినాలు, బిళ్ల అప్పాలు లాంటివన్నీ ఒక్కపూటలో అయిపోయాయి. ఆ స్టాల్‌వల్ల మా వంటకాలకు బోలెడంత ప్రచారం వచ్చింది.

విమానంలో తీసుకెళితే...

పిండివంటల తయారీ అంతా చాలా కాలం వరకు ఇంటి పట్టునే కొనసాగించాం. ఆస్ట్రేలియాలో ఎంబీఏ చేసిన నా మనవడు రాంగోపాల్ నిరుడు సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చినప్పుడు, కస్టమర్లకు సమయానికి వంటకాలను అందించడానికి మేము పడుతున్న అవస్థ గమనించాడు. మురుకులు, కారప్పూస తయారీ మిషన్లను తెప్పించాడు. సకినాల పిండి కలిపేందుకు, చిప్స్ కోసం ఆలుగడ్డ తరిగేందుకు, పల్లీలు రాకేందుకు యంత్రాలు కొనుగోలు చేశాడు. విదేశాల్లో ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లకుండా, మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాడు. నా మనవడి చొరవతోనే ఇంట్లో మొదలైన అప్పాల తయారీ ఇప్పుడు



నాచారంలో చిన్న పరిశ్రమ స్థాయికి ఎదిగింది. మా దగ్గర వందమందికి పైగా ఉద్యోగులున్నారు. వారికి రోజూ మధ్యాహ్న భోజనం, ప్రతి పండుగకు బోనస్, కొత్త దుస్తులు ఇస్తున్నాం. ఏడాదికి ఒకసారి వారందరినీ యాత్రలకు తీసుకెళుతుంటాను. అలా గత ఏడాది ఉద్యోగులను విమానంలో తిరుపతి తీసుకెళితే... వారి ఆనందం మాటల్లో చెప్పలేనిది. నన్ను వారంతా 'పెద్దమ్మ' అని అప్యాయంగా పిలుస్తారు. అలా పిలిపించుకోవడమే నాకు ఇష్టం. వారికి ఏ కష్టం వచ్చినా, సాయం అందిస్తుంటాను. మా ఉద్యోగులు కూడా సంస్థను తమదిగానే భావించి పని చేస్తుంటారు.

కష్టాలను దాటి...

జీవితమన్నాక కష్టసుఖాలు, వ్యాపారమన్నాక లాభనష్టాలు లేకుండా ఉండవు కదా. పిండివంటల వ్యాపారమనగానే చాలామందికి లాభమే కనిపిస్తుంది. దాని వెనుక ఎంతో చాకిరీ ఉంటుంది. ఇక నష్టం సంగతి చెప్పక్కర్లేదు. ఒక్కోసారి పచ్చళ్లు పాడవుతుంటాయి. పిండివంటలు మిగిలిపోతాయి. అప్పుడు వాటన్నింటినీ చెత్తలో పడేయాల్సిందే. మరికొన్ని సందర్భాల్లో ఆర్డర్లు చివరి నిమిషంలో క్యాన్సిల్ చేస్తుంటారు. ఒక్కొక్కరు రుచి సరిగ్గా లేదని వంకలు పెడుతుంటారు. అప్పుడు మళ్లీ ఫ్రెష్‌గా ఇవ్వడం లేదా డబ్బులు తిరిగి ఇచ్చేయడమో చేస్తుంటాం. ఆహార పదార్థాల ధరలు అమాంతం పెరుగుతాయి. అలాంటప్పుడు ఒకేసారి మేము ధర పెంచలేము కదా. ఇలా ఒకటా రెండా... బోలెడు సమస్యలుంటాయి. వాటన్నిటినీ దాటి ఇక్కడి వరకు వచ్చాను. నా విజయ రహస్యం అంటే... నా కుటుంబ సహకారమే. నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. నా కోడలు రేణుక నాకు మొదటి నుంచి అండగా ఉంటోంది. తెలంగాణలోని '50మంది స్ఫూర్తిదాయక మహిళల' జాబితాలో నాకూ స్థానం దక్కడం ఆనందంగా ఉంది. మాస్టర్ షెఫ్ కునాల్ కపూర్ పచ్చళ్ల తయారీపై నాతో స్పెషల్ షో చేయించారు. 'కష్టపడి పని చేయాలి. తద్వారా మరొకరికి మేలు కలగాలి. ఆ తర్వాతే ఫలితం ఆశించాలి' అనేది నేను నమ్ముతాను. అదే ఇప్పటి వాళ్లకు చెబుతాను. ఇవాల్టికీ ఖాళీగా మాత్రం కూర్చోను. రోజూ ఇంట్లోని వంటతో పాటు దుకాణంలో నాలుగు గంటలైనా పని చేస్తుంటాను. అలా పని చేయబట్టే ఆరోగ్యంగా ఉన్నాను.

• సాంత్వన్

అదే రహస్యం...

'మేం ఎంతగా ప్రయత్నించినా మా ఇళ్లల్లో వండిన వాటికి మీ దుకాణంలోని అప్పాలంత రుచి రావడం లేదు. మీరేమైనా కలుపుతారా? ఆ రహస్యమేంటో మాకూ చెప్పచ్చు కదా" అని తెలిసినవాళ్లంతా నన్ను అడుగుతుంటారు. మేము ఇంట్లో చేసుకొనే పద్ధతిలోనే మా స్వగృహ ఫుడ్స్‌లోనూ తయారు చేస్తాం. కనీసం పచ్చళ్ల నిల్వ కోసం కూడా ఏమీ కలపం. ఒక వంటకానికి వాడిన నూనెను మరొకదానికి ఉపయోగించం. సకినాలు, మురుకులు ఇలా ప్రతి వెరైటీకి వేర్వేరు మూకుడులు వాడతాం. పల్లీలు, నువ్వులు, పప్పులు లాంటి ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీపడం. అందుకే రుచిగా ఉంటాయి. అంతకు మించిన రహస్యం మరేమీ లేదు.

మేనకాగాంధీకి పచ్చళ్లు...

నేను వండిన అప్పాలంటే చాలా మందికి ఇష్టం. శుభకార్యాలు, పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాలప్పుడు సినిమా, రాజకీయ నాయకులు మా పిండివంటలు తీసుకెళతారు. హీరో విజయ్ దేవరకొండ మొన్న దీపావళికి సకినాలు, సర్వపిండి, అరిసెలు మా దగ్గరే చేయించుకున్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజకీయ నాయకులు మధుయాష్కి, బి.వినోద్‌కుమార్, చెన్నమనేని విద్యాసాగరరావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితర ప్రముఖుల ఇళ్లల్లోని శుభకార్యాలకు స్వీట్, హాట్ ఐటెమ్స్ మా దగ్గరే కొంటారు. ఇందిరమ్మ కోడలు, రాజకీయ నాయకురాలు మేనకాగాంధీకి నా చేతి పచ్చళ్లంటే చాలా ఇష్టం. గోనె ప్రకాశరావు ఆమె కోసమే నాతో ప్రత్యేకంగా చింతకాయ, పండుమిరప పచ్చళ్లు పెట్టించేవారు. విజయశాంతి కూడా నా వంటలను రుచి చూసి 'చాలా బావున్నాయి' అని మెచ్చుకొన్నారు.

దశాబ్దాల వైషమ్యంతో... ఎల్లప్పుడూ ఘర్షణాత్మక వాతావరణంతో ఉండే భారత్, పాకిస్తాన్ దేశాల ప్రజల మధ్య సుహృద్భావాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తున్నారు **శ్రేయా మజుందార్**. దీనికోసం తొమ్మిదేళ్లుగా ఇరు దేశాల్లోని వ్యక్తులతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన 'పాక్ బంధు' గురించి ఆమె ఏం చెబుతున్నారంటే...



ఇరుదేశాల 'శ్రేయ'స్సు కోసం..

"దేశ విభజన తరువాత.. 1947లో పాకిస్తాన్‌ను వదిలి భారతదేశానికి వచ్చి, లఖ్‌నవూలో స్థిరపడిన కుటుంబాల్లో మాదీ ఒకటి. పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో.. మా బామ్మ పూర్వీకుల ఇల్లు ఉండేది. ఆ ప్రాంతాల్నీ, అక్కడి వాతావరణాన్నీ, ఆడుతూ పాడుతూ గడిపిన రోజుల గురించీ ఆమె మరణించేవరకూ గుర్తు చేసుకొనేవారు. ఆ కథలన్నీ వింటూ పెరిగాను. సరిహద్దును దాటి నా ఊహలు పయనించేవి. భారత్-పాక్... ఒకే నాణేనికి రెండు పార్శ్వాలనే ఆలోచన నాలో స్థిరపడిపోయింది. అదే సమయంలో... రెండు దేశాల మధ్యా నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణం గురించి వార్తలు వినని రోజంటూ ఉండేది కాదు. సరిహద్దుకు అటూ... ఇటూ ఎన్నో లక్షలమంది మనసుల్లో... ఒకప్పుడు కలిసి ఉన్న నాటి జ్ఞాపకాలు, విభజన తరువాత అవతలి దేశంలోకి వచ్చాక... మళ్లీ ఎన్నటికీ ఆ వైపు వెళ్ళలేని నిస్సహాయత గూడుకట్టుకొని ఉంటాయనే వాస్తవం నన్ను ఎల్లప్పుడూ వెంటాడుతూ ఉండేది.

అది దేశాలకు అతీతం...

నేను ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ పొందాను. ఒక ప్రముఖ సంస్థలో కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సమయంలో.. 2014లో, పెషావర్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ మీద దాడి జరిగింది. 'తెహ్రీక్- ఐ- తాలిబన్ పాకిస్తాన్'కి చెందిన ఆరుగురు సాయుధులు సాగించిన ఈ నరమేధంలో... 132మంది విద్యార్థులతో సహా 149 మంది మరణించారు. ఈ సంఘటనకు భారత దేశం కూడా చలించిపోయింది. ఇరు దేశాల్లోనూ ప్రజలు మృతుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సంఘీభావం నన్ను కదిలించింది. ఎవరికైనా బాధ కలిగినప్పుడు 'అయ్యో' అని స్పందించే మానవీయత... దేశాలకు అతీతం. భారత్, పాక్ మధ్య ఉన్న విభేదాలు, విద్వేషాల గురించి కాకుండా... సారూప్యతల గురించి ప్రచారం చేస్తే... సామరస్యపూర్వకమైన వాతావరణం నెలకొంటుందనిపించింది. 2015లో 'పాక్ బంధు' అనే ఆన్‌లైన్ ఫోరమ్‌ను ఇరుదేశాల ప్రజల కోసం ప్రారంభించాను. 'పాక్' అంటే ఇస్లాంలో 'స్వచ్ఛమైన' అనే అర్థం ఉంది. 'బంధు' అంటే సంస్కృతంలో 'స్నేహితుడు' అని అర్థం. 'పాక్ బంధు' అంటే 'స్వచ్ఛమైన స్నేహితులు'. భావసారూప్యత ఉన్న మిత్రులు అందులో భాగస్వాములయ్యారు. క్రమంగా నా ప్రయత్నానికి ఆదరణ పెరిగింది. భారత్-పాక్ మధ్య స్నేహసంబంధాల కోసం ఏం చెయ్యాలనేది చర్చించినప్పుడు... ఇరు ప్రాంతాల అనుసంధానానికి కళలే వారధిగా ఉపయోగపడతాయని అందరం అభిప్రాయపడ్డాం. మన హిందీ పాటలంటే



చాలామంది పాకిస్తానీయులకు ఇష్టం. అందుకని ఆన్‌లైన్ అంత్యాక్షరి మొదలుపెట్టాం. 2017లో... పాకిస్తాన్ ఫిక్షన్, నాన్ ఫిక్షన్ సినిమాలతో ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహించాం. భావోద్వేగాలపరంగా వాటికీ, భారతీయ చిత్రాలకూ ఉన్న పోలికల గురించి చర్చా వేదిక ఏర్పాటు చేశాం. దానికి మంచి స్పందన వచ్చింది. ఆ తరువాత ఇరు దేశాల కవులు, సంగీత కళాకారులు, సినీ రూపకర్తలు, యాసిడ్ దాడులకు గురైనవారు, కథకులు, సామాజిక కార్యకర్తలు, ట్రాన్స్‌జెండర్స్ తదితర కమ్యూనిటీలకు చెందినవారితో రెండేళ్ళపాటు వరుసగా సెమినార్లు ఏర్పాటు చేశాం. ముందుగా ఎంపిక చేసుకున్న అంశాలపై చర్చా గోష్ఠులు నిర్వహించాం. 'రుబారూ ఆన్‌లైన్ ఇంటరాక్షన్స్' పేరుతో మాకొక విభాగం ఉంది. దీనిలో ప్రముఖ పాకిస్తానీ కళాకారులు, సామాజిక కార్యకర్తలు తమ కార్యాచరణ గురించి చర్చిస్తారు. గుర్తింపు, జాతీయత, మతం, సృజనాత్మకత తదితరాల విషయాల్లో భారత్, పాక్ మధ్య ఉన్న పోలికలే కాదు అంతరాలనూ వివరిస్తారు. అంతరాలను అధిగమించే మార్గాలను సూచిస్తారు. కొవిడ్ సమయంలోనూ ఈ కార్యక్రమాలు కొనసాగాయి. కిందటి ఏడాది లఖ్‌నవూలో.. భారత్, పాకిస్తానీ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేశాం. ప్రతి నెలా కనీసం మూడు కార్యక్రమాలు జరుగుతాయి. కొన్ని వేలమంది పాక్ బంధులో సభ్యులుగా ఉన్నారు. దాదాపు 2,500 మంది చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

'మరే పనీ దొరకలేదా?' అన్నారు...

తొమ్మిదేళ్ళ ఈ ప్రయాణమంతా సజావుగా సాగిపోయిందనుకుంటే పొరపాటే. నా జెండర్, జాతీయత మీద అనేకమంది అసభ్యమైన వ్యాఖ్యలు చేశారు. "నువ్వు చెయ్యడానికి ఇంతకన్నా మరే పనీ దొరకలేదా?" అని స్వయంగా మా అమ్మా, నాన్న అన్నారు. నా స్నేహితుల్లో చాలామంది నా పనిని ఆమోదించలేదు. "ఇది చెయ్యడంలో నాకు సంతృప్తి లభిస్తోంది. అలాంటప్పుడు ఎందుకు మానెయ్యాలి?" అనేది నా జవాబు. ఇప్పుడు అనేకమంది ప్రముఖులు 'పాక్ బంధు'లో భాగమయ్యారు. భారత్‌లోకి పాక్ కళాకారుల రాకకు మళ్లీ ఆమోదించాలని కోరుతూ ప్రభుత్వానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం. రెండు దేశాలూ ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యలపై డాక్యుమెంటరీల రూపకల్పన కోసం ప్రణాళికలు వేస్తున్నాం. చిన్న స్థాయిలో మేం చేస్తున్న కార్యక్రమాల వల్ల... తక్షణమే శాంతి నెలకొంటుందని భావించడం లేదు. కానీ ఒకప్పుడు కలిసి ఉన్న దేశాల ప్రజల మధ్య తిరిగి స్నేహం చిగురించాలంటే ఏదో ఒకవైపు నుంచి ప్రయత్నం ప్రారంభం కావాలి. ఆ దిశగా మేము వేసిన ఒక చిన్న అడుగు- పాక్ బంధు"

అలోవెరాతో కురులు ఆరోగ్యం

అలోవెరాలో విటమిన్లు, అమినో యాసిడ్స్ ఉండటం వల్ల జుట్టుకెంతో మంచిది. ముఖ్యంగా జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. సులువుగా ఇంట్లోనే తయారు చేసుకునే హెయిర్ ప్యాక్స్ ఏంటో చూద్దాం.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌తో పాటు టీస్పూన్ మందారపూల పొడిని తీసుకోవాలి. బాగా మిక్స్ చేసి జుట్టుకు పట్టిస్తే వెంట్రుకల డ్యామేజీని అరికడుతుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి గంటపాటు వదిలేయాలి. ఆ తర్వాత చన్నీళ్లతో జుట్టును శుభ్రం చేసుకోవాలి. ఇలా నెలకు రెండుసార్లు చేస్తే చుండ్రు తగ్గిపోతుంది. జుట్టులో మెరుపు వస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనెను ఒక బౌల్‌లో వేసి మిక్స్ చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత గోరు వెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే జుట్టు పొడవుగా పెరగటంతో పాటు గట్టిగా ఉంటుంది.
- బౌల్‌లో మూడు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, మూడు టేబుల్ స్పూన్ల పచ్చికొబ్బరి పాలు, టేబుల్ స్పూన్ కొబ్బరినూనె వేసిన తర్వాత బాగా మిక్స్ చేయాలి.
- కోడిగుడ్డు సొన, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, మూడు టేబుల్ స్పూన్ల అలోవెరాజెల్‌ను బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత జుట్టు కుదుళ్లు తాకేట్టు పట్టించాలి. పది నిముషాల పాటు మసాజ్ చేసినట్లు పట్టించాలి. నలభై నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు ఊడిపోవటం తగ్గుతుంది.
- అరకప్పు అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పట్టిస్తే జుట్టులో ఉండే రెడ్‌నెస్‌తో పాటు ఇరిటేషన్లు ఉండే తొలగిపోతాయి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 3 జనవరి 2024
cinema@andhrajyothy.com

భారతీయుడు 2 ముగించారా?



కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియన్ 2'. (తెలుగులో 'భారతీయుడు 2). గతంలో శంకర్ దర్శకుడిగా వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది సీక్వెల్. నత్త నడకను తలపించిన ఈ చిత్రం షూటింగ్ ఎట్టకేలకు ముగిసిందని తెలుస్తోంది. కమల్‌హాసన్ యూనిట్‌తో కలసి దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ ఫొటోను బట్టి 'ఇండియన్ 2' చిత్రీకరణ ముగిసిందని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కమల్‌హాసన్ తన పోర్షన్ పూర్తి చేశారని మరికొందరు చెబుతున్నారు. నిజం ఏమిటనేదానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే దర్శకుడు శంకర్ ఈ ఫొటోలో కనిపించకపోవడం విశేషం. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

అప్పుడు అక్కడే ఉన్నా



జపాన్ వరుస భూకంప ఘటనలపై ఎన్టీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిని కుటుంబంతో కలసి సెలబ్రేట్ చేసుకునేందుకు గత వారం ఆయన జపాన్ వెళ్లారు. భూకంప హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రాత్రి ఆయన సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నేను క్షేమంగా ఇండియాకు చేరుకున్నాను. గతవారం అంతా నేను అక్కడే గడిపాను. వరుస భూకంప ఘటనలు జపాన్‌ను కుదిపేయడం బాధాకరం. అక్కడి ప్రజలు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. హిందీలో 'వార్ 2' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

క్రేజీ కాంబినేషన్ షురూ?







ఒకరితో సినిమా అనుకోవడం.. ఇంకొకరితో సినిమా చేయడం ఇవన్నీ పరిశ్రమలో కామన్. 'గుంటూరుకారం' తర్వాత త్రివిక్రమ్ సినిమా బన్నీతో ఉంటుందని అందరూ అనుకున్నారు. అయితే.. బన్నీ 'పుష్ప2' షూటింగ్ ఇప్పుడయ్యేలా లేదు. ఆ సినిమాను ఆగస్టులో విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. అంటే.. దాదాపు జూలై దాకా షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. మరోవైపు త్రివిక్రమ్ 'గుంటూరుకారం' రేపు సంక్రాంతికి వచ్చేస్తోంది. అంటే జులై దాకా ఆగాల్సిందే. అందుకేనేమో..! ప్రస్తుతం గురుజీ చూపు వెంకీవైపు మళ్లిందని ఫిలింనగర్ టాక్. ఈ లోపు వెంకటేశ్‌తో ఓ సినిమా చేసేయాలని ఆయన ఫిక్సయ్యారట. వెంకటేశ్ బ్లాక్‌బాస్టర్స్ నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాల రచయిత త్రివిక్రమే అన్న విషయం తెలిసిందే. వారిద్దరి కలయికలో సినిమా కోసం సగటు ప్రేక్షకుడు కూడా ఇష్టంగా ఎదురుచూస్తున్నాడు. త్రివిక్రమ్ కూడా వెంకీతో సినిమా చేయనున్నట్టు గతంలో ఓసారి చెప్పారు. ఎట్టకేలకు ఆ కాంబినేషన్ ఇప్పటికి సెట్ అయ్యిందని తెలుస్తోంది. అయితే.. ఇది వెంకీ సినిమా మాత్రమే కాదంట. ఇదో మల్టీస్టారర్ అని సమాచారం. రెండో హీరోగా నానీ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. త్వరలోనే ఈసినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల కానుందని విశ్వసనీయ సమాచారం.

కథ క్లైమాక్స్‌కొచ్చింది



'సలార్' చిత్రంతో బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్నారు ప్రభాస్. 'యానిమల్' చిత్రంతో దేశవ్యాప్తంగా సినీ ప్రియులను ఉర్రూతలూగించిన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకోబోతున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో సందీప్‌రెడ్డి వంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కొన్ని సన్నివేశాలు మినహా 'స్పిరిట్' కథ దాదాపు పూర్తయిందని తెలిపారు. ప్రభాస్ నిజాయితీపరుడైన పోలీసాఫీసర్‌గా కనిపిస్తారని చెప్పారు. యాక్షన్ ఘట్టాలు, కథలో మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయన్నారు. ప్రభాస్ పాత్ర శక్తిమంతంగా ఉంటుందని చెప్పారు. మానవ అక్రమ రవాణా నేపథ్యంలో 'షుగర్ ఫ్యాక్టరీ' అనే స్టోరీ సిద్ధమైందన్నారు. అలాగే భవిష్యత్‌లో మహేశ్‌బాబుతో కచ్చితంగా ఓ సినిమా చేస్తానని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు.

ఊహించని కలయిక





ధనుష్, శేఖర్ కమ్ముల సినిమా.. నిజంగా పొంతన లేని కాంబినేషన్ ఇది. శేఖర్ కమ్ముల యూత్‌ఫుల్ డైరెక్టర్. ధనుష్ పక్కా మాస్ హీరో. మరి వీరిద్దరికీ ఎలా సెట్ అవుతుందనేది ఇక్కడ ఆసక్తికరమైన అంశం. ధనుష్ 51వ చిత్రంగా రూపొందనున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అలాగే కథానాయికగా రష్మిక మందన్నాను ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవిశ్రీప్రసాద్‌ని తీసుకున్నట్టు తెలిసింది. శేఖర్ కమ్ముల 'అనామిక' సినిమాకు ఎం.ఎం.కీరవాణి స్వరాలందించారు. మిగతా అన్ని సినిమాలకూ కొత్త మ్యూజిక్ డైరెక్టర్లతోనే మ్యూజిక్ చేయించుకున్నారు శేఖర్ కమ్ముల. ధనుష్ సినిమా కోసం ఇప్పుడు మళ్లీ స్టార్ కంపోజర్‌తో శేఖర్ చేతులు కలిపారని తెలిసింది. నిజానికి శేఖర్ అభిరుచి వేరు. కొత్తవాళ్లతో అద్భుతమైన సంగీతాన్ని తీసుకున్నారాయన. మరి క్లాస్, మాస్ తేడా లేకుండా అన్ని తరహా పాటలకూ మ్యూజిక్ ఇచ్చే దేవిశ్రీతో ఎలాంటి పాటలు చేయిస్తాడో చూడాలి.



చిందెయ్యరా ఘోర హర

ధనుష్ నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. కన్నడ అగ్రహీరో శివరాజ్‌కుమార్ ఇందులో కీలక పాత్ర పోషించారు. సంక్రాంతికి సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన మూడో పాటను చిత్రబృందం విడుదల చేశారు. 'ఘోర హర..' అంటూ సాగే పాటను రాకేందుమౌళి రాయగా, జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు. రాహుల్ సిప్లిగంజ్ హై ఎనర్జీతో ఆలపించారు. ఈ పాటను ధనుష, శివరాజ్‌కుమార్‌లపై చిత్రీకరించడం విశేషం. ఈ పాట ఈసినిమాకే హైలెట్‌గా నిలువనుందని, ధనుష్, శివరాజ్‌కుమార్ డాన్స్ నెక్స్ట్ లెవల్లో ఉంటుందని చిత్రబృందం చెబుతున్నారు. 1930-40 మధ్య జరిగే పీరియడ్ కథాంశంతో, భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సందీప్‌కిషన్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని.

నాకెప్పుడు న్యాయం జరుగుతుందో?



గాయని చిన్మయి మరోసారి తమిళ రచయిత వైరముత్తుపై విమర్శల దాడి చేశారు. కెరీర్ ఆరంభంలో తనను వైరముత్తు లైంగికంగా వేధించాడని 2018 మీటూ ఉద్యమం సమయంలో చిన్మయి ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే తమిళ పరిశ్రమ వైరముత్తుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా చిన్మయిపైనే నిషేధం విధించింది. గతేడాదే ఆ నిషేధం తొలగింది. వైరముత్తు రచించిన 'మహా కవితై' పుస్తకావిష్కరణ ఇటీవలే చెన్నైలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నాయకుడు చిదంబరం, కమల్‌హాసన్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో చిన్మయి సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. 'నన్ను లైంగికంగా వేధించడమే కాకుండా, నా కెరీర్‌ను నాశనం చేసిన వ్యక్తికి చాలా పెద్ద వ్యక్తుల మద్దతు ఉంది. నాకు ఎప్పుడు న్యాయం జరుగుతుందో?' అని స్పందించారు.

వరుణ్ సందేశ్ థ్రిల్లర్



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. శ్రీ అద్యాంత్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. మంగళవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలి షాట్‌కు వరుణ్ సందేశ్ క్లాప్ ఇచ్చారు. సినిమాటోగ్రాఫర్ అజయ్ కుమార్ చిత్రీకరించారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి. ఇప్పటి వరకూ నేను నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన కథాంశంతో వస్తున్న థ్రిల్లర్ చిత్రం. హీరో లుక్, క్యారెక్టరైజేషన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'డిఫరెంట్ మేకింగ్, టేకింగ్‌తో ఈ సినిమాను నిర్మించబోతున్నాం. లొకేషన్స్ కూడా చాలా కొత్తగా ఉంటాయి. కథ, కథనంతో పాటు విజువల్స్ కూడా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇచ్చే చిత్రంగా దీన్ని నిర్మించబోతున్నాం' అన్నారు. ఈ చిత్రంలో రఘు కారుమంచి, ప్రమోదిని, బలగం జయరామ్, వైవా రాఘవ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: రామ్ తుము.

రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం



సుహాస్ హీరోగా నటిస్తున్న 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్, మహాయాన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలోని 'మా ఊరు' లిరికల్ వీడియోను యువ హీరో తేజ సజ్జా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం.. ఇటు రారో ఈ బతుకు పాటను ఇందాం.. ఈ సన్నాయి నొక్కుల్లోనా ఊరించే సంగతులెన్నో ఉన్నాయ్' అంటూ రెహమాన్ రాసిన ఈ పాటకు శేఖర్ చంద్ర సంగీతం అందించారు. కామెడీ డ్రామా కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో శివాని నాగరం, శరణ్య ప్రదీప్, ప్రతాప్, గోపరాజు రమణ తదితరులు నటించారు.

నా కెరీర్‌ను మలుపు తిప్పింది



2023... నటుడిగా నా కెరీర్‌ను మలుపు తిప్పిన సంవత్సరం అని శ్రీతేజ్ చెప్పారు. 'ధమాకా', 'మంగళవారం' తదితర చిత్రాలతో నటుడిగా ఆయన ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'పుష్ప2' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. తన సినీ కెరీర్ గురించి ఆయన మీడియాతో మాట్లాడారు. "కొన్నేళ్లుగా చాలా మంచి సినిమాలు చేస్తున్నా. కానీ గతేడాది మాత్రం నటుడిగా నాకు మంచి అవకాశాలు దక్కాయి. మంగళవారం' చిత్రం నాకు మంచి పేరు తెచ్చింది. 'రావణాసుర, దళారి' చిత్రాలు నటుడిగా ప్రేక్షకులకు గుర్తిండిపోయేలా చేశాయి. అలాగే ఈ ఏడాది 'బహిష్కరణ' అనే వెబ్‌సిరీస్ చేస్తున్నాను. 'ర్యాంబో' చిత్రంలో నా పాత్ర వైవిధ్యంగా ఉండబోతోంది' అన్నారు.

ఆ సినిమా ఆమె జాతకాన్ని మార్చేసింది



ఒకే ఒక్క అవకాశం చాలా మంది జీవితాల్ని మార్చేస్తుంది. గ్లామర్ నటి త్రిప్తి డిమ్రి విషయంలో అదే జరిగింది. రణ్‌బీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమాతో ఆమె ఒక్కసారిగా నేషనల్ క్రష్ అయిపోయింది. ఎవరీమె, వివరాలు ఏమిటి.. అని గూగుల్‌లో చాలా మంది సెర్చ్ చేశారు. ఆ సినిమా విడుదలైన దగ్గర నుంచి అభినందనలు, అవకాశాలు, ఫోన్లు, సందేశాలు...వాటితో క్షణం కూడా తీరిక చిక్కడం లేదు ఆమెకు. 'యానిమల్' చిత్రం నా జీవితాన్ని మార్చేసింది. ఎంతో మంది అభిమానంతో ఫోన్ చేసి అభినందిస్తున్నారు. వాళ్ల పంపే మెసేజ్‌లు చదువుతుంటే ఆనందంతో నాకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు. కొత్త అవకాశాలు కూడా వెదుక్కుంటూ వస్తున్నాయి. దర్శకుడు సందీప్‌రెడ్డికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు' అని ఆమె ఓ ఆంగ్ల వెబ్ సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. హీరో రణబీర్ అద్భుతమైన నటుడు అని ఈ సందర్భంగా త్రిప్తి చెప్పింది. 'యానిమల్‌లో హీరోయిన్‌గా నటించిన రష్మిక గురించి మాట్లాడుతూ 'సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటే ఆ ఎనర్జీ వేరు. రష్మిక చాలా మంచి వ్యక్తి. తొలి రోజు షూటింగ్‌లో కలసినప్పుడు ఆమె నా దగ్గరకు వచ్చి, హగ్ చేసుకుని అభినందనలు తెలిపింది. సెట్‌లో రష్మిక ఎలా ఉంటుందా అని మొదట నేను భయపడ్డా కానీ ఆమె తన ప్రవర్తనతో నన్ను ఆకట్టుకొంది.

బాలరాజు రాక అప్పుడే



సోహెల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘలేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 2న 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం విడుదలవుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు. ఎడిటర్:విజయ్ వర్ధన్.

ల్యాండ్ మాఫియా వస్తోంది



ప్రణయనాథ హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. మధుబాల కథానాయిక. బాబు వీఎన్ దర్శకుడు. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రణయనాథ మాట్లాడుతూ 'చిన్న సినిమాగా మొదలైన ఈ ప్రాజెక్ట్ పెద్ద చిత్రంగా మారింది. ఓ మంచి చిత్రాన్ని తీశాం. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రణయనాథ సహకారం వల్లే సినిమాను అనుకున్న విధంగా తీయగలిగాం. ఖర్చుకు వెనుకాడకుండా అన్ని హంగులతో నిర్మించాం. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. సందేశంతో పాటు అన్ని రకాల వాణిజ్య హంగులు ఉన్న చిత్రమిదని మధుబాల తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రదీప్ చంద్ర. సినిమాటోగ్రఫీ: వెంకట్ జె. ఎడిటర్: కృష్ణ మండల.



సమం చేస్తారా?

- గెలుపే లక్ష్యంగా టీమిండియా
- పేసర్లదే భారం ● జోష్‌లో దక్షిణాఫ్రికా
- నేటి నుంచి రెండో టెస్టు

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాపై తొలి టెస్టును ఇన్నింగ్స్ తేడాతో.. అదీ మూడు రోజుల్లోనే కోల్పోయిన భారత జట్టు ఇప్పుడు తీవ్ర ఒత్తిడిలో ఉంది. సఫారీ గడ్డపై ఎన్నిసార్లు పర్యటించినా టెస్టు సిరీస్ సాధించలేకపోతున్న వేళ.. బుధవారంనుంచి జరిగే ఆఖరిదైన రెండో టెస్టులోనైనా గెలిచి 1-1తో సమం చేయాలనుకుంటోంది. అదే జరిగితే కొత్త ఏడాదిని టీమిండియా ఓ చక్కని విజయంతో ఆరంభించినట్టవుతుంది. సెంచూరియన్ పిచ్‌పై పేస్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకోవడంలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కనీసం ఆఖరి టెస్టులోనైనా తమ లోపాలను సరిదిద్దుకుని సఫారీ బ్యాటర్లను కట్టడి చేస్తేనే కేప్‌టౌన్‌లో 'తొలి' టెస్టు విజయంపై ఆశలు పెట్టుకోవచ్చు. అలాగే కెప్టెన్ రోహిత్ కూడా బౌలర్లను సరైన రీతిలో వినియోగించుకోవాల్సి ఉంది. మరోవైపు మన బ్యాటర్లు విఫలమైన చోట సౌతాఫ్రికా బ్యాటర్లు మాత్రం అదరగొట్టారు. అలాగే ఆ జట్టు బౌలర్లు భారత్‌ను ఎలా ఇబ్బందిపెట్టారో ఇన్నింగ్స్ ఓటమి ద్వారా తేలిపోయింది. ఇదే ఉత్సాహంతో ఆతిథ్య జట్టు సిరీస్‌పై కన్నేసింది.

జడేజా రాకతో సమతూకం

గాయంతో సెంచూరియన్ టెస్టుకు దూరమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. దీంతో మిడిలార్డర్ కాస్త పటిష్ఠంగా మారనుంది. అలాగే ఈ పిచ్ స్పిన్‌కు కూడా అనుకూలించే అవకాశం ఉండడంతో అతడి బౌలింగ్ కీలకం కానుంది. అయితే పేసర్లు ప్రసిద్ధ్, శార్దూల్ దారుణంగా విఫలం కావడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళన పరుస్తోంది. ప్రసిద్ధ్‌కు అనుభవం కొరవడగా, శార్దూల్‌లో నిలకడ లోపించింది. బుమ్రా ఒక్కడే అంచనాలను అందుకుంటుండగా, సిరాజ్ ఫర్వాలేదనిపిస్తున్నాడు. కొత్త బంతిని స్వింగ్ చేస్తే వికెట్లను రాబట్టవచ్చు. ఈ నేపథ్యంలో ముకేశ్, అవేశ్‌లలో ఒకరికి పిలుపు రావచ్చు. ఏదేమైనా బౌలింగ్‌లో పదును లేకపోతే రెండో టెస్టు గెలవడం కష్టమే. ఇక బ్యాటింగ్ విషయానికి వస్తే.. జైస్వాల్, గిల్, శ్రేయాస్ బౌన్సర్లను ఆడే విషయంలో తేలిపోతున్నారు. కెప్టెన్ రోహిత్ సఫారీ గడ్డపై ఆడిన పది ఇన్నింగ్స్‌లో 128 పరుగులు మాత్రమే చేయగలిగాడు. విరాట్, రాహుల్ మాత్రం ఆతిథ్య బౌలర్లను దీటుగా ఎదుర్కోగలుగుతున్నారు.

సఫారీలు అన్నింటా సూపర్..

భారత్‌కు పూర్తి విరుద్ధంగా ఆతిథ్య జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాటుదేలి ఉంది. కెరీర్‌లో చివరి టెస్టు ఆడనున్న కెప్టెన్ ఎల్గర్‌కుతోడు జోర్జి, మార్‌క్రమ్, పీటర్సన్, బెడింగమ్‌లతో బ్యాటింగ్ లైనప్ మరోసారి భారత బౌలర్లకు సవాల్ విసరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక పేసర్లు రబాడ, జాన్సెన్, బర్గర్ తొలి టెస్టులో అదరగొట్టిన విషయం తెలిసిందే. గాయపడిన బవుమా స్థానంలో హమ్జా ఆడనున్నాడు. దీనికితోడు న్యూలాండ్స్ మైదానంలో భారత జట్టుపై ఓటమి లేకపోవడం వీరికి కలిసి రానుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, విరాట్, శ్రేయాస్, రాహుల్, జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్/ముకేశ్.
దక్షిణాఫ్రికా: ఎల్గర్ (కెప్టెన్), మార్‌క్రమ్, జోర్జి, పీటర్సన్, హమ్జా, బెడింగమ్, వెరీనె, జాన్సెన్, కేశవ్/ఎన్‌గిడి, రబాడ, బర్గర్.

పిచ్

వికెట్‌పై పచ్చిక ఉండడంతో ఆరంభంలో పేసర్లకు అనుకూలించవచ్చు. అయితే మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లు కూడా లాభపడే అవకాశముంది. ఇక వర్షం కురిసే అవకాశాల్లేవు.


దక్షిణాఫ్రికా పేసర్ రబాడ


కెరీర్ ఆఖరి టెస్టు బరిలో ఎల్గర్

క్లీన్‌స్వీప్‌పై ఆసీస్ దృష్టి

ఆఖరి టెస్ట్ ఆడనున్న వార్నర్



సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన కెరీర్‌లో చివరి టెస్టుకు సిద్ధమయ్యాడు. బుధవారం నుంచి పాకిస్థాన్‌తో అతడి సొంత మైదానంలోనే ఆసీస్ మూడో టెస్టు ఆడబోతోంది. ఇప్పటికే రెండు టెస్టులు గెలిచిన కమిన్స్ సేన క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. ఇక ఓదార్పు విజయం కోసం చూస్తున్న పాక్ తమ స్టార్ పేసర్ షహీన్‌షాకు విశ్రాంతినివ్వగా, ఓపెనర్ ఇమామ్‌పై వేటు వేసింది. అతడి స్థానంలో 21 ఏళ్ల సయీమ్ అయూబ్ అరంగేట్రం చేయనున్నాడు.

రాణించిన అవనీశ్

అండర్-19 ముక్కోణపు టోర్నీ

జొహాన్నెస్‌బర్గ్: అండర్-19 ముక్కోణపు సిరీస్‌లో భారత కుర్రాళ్లు దూసుకెళ్తున్నారు. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబరిచిన భారత్ ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. తెలంగాణ బ్యాటర్ అవనీశ్ (60 నాటౌట్)తో పాటు ఓపెనర్లు అర్శిన్ (91), ఆదర్శ్ (66) విజయంలో కీలక పాత్ర పోషించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరాధ్య శుక్లాకు 4, సౌమీకి 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో భారత్ 40.5 ఓవర్లలో 3 వికెట్లకు 244 పరుగులు చేసి గెలిచింది.

జాగ్రెబ్ ఓపెన్‌కు భారత రెజ్లర్లు వీరే!

న్యూఢిల్లీ: క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో ఈనెల 10 నుంచి జరిగే రెజ్లింగ్ పోటీల్లో 13 మంది భారత రెజ్లర్లు బరిలోకి దిగనున్నారని జాతీయ రెజ్లింగ్ సమాఖ్య అడ్‌హాక్ కమిటీ వెల్లడించింది. 12 మంది సహాయ సిబ్బంది క్రొయేషియా వెళ్లనున్నారని, వీరికి వీసా సమస్య ఎదురవగా క్రీడాశాఖ చొరవ తీసుకొని పరిష్కరించిందని అడ్‌హాక్ కమిటీ తెలిపింది.
ఫ్రీస్టయిల్: అమన్ (57 కిలోలు), యశ్ (74 కి.), దీపక్ పూనియా (86 కి.), విక్కీ(97 కి.), సుమిత్ (125 కి.), **గ్రీకో రోమన్:** జ్ఞానేందర్(60కి.),నీరజ్(67 కి.), వికాస్ (77 కి.), సునీల్ (87 కి.), నరేందర్(97 కి.), నవీన్ (130 కి.), **మహిళల కేటగిరీలో** సోనమ్ (62 కి.), రాధిక (68 కి.).



టాప్-3 లోకి దబాంగ్ ఢిల్లీ

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-10లో వరుస విజయాలతో ఊపు మీదున్న గుజరాత్ జెయింట్స్‌కు దబాంగ్ ఢిల్లీ షాకిచ్చింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 35-28తో గుజరాత్‌పై నెగ్గింది. ఈ విజయంతో ఢిల్లీ.. జైపూర్‌ను వెనక్కి నెట్టి పాయింట్ల పట్టికలో టాప్-3లోకి ప్రవేశించింది. ఢిల్లీ రైడర్లు అషు మాలిక్ (11 పాయింట్లు), మంజీత్ (9 పాయింట్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్ స్టార్ రైడర్ ప్రతీక్ దహియా (9 పాయింట్లు) గెలిపించడానికి శతవిధాలా ప్రయత్నించినా, చివరికి నిరాశే ఎదురైంది.

రెండు మ్యాచ్‌లూ టై

అల్టిమేట్ ఖో-ఖో

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో మంగళవారం జరిగిన రెండు మ్యాచ్‌లూ టైగా ముగియడం విశేషం. తొలి మ్యాచ్‌లో తలపడిన చెన్నై క్విక్ గన్స్-ఒడిశా జగర్‌నాట్స్ ఈ సీజన్‌లో తలపడడం రెండోసారి కాగా, వారిమధ్య రెండో మ్యాచ్ కూడా ఫలితం తేలకుండానే 30-30 స్కోరుతో టైగా ముగిసింది. ఒడిశా దూకుడుగా ఆడి, చెన్నై స్టార్ ప్లేయర్లకు ముకుతాడు వేసింది. ఈ మ్యాచ్‌లో చెన్నై అటాకర్స్ స్థాయికి తగ్గట్టు ఆడలేకపోవడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీశాయి. ఇక, ముంబై ఖిలాడీస్-గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ కూడా 26-26 స్కోరుతో టైగా ముగిసింది.




లిచ్‌ఫీల్డ్ (119)

హర్మన్ సేన ఫ్లాప్ షో

- మూడో వన్డేలో భారత్ చిత్తు
- లిచ్‌ఫీల్డ్ శతకం ● 3-0తో ఆసీస్ క్లీన్ స్వీప్

ముంబై: ఆల్‌రౌండ్ వైఫల్యంతో భారత మహిళల జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (125 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 119) సెంచరీతో.. మంగళవారం ఏకపక్షంగా జరిగిన మూడో, ఆఖరి వన్డేలో ఆసీస్ 190 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 338 పరుగుల స్కోరు చేసింది. వన్డేల్లో భారత్‌పై కంగారూలకు ఇదే అత్యధిక స్కోరు. కెప్టెన్ అలిస్సా హీలీ (82) రాణించింది. శ్రేయాంక పాటిల్ మూడు వికెట్లు, అమన్‌జోత్ రెండు వికెట్లు పడగొట్టారు. స్పిన్నర్ మన్నత్ కశ్యప్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసింది. ఛేదనలో భారత్ 32.4 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలింది. దీప్తి శర్మ (25 నాటౌట్), స్మృతీ మంధాన (29), జెమీమా (25) టాప్ స్కోరర్లు. యాస్తిక (6), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (3)తోపాటు రిచా (19) విఫలం కావడంతో టీమిండియా మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకొంది. వేర్హమ్ మూడు వికెట్లు పడగొట్టగా.. సదర్లాండ్, మేగన్ స్కట్, అలనా కింగ్‌లు తలో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. లిచ్‌ఫీల్డ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచింది.

3 పరుగుల పరంగా భారత్‌కు ఇది మూడో అతిపెద్ద ఓటమి.

4 వన్డేల్లో 100 వికెట్లు తీసిన నాలుగో భారత బౌలర్‌గా దీప్తి శర్మ. జులన్ గోస్వామి (255), నీతూ డేవిడ్ (141), నౌషీన్ (100) ముందుగా ఈ ఘనతను అందుకొన్నారు.

9 టీమిండియాపై ఆసీస్‌కు ఇది వరుసగా 9వ సిరీస్ విజయం.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: లిచ్‌ఫీల్డ్ (సి) హర్మన్ (బి) దీప్తి 119, హీలీ (బి) వస్త్రాకర్ 82, పెర్రీ (ఎల్బీ) అమన్‌జోత్ 16, మూనీ (ఎల్బీ) పాటిల్ 3, మెక్‌గ్రాత్ (ఎల్బీ) పాటిల్ 0, గార్డ్‌నర్ (బి) పాటిల్ 30, సదర్లాండ్ (సి) హర్మన్ (బి) అమన్‌జోత్ 23, వేర్హమ్ (నాటౌట్) 11, అలనా కింగ్ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 50 ఓవర్లలో 338/7; వికెట్ల పతనం:** 1-189, 2-209, 3-216, 4-216, 5-256, 6-295, 7-299; **బౌలింగ్:** రేణుక 7-0-52-0, వస్త్రాకర్ 10-0-68-1, పాటిల్ 10-0-57-3, కశ్యప్ 3-0-30-0, దీప్తి 10-0-53-1, అమన్‌జోత్ 10-0-70-2.

భారత్: యాస్తిక (బి) స్కట్ 6, మంధాన (సి) గార్త్ (బి) స్కట్ 29, రిచా (బి) వేర్హమ్ 19, హర్మన్‌ప్రీత్ (సి) మూనీ (బి) వేర్హమ్ 3, జెమీమా (సి) కింగ్ (బి) గార్డ్‌నర్ 25, దీప్తి (నాటౌట్) 25, అమన్‌జోత్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) కింగ్ 3, పూజా వస్త్రాకర్ (బి) కింగ్ 14, పాటిల్ (సి) మెక్‌గ్రాత్ (బి) సదర్లాండ్ 2, రేణుక (సి) హీలీ (బి) సదర్లాండ్ 0, మన్నత్ (సి) మూనీ (బి) వేర్హమ్ 8; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 32.4 ఓవర్లలో 148 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-32, 2-43, 3-57, 4-72, 5-98, 6-102, 7-128, 8-135, 9-135; **బౌలింగ్:** మేగన్ స్కట్ 6-1-23-2, కిమ్ గార్త్ 5-0-33-0, వేర్హమ్ 6.4-0-23-3, గార్డ్‌నర్ 7-0-38-1, అలనా కింగ్ 5-0-21-2, సదర్లాండ్ 3-0-9-2.

బిజినెస్

బ్యాంకుల డివిడెండ్‌పై కొత్త మార్గదర్శకాలు

ఆదేశాలు జారీ చేసిన ఆర్‌బీఐ



ముంబై: డివిడెండ్‌ల చెల్లింపులపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)..బ్యాంకులకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 6 శాతం కంటే తక్కువ ఉన్న బ్యాంకులకు మాత్రమే డివిడెండ్ చెల్లించే అర్హత ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దీనికి తోడు ఆ వాణిజ్య బ్యాంకుల క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి (సీఏఆర్) 11.5 శాతం ఉండాలని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2005లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం నికర ఎన్‌పీఏలు ఏడు శాతం లోపు ఉన్న బ్యాంకులకు మాత్రమే వాటాదారులకు డివిడెండ్ ప్రకటించే అధికారం ఉంటుంది.

బాసెల్ 3 నిబంధనల నేపథ్యంలో: బాసెల్ 3 నిబంధనల అమలు, సత్వర దిద్దుబాటు చర్యల సమీక్ష అనంతరం ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. డివిడెండ్ చెల్లింపునకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకుల సీఏఆర్ మాత్రం 15 శాతం ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. లోకల్ ఏరియా బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల సీఏఆర్ మాత్రం 9 శాతం ఉన్నా డివిడెండ్ చెల్లించ వచ్చని తెలిపింది. చెల్లించే డివిడెండ్‌పై ఉన్న పరిమితినీ పెంచింది. జీరో నికర ఎన్‌పీఏలు ఉన్న బ్యాంకులు తమ నికర లాభంలో 50 శాతం వరకు డివిడెండ్‌గా చెల్లించవచ్చని పేర్కొంది. ఇంతకు ముందు ఈ పరిమితి 40 శాతంగా ఉండేది.

సమయ పాలనలో హైదరాబాద్ విమానాశ్రయం బెస్ట్

అంతర్జాతీయంగా రెండో స్థానం

మూడో స్థానంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్



న్యూఢిల్లీ: నిర్వహణాపరమైన పనితీరు, సమయపాలనలో మన దేశానికి చెందిన హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా విమానాశ్రయాలు తమ సత్తా చాటాయి. ఈ విషయంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయంగా పెద్ద ఎయిర్‌పోర్టుల విభాగంలో రెండో స్థానంలో నిలవగా బెంగళూరు విమానాశ్రయం మూడో స్థానంలో, కోల్‌కతా ఎయిర్‌పోర్టు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. 'ఆన్- టైమ్ పెర్ఫార్మెన్స్ (ఓటీపీ) రివ్యూ' పేరుతో సిరియం అనే ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక ఈ విషయం తెలిపింది. నిర్వహణపరమైన పనితీరు, సమయ పాలనపరంగా అమెరికా, మిన్నెపొలిస్‌లోని సెయింట్ పాల్ అంతర్జాతీయ విమానాశ్రయం 84.44 శాతం ఓటీపీతో అగ్రస్థానంలో నిలవగా, హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) 84.42 శాతం ఓటీపీతో రెండో స్థానంలో, బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం 84.08 శాతం ఓటీపీతో మూడో స్థానంలో నిలిచాయి. మీడియం విమానాశ్రయాల విభాగంలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 83.91 శాతం ఓటీపీతో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

ఎనిమిదో స్థానంలో ఇండిగో ఎయిర్‌లైన్స్

బడ్జెట్ ఎయిర్‌లైన్స్ విభాగంలో దక్షిణాఫ్రికాకు చెందిన సఫైర్ 92.36 శాతం ఓటీపీతో అగ్రస్థానంలో నిలిచింది. మన దేశానికి చెందిన ఇండిగో ఎయిర్‌లైన్స్ 82.12 శాతం ఓటీపీతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతం పరంగా చూస్తే లో బడ్జెట్ ఎయిర్‌లైన్స్ విభాగంలో జపాన్‌కు చెందిన ఆల్ నిప్పాన్ ఎయిర్‌వేస్ (82.75 శాతం ఓటీపీ), జపాన్ ఎయిర్‌లైన్స్ (82.58 శాతం ఓటీపీ), థాయ్ ఎయిర్ ఏషియా (82.52 శాతం ఓటీపీ) తొలి మూడు స్థానాల్లో ఉండగా మన దేశానికి చెందిన ఇండిగో నాలుగో స్థానంలో ఉంది.

ఆల్టర్నేటివ్ ఫండ్స్ కోసం కేఫిన్‌టెక్ కొత్త ప్లాట్‌ఫామ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) కోసం కేఫిన్‌టెక్ కొత్త అడ్మినిస్ట్రేషన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫండ్ నిర్వహణలో ఉన్న భద్రత, అనుకూలతల కారణంగా ఏఐఎఫ్ విభాగంలోని ఫండ్లలోకి మరిన్ని పెట్టుబడులు రావడానికి ఈ ప్లాట్‌ఫామ్ దోహదం చేయగలదని కేఫిన్‌టెక్ వెల్లడించింది. సమగ్ర ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ప్లాట్‌ఫామ్ అయిన 'ఎక్స్‌ఏఎల్‌టీ' ఫండ్ మేనేజర్లు, ఇన్వెస్టర్లకు ఏఐఎఫ్‌లలోని క్లిష్టమైన అంశాలను అర్థం చేసుకోవడానికి దోహదం పడుతుందని పేర్కొంది.

క్రూడాయిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంపు

న్యూఢిల్లీ: దేశంలో ఉత్పత్తి అయ్యే ముడి చమురుపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం మరింత పెంచింది. ఇప్పటి వరకు టన్నుకు రూ.1,300గా ఉన్న ఈ ట్యాక్స్‌ను రూ.2,300కు పెంచింది. డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై ఉన్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేసింది. పెట్రోల్ ఎగుమతులపై ఉన్న నిల్ డ్యూటీని యథాతథంగా ఉంచింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆయిల్ కంపెనీల అసాధారణ లాభాలపై ఇతర దేశాల్లా మన దేశం కూడా విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది. ఈ పెంపు, సవరణలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

సెజ్‌లకు ఊరట

న్యూఢిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని పరిశ్రమలకు ప్రభుత్వం మరో ఊరట కల్పించింది. ఈ సంస్థలు ఉపయోగించిన లాప్‌ట్యాప్‌లు, డెస్క్‌టాప్‌లు, ప్రింటర్లు, మానిటర్లను లైసెన్సు లేకుండానే దేశీయ టారిఫ్‌లు ఉండే ప్రాంతాలకు బదిలీ చేసేందుకు విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ అనుమతించింది. అయితే సెజ్‌ల్లోని కంపెనీలు ఈ వస్తువులను కనీసం రెండేళ్ల పాటు ఉపయోగించి ఉండడంతో పాటు తయారీ తేదీ నుంచి అవి ఐదేళ్లకు మించి పాతవిగా ఉండకూడదని స్పష్టం చేసింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 379 పాయింట్లు డౌన్

ముంబై: ఐటీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. సెన్సెక్స్ 379.46 పాయింట్లు కోల్పోయి 71,892.48 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 658 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ ఫార్మా, ఎనర్జీ రంగ షేర్లలో కొనుగోళ్లు సూచీల నష్టాలను తగ్గించాయి. నిఫ్టీ విషయానికొస్తే, 76.10 పాయింట్ల నష్టంతో 21,665.80 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. రంగాలవారీ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్, ఆటో, బ్యాంకెక్స్, రియల్టీ, ఐటీ, 1శాతానికి పైగా క్షీణించాయి.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు కోల్పోయి 83.32 వద్ద ముగిసింది.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 2శాతానికి పైగా పెరిగి 78.58 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఐపీఓ కోసం రేస్ పవర్ ఇన్‌ఫ్రా దరఖాస్తు

పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోసం సోలార్ ఈపీసీ కంపెనీ రేస్ పవర్ ఇన్‌ఫ్రా, ఇంటిగ్రేటెడ్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీ ఎస్కోనెట్ టెక్నాలజీస్ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించాయి. ఐపీఓలో భాగంగా రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లకు చెందిన 29.95 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్టు రేస్ పవర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. కాగా, పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా 33.60 లక్షల తాజా షేర్లను అమ్మకానికి పెట్టనున్నట్టు ఎస్కోనెట్ టెక్నాలజీస్ పేర్కొంది. ఎస్కోనెట్ ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ కావాలనుకుంటోంది. ఇకపోతే, ఈ ఏడాదిలో ఐపీఓకు రావాలనుకుంటున్నట్టు డివైన్ పవర్ ఎనర్జీ ప్రకటించింది.

రూ.64,000 దాటిన గోల్డ్

ఈ ఏడాదిలో రూ.70,000కు చేరే అవకాశం: జీజేసీ

విలువైన లోహాల ధరలు మరింత ఎగబాకాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర మంగళవారం రూ.280 పెరిగి రూ.64,200కు చేరుకుంది. కిలో వెండి రేటు రూ.300 పెరుగుదలతో రూ.78,800గా నమోదైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లను గణనీయంగా తగ్గించవచ్చన్న అంచనాల నేపథ్యంలో బులియన్‌కు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,075 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 24 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాదిలో ఔన్స్ గోల్డ్ 2,300 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని.. దేశీయంగా తులం పసిడి రూ.70,000కు పెరగవచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేసింది.

రూ.152 కోట్ల విలువైన వీఎస్‌టీ షేర్లను విక్రయించిన మ్యూచువల్ ఫండ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఓపెన్ మార్కెట్లో వీఎస్‌టీ ఇండస్ట్రీస్‌కు చెందిన 2.9 శాతం వాటాకు సమానమైన 4.5 లక్షల షేర్లను హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ విక్రయించాయి. రూ.152 కోట్లకు ఈ వాటాను విక్రయించాయి. ఒక్కో షేర్‌ను రూ.3,390 -3,390.13 శ్రేణి ధరలో విక్రయించారు. కాగా ఎస్‌బీఐ ఎంఎఫ్ 2.25 లక్షల షేర్లను కొనుగోలు చేయగా.. అవెన్యూ సూపర్ మార్ట్స్ (డీమార్ట్) ప్రమోటర్ రాధాకిషన్ దమానీ 2.22 లక్షల షేర్ల వరకూ సొంతం చేసుకున్నారు.

రూ.6 కోట్ల జీఎస్‌టీ ఎగవేత

ఏఎస్ మెట్ సంస్థపై పన్ను అధికారుల కేసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రూ.5.89 కోట్లను ఎగవేసిన ఏఎస్ మెట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌పై రాష్ట్ర పన్నుల అధికారులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు కంపెనీ సీఈఓ, డైరెక్టర్ పీయూష్ మెహతాపై అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసినట్లు రాష్ట్ర పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి తెలిపారు. పెద్ద మొత్తంలో జీఎస్‌టీని ఎగవేసినట్లు అందిన సమాచారం మేరకు గత ఏడాది డిసెంబరు 24, 26 తేదీల్లో సికింద్రాబాద్, తిరుమలగిరి ప్రాంతాల్లోని కంపెనీ డైరెక్టర్ల ఇళ్లలో తనిఖీలు చేసినట్టినట్లు వివరించారు. 2018 నుంచి 2022 అక్టోబర్ మధ్య ఎంఎస్ పైప్స్, టీఎంటీ బార్స్ టీఎంటీ రీబార్స్ సీఆర్ఎఫ్‌హెచ్ స్టీల్ కాయిల్స్, ఐరన్, స్టీల్ ఎంఎస్ రౌండ్స్ వంటిని సరఫరా చేసినట్లు తప్పుడు పన్ను ఇన్వాయిస్, వాహనాలకు వే బిల్లులను జారీ చేశారని వివరించారు. ఎగవేత పన్ను రూ.5 కోట్లకు మించినందున.. జీఎస్‌టీ చట్టం కింద నాన్-బెయిలబుల్ కేసును నమోదు చేశామన్నారు. పీయూష్ మెహతాపై అరెస్ట్ వారెంట్‌ను జారీ చేశామని, ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారని తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బల్క్ డిపాజిట్ స్కీమ్

వార్షిక వడ్డీ 7.5 శాతం వరకు...

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 175 రోజుల కాలపరిమితి గల కొత్త బల్క్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. జనవరి 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిన ఈ స్కీమ్ కింద రూ.2 కోట్ల నుంచి రూ.50 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.50% వార్షిక వడ్డీ అందిస్తుంది. గతంలో 174 రోజుల కాలపరిమితి గల ఇదే డిపాజిట్‌పై 6% వడ్డీ ఇచ్చే వారు. ఈ స్కీమ్ రుపీ టర్మ్ డిపాజిట్లకు మాత్రమే పరిమితం. అలాగే పరిమిత కాలం వరకు మాత్రమే ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.

డీసీబీ హ్యాపీ సేవింగ్స్ అకౌంట్: ప్రైవేట్ రంగంలోని డీసీబీ హ్యాపీ సేవింగ్స్ అకౌంట్‌ను ప్రారంభించింది. అకౌంట్ హోల్డర్లు దేశంలో చేసే అర్హత గల యూపీఐ డెబిట్ లావాదేవీలపై క్యాష్‌బాక్ పొందుతారు. ఈ రివార్డు రూ.7,500 వరకు కూడా ఉండవచ్చు. కనీస లావాదేవీ మొత్తం రూ.500. అయితే ఈ ఖాతా తెరిచే వారు ఖాతాలో కనీస నగదు నిల్వ రూ.25,000 ఉంచాలి.

ప్రొస్టేట్ క్యాన్సర్‌కు బీడీఆర్ ఫార్మా ఓరల్ సొల్యూషన్

న్యూఢిల్లీ: ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్స కోసం నోటి ద్వారా ఉపయోగించే ఎంజాలుటామైడ్ సొల్యూషన్ మార్కెట్లోకి విడుదల చేసినట్లు బీడీఆర్ ఫార్మా వెల్లడించింది. ఈ తరహా కొత్త ఔషధం విడుదల చేసిన తొలి కంపెనీ తమదేనని బీడీఆర్ తెలిపింది. బిడెంజా 32 ఎంజీ/ఎంఎల్ పేరిట విడుదల చేసిన ఈ ఓరల్ సొల్యూషన్ 150 ఎంఎల్ ధర రూ.27,000 అని బీడీఆర్ ఫార్మా తెలిపింది. డీసీజీఐ అనుమతి లభించిన ఈ సొల్యూషన్ ప్రస్తుతం నోటి ద్వారా వాడుతున్న ఎంజాలుటామైడ్ ఔషధాల కన్నా తక్కువ సైడ్ ఎఫెక్ట్స్‌తో ఇది సమర్థవంతంగా పని చేస్తుందని కంపెనీ పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	64,090 ▲	58,750 ▲	80,300 ▲
ముంబై	63,602 ▲	58,259 ▲	74,133 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ		విజయవాడ	585
హైదరాబాద్	582	విశాఖపట్నం	625
3 జనవరి		వరంగల్	584
చిత్తూరు	608	దజను గుడ్లు రూ.72	
గోదావరి	585		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	గోదావరి	
వరంగల్	102	104	
కరీంనగర్	102	విజయవాడ	104
మహబూబ్‌నగర్	102	గుంటూరు	100
కర్నూలు	102	ఒంగోలు	100
విశాఖపట్నం	99	చిత్తూరు	105

మాట తప్పడం కాంగ్రెస్ నైజం

- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- బీఆర్ఎస్ లోటుపాట్లపై సమీక్షిస్తాం: హరీశ్‌రావు



దుబ్బాక, జనవరి 2: గెలిచిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, గత ఏడాది డిసెంబరు 9 తేదీన కాంగ్రెస్ ప్రకటించిందని, చివరికి మాటతప్పిందనీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల లోపు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలు ప్రశ్నించాలనే బలమైన ప్రతిపక్షంగా తమకు బాధ్యత ఇచ్చారని, తప్పకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించి తీరుతామన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరైన ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకు రైతులకు రైతుబంధు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. గ్రామ స్థాయిలో కూడా బీఆర్ఎస్ పార్టీ లోటుపాట్లపై సమీక్షిస్తామని ఆయన చెప్పారు.

అయోధ్యపై సుప్రీం తీర్పు క్విడ్ ప్రో కో: నారాయణ

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఏకగ్రీవమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సోమవారం చేసిన వ్యాఖ్యలను సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. అయోధ్య తీర్పు విషయంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రకటనతో తాము విభేదిస్తున్నామన్నారు. "తీర్పు ఇచ్చిన వారిలో ఇప్పుడు ఒకాయన రాజ్యసభలో ఉన్నారు. ఇంకొకాయన ఏపీ గవర్నర్‌గా ఉన్నారు. ఇది క్విడ్ ప్రో కో కింద లెక్క. దీన్ని న్యాయమైన తీర్పుగా ఎలా చెబుతారు" అని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థ న్యాయంగా లేకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. "బాబ్రీ మసీదు కూలగొట్టి రామాలయం కట్టారు. మసీదును కూల్చిన వారెవరో అందరికీ తెలుసు. అయినా దోషులను గుర్తించకుండా తీర్పు ఇచ్చారు" అని నారాయణ ఆరోపించారు.

4న గురుకులాల్లో ఎల్ఎల్‌బీ స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లోని న్యాయ కళాశాలల్లో మొదటి ఏడాది ఇంటిగ్రేటెడ్(5 సంవత్సరాలు)ఎల్.ఎల్.బి కోర్సుకు జనవరి 4న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు బీసీ గురుకుల సెక్రటరీ డాక్టర్ మల్లయ్యబట్టు తెలిపారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకులాల పరిధిలో బాలుర కోసం కందుకూరులో, బాలికల కోసం హనుమకొండలో కొత్తగా న్యాయవిద్య గురుకులాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకులంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి పలు ఐఐటీల్లో ప్రవేశం పొందిన 124 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లతో పాటు ఆర్థిక సాయం అందింది. హైదరాబాద్‌లోని ఎస్సీ గురుకులం ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 2021-22 విద్యాసంవత్సరంలో ఇంటర్ చదివి ఐఐటీల్లో అడ్మిషన్ పొందిన వారికి ల్యాప్‌టాప్‌తో పాటు, రూ.50వేల నగదు ఇచ్చారు. ఎన్ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్ఐటీల్లో సీటు పొందిన వారికి ల్యాప్‌టాప్‌తో పాటు రూ.40వేల నగదును అందించారు. వీరితో పాటు ఎంబీబీఎస్ ప్రవేశాలు పొందిన 160మంది విద్యార్థులకు రూ.50వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించారు. కాగా ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నాగర్‌కర్నూల్ నుంచి గోరటి వెంకన్న?

- లోక్‌సభ బరిలో నిలిచే అవకాశం
- పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అధిష్ఠానం
- గోరటికి పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, అసెంబ్లీ సెగ్మెంట్ల ఇంచార్జీల మద్దతు
- సిటింగ్ ఎంపీ రాములుపై అసమ్మతి



నాగర్‌కర్నూల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్ఎస్.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని భావిస్తోంది. వివిధ స్థానాల్లో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తోంది. దీంట్లో భాగంగా ఇటీవల పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలతో కేసీఆర్ సమావేశమయ్యారని, నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను గోరటి వెంకన్నకు కేటాయించే విషయంలో అభిప్రాయాలు తీసుకున్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల బీఆర్ఎస్ ఇంచార్జీలు అందరూ కూడా గోరటి వెంకన్నకే ఎంపీ టికెట్ కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిసింది. పలువురు మాజీ ఎమ్మెల్యేలు కూడా సానుకూలత వ్యక్తం చేశారు. విశేషమేవిటంటే, ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ ఖాతాలోనే ఉంది. ఆ పార్టీకి చెందిన పోతుగంటి రాములు ఇక్కడి నుంచి ఎంపీగా ఉన్నారు. కానీ, జడ్పీ చైర్‌పర్సన్ ఎంపిక విషయంలో ఆయనకు, జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలకు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. తన కుమారుడికి జడ్పీ చైర్‌పర్సన్ పదవి దక్కే అవకాశం ఉన్నప్పటికీ అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో సహా పలువురు వ్యతిరేకంగా పని చేశారని ఇదివరకే అధిష్ఠానానికి ఎంపీ రాములు ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఎంపీ టికెట్‌ను తిరిగి రాములుకు కేటాయించవద్దని గువ్వల బాలరాజుతోపాటు మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఇరువర్గాల మధ్య వివాదం ముదిరిన నేపథ్యంలో గోరటి వెంకన్న పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను మల్లురవికి కేటాయించే అవకాశాలు అధికంగా ఉన్న దృష్ట్యా, ఆయన సామాజికవర్గానికే చెందిన గోరటి వెంకన్నను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన దరిమిలా, ఎంపీ సీట్లను అధిక సంఖ్యలో గెల్చుకుని కేంద్రంలోనైనా చక్రం తిప్పాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆశిస్తున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో, ఒక్కొక్క నియోజకవర్గంలో గెలుపు గుర్రాలను అన్వేషిస్తున్న క్రమంలో గోరటి వెంకన్న పేరు తెరమీదకు వచ్చినట్లు సమాచారం. స్థానిక అంశాల మీద అవగాహనతో పాటు కవులు, కళాకారులతో ఉన్న పరిచయాలు, ప్రజలతో ఉన్న అనుబంధం వంటివి గోరటి వెంకన్నకు అనుకూలాంశాలుగా బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తోంది. గోరటి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న విషయం తెలిసిందే.

బీఆర్ఎస్, బీజేపీ తోడుదొంగలు

కాళేశ్వరం అవినీతిలో ఇద్దరూ భాగస్వాములే.. కామన్‌సెన్స్ ఉండే కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారా?

- కేసీఆర్ అవినీతిపై పదేళ్లుగా ఏం చేశారు?
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



మేడిగడ్డ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదే

మేడిగడ్డపై విచారణ పూర్తయ్యేదాకా చెల్లింపులు చేయబోమని, ప్రస్తుతం బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలపై పరిశీలన జరుగుతుందని, మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ ఖర్చును నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీయే భరిస్తుందని ఉత్తమ్ స్పష్టం చేశారు.

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అవినీతిలో బీజేపీ, బీఆర్ఎస్ భాగస్వాములని నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంపై ఏం చేయాలో అదే చేస్తామన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో అవినీతి రహిత పాలన సాగిస్తున్నామని ప్రకటించారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నాయని, ఈ పదేళ్ల పాటు కేసీఆర్ అవినీతిపై ఏం చేసిందని ఉత్తమ్ ప్రశ్నించారు. 3,600 రోజులు అధికారంలో ఉండి కాళేశ్వరం అవినీతిపై ఏం చేశారని నిలదీశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ స్పందించారు. మంగళవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ప్రయోగించి అరెస్టులు చేస్తున్నారని, పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కారు అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తున్న కిషన్‌రెడ్డి ఎందుకు విచారణ చేపట్టలేక పోయారని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై వారం రోజుల్లో జ్యుడీషియల్ విచారణకు ఆదేశించనున్నామని ఉత్తమ్ ప్రకటించారు. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌కు నివేదించామని చెప్పారు. మంత్రివర్గంలో కూడా చర్చించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. చిన్న బడ్డీ కొట్టుకు రుణం తీసుకోవాలంటే రకరకాల నిబంధనలు పెడతారని, లక్షల కోట్ల రూపాయలను నీటిపారుదల ప్రాజెక్టుల కోసం బ్యాంకులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) ఏ విధంగా రుణాలు ఇచ్చాయని ఉత్తమ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఈ రుణాలకు అనుమతించిందో కిషన్‌రెడ్డి వివరణ ఇవ్వాలని నిలదీశారు. అసలు కిషన్‌రెడ్డి కామన్‌సెన్స్ ఉండే మాట్లాడుతున్నారా? అని ఉత్తమ్ నిప్పులుకక్కారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగితే రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అసలు బ్యారేజీని పరిశీలించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కూడా దీనిపై ఒక్క మాట మాట్లాడలేదన్నారు. రూ.80 వేల కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1.27 లక్షల కోట్లకు చేరిందని, కాళేశ్వరం ప్రాజెక్టు రీ ఇంజనీరింగ్, రీ డిజైనింగ్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) వంటి సంస్థలు ఏ విధంగా ఆమోదించారని నిలదీశారు. హైదరాబాద్ వచ్చినప్పుడల్లా కాళేశ్వరం ఏటీఎం అంటూ ప్రధాని, హోంమంత్రి, జేపీ నడ్డాలు ఆరోపణలు చేస్తుంటారని, అన్ని సంస్థలు చేతుల్లో ఉన్నా కేసులు పెట్టడానికి కేసీఆర్‌తో ఏ దోస్తీ అడ్డం వచ్చిందని అడిగారు. కవిత లిక్కర్ స్కామ్‌లో ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సరైన ఫార్మాట్‌లో గత ప్రభుత్వం దరఖాస్తు చేయలేదని, దీనివల్ల రాష్ట్ర ప్రజలపై ఎనలేని భారంపడిందని ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా కాళేశ్వరం అవినీతిపై తాము పలు మార్లు పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగితే కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని అడిగారు.

నిబంధనలు మార్చి రుణాలు

పీఎఫ్‌సీ విద్యుత్ రంగానికి సంబంధించిన సంస్థ అయితే బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కలిసి పీఎఫ్‌సీ నిబంధనలు మార్చి... పీఎఫ్‌సీ ద్వారా నీటిపారుదల రంగానికి రూ.1.2 లక్షల కోట్ల అప్పులు విడుదల చేశారని ఉత్తమ్ చెప్పారు. ఆర్ఈసీ పుట్టినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యానికి సంబంధించిన రుణాలు ఇచ్చిందని, రాష్ట్ర నీటి పారుదల శాఖకు రూ.60 వేల కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు ఈ సంస్థ నిబంధనలు మార్చేశారని ఉత్తమ్ వెల్లడించారు.

మసీదును కోల్పోయాం.. మీ గుండెల్లో బాధ లేదా?

- బాబ్రీపై ముస్లిం యువతను ఉద్దేశించి మజ్లిస్ అధ్యక్షుడు ఒవైసీ వ్యాఖ్యలు
- అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠాపన వేళ ఒవైసీ యువతను రెచ్చగొడుతున్నారు
- జిన్నా ఆత్మ ఒవైసీలో ప్రవేశించింది: బీజేపీ



హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'మనం 500 ఏళ్ల పాటు ఎక్కడైతే కూర్చుని ఖురాన్ చదివామో ఆ ప్రదేశం ఇప్పుడు మన చేతుల్లో లేదు. మనం మన మసీదుని కోల్పోయాం. అక్కడేం జరిగిందో మీరు చూస్తున్నారు. మీ గుండెల్లో బాధ లేదా?' అని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముస్లిం యువతను ప్రశ్నించారు. బాబ్రీ మసీదును ఉద్దేశించి ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలోని సునేహ్రీ మసీదు సహా మూడు నాలుగు మసీదుల విషయంలో జరుగుతున్న కుట్రను మీరు గమనించడం లేదా' అని కూడా ఆయన ముస్లిం యువతను ప్రశ్నించారు. యాకుత్‌పురలోని తలాబ్‌కట్ట మదర్సా-ఎ-అరేబియా అన్వర్-ఉల్-ఉలూమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'చాలా ఏళ్ల పాటు చేసిన కఠోర పరిశ్రమ వల్ల మనం ఈ స్థాయిలో ఉన్నాం. కానీ, తాజాగా జరుగుతున్న పరిణామాలను మనం గమనించుకోవాలి. ముస్లిం యువత అప్రమత్తంగా, సంఘటితంగా ఉండాలి. మీ బలం, మద్దతు కొనసాగించండి. మీ మసీదులు జనంతో నిండిపోవాలి. ఈ మసీదులను సైతం రేపు మన నుంచి లాక్కోవచ్చు. నేటి యువతే రేపటి పెద్దలు. ముందుచూపుతో ప్రతి ఒక్కరూ ఎవరికి వారు... వారి కుటుంబానికి, వారి నగరానికి ఏం సాయం చేయగలరో లోతుగా ఆలోచించాలి. ఐకమత్యమే బలమ'ని ఒవైసీ పేర్కొన్నారు. 'మన మసీదులను మన నుంచి లాక్కోనివ్వకుండా చూడాల'ని చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను గమనించాలని సూచించారు. కాగా, అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠాపన మహోత్సవం సమీపిస్తున్న వేళ ఒవైసీ యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ మండిపడింది. భారత్‌లో హిందువులు, ముస్లింలది ఒకే డీఎన్ఏ అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. ఒవైసీని పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నాతో పోల్చారు. 1947లో జిన్నా భారత్‌ను వదిలి వెళ్లిపోయినా ఆయన ఆత్మ మాత్రం ఇక్కడే ఉండిపోయిందని, అది ఒవైసీలాంటి వ్యక్తుల్లోకి ప్రవేశించిందని వ్యాఖ్యానించారు. భారత్‌కు గుర్తింపు శ్రీరాముడు అని, ఈ దేశంలో బాబర్ కొడుకులు ఎవరూ లేరన్నారు. ఏ గజినీ, బాబర్, ఔరంగజేబుల కన్ను రామ మందిరం పడనివ్వబోమని, ఒకవేళ పడితే మహారాణా ప్రతాప్‌లా బదులిస్తామని హిందూ యువత ప్రతిజ్ఞ చేయాలన్నారు. 2020లో హైదరాబాద్‌లో సచివాలయం నిర్మాణం కోసం రెండు మసీదులను కూల్చివేసినప్పుడు ఒవైసీ నోరు మెదపలేదని మరో కేంద్ర మంత్రి అమిత్ మాలవియా విమర్శించారు.

కాళేశ్వరంపై సమగ్ర విచారణ చేపట్టాలి

- తెలంగాణ జల సాధన సమితి, జాగో తెలంగాణ రౌండ్‌టేబుల్‌లో డిమాండ్
- 9 మంది అంతర్జాతీయ నిపుణులతో విచారణ జరిపించాలి: ఆకునూరి మురళి

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ జలసాధన సమితి, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. అవినీతి కారకులను జైలులో పెట్టే దాకా ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ జలసాధన సమితి, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.. కాళేశ్వరం అవినీతికి కారకులైన వారిని జైలుకు పంపించడానికి వీలుగా జాబితాను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని, మూడేళ్లలో 163 టీఎంసీలు మాత్రమే ఈ పథకంలో ఎత్తిపోశారని, రూ.95 వేల కోట్లను వెచ్చించి.. 98 వేల ఎకరాలకు నీళ్లిచ్చారని జాగో తెలంగాణ కన్వీనర్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. ఈ పథకానికి అనుమతినిచ్చిన అధికారులందరినీ జైళ్లకు పంపించాలని డిమాండ్ చేశారు. దేశంలో రూ.4500 కోట్ల పనులను నామినేషన్‌పై ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాళేశ్వరం అవినీతిపై ఒక్క జడ్జి సరిపోరని, ఒక్క వ్యక్తి అయితే ప్రలోభాలకు గురయ్యే అవకాశం ఉందని, ఏడు లేదా 9 మంది అంతర్జాతీయ నిపుణులతో కూడిన కమిషన్ వేసి, విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలు బీజేపీ అనుబంధ సంస్థలని, ఈ సంస్థలతో విచారణ కోరితే న్యాయం జరగదన్నారు. తెలంగాణలో ధాన్యం దిగుబడికి 8 ఏళ్లుగా కురుస్తున్న వర్షాలే కారణమని, 9 ఏళ్లకిందట రాష్ట్రంలో 15 లక్షల బోర్లు ఉంటే.. ప్రస్తుతం 30 లక్షలకు చేరాయని, ఆ బోర్ల వల్లే ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. కాళేశ్వరం కింద ఎకరా సాగు చేయడానికి రూ.52 వేలు అవసరమవుతాయనరు. కాళేశ్వరంపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 75% అవాస్తవాలున్నాయని రైతుసంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో కారకుల ఆస్తులు జప్తు చేసే దాకా ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం అవినీతి వెలుగులోకి రాకుండా అన్ని మాధ్యమాల ద్వారా అడ్డుకున్నప్పటికీ ప్రకృతి మాత్రమే ఈ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చిందని జాగో తెలంగాణ చైర్మన్, జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రజలను దోచుకుంటే దొంగతనం ఏ రోజైనా బయటపడుతుందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యేదని, దీన్ని రీ ఇంజనీరింగ్ పేరుతో రూ.లక్ష కోట్లకు చేర్చారని, అధికారులు వాస్తవాలు ఒప్పుకొని అప్రూవర్‌లుగా మారుతారా? లేక నేరస్థులుగా మారుతారో తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం అవినీతిలో వ్యాప్కోస్ పాత్ర కూడా ఉందని ఆయన ఆరోపించారు.

అవినీతిపై తాత్సారం వద్దు: రంగారెడ్డి, సీఎం మాజీ ఓఎస్డీ

కాళేశ్వరం అవినీతిపై తాత్సారం చేయవద్దని, నెలరోజుల్లో దీనికి గల కారణాలు వెలికితీయాలని నీటిపారుదల శాఖ పూర్వ ఇంజనీర్, సీఎం మాజీ ఓఎస్డీ రంగారెడ్డి డిమాండ్ చే శారు. తెలంగాణ ఇంజనీర్లంతా కలిసి తుమ్మిడిహెట్టిని బ్యారేజీని డిజైన్ చేశారని, ఇంజనీర్ల నిర్ణయం కారణంగా ఈ ప్రాజెక్టు మేడిగడ్డకు మారలేదని, రాజకీయ నిర్ణయంలో భాగంగానే మారిందని మండిపడ్డారు. ఏ బ్యారేజీ కట్టాలన్నా ఏడాది, ఏడాదిన్నరపాటు సర్వేలు, భూసారపరీక్షలు జరగాల్సి ఉంటుందని, నమూనా అధ్యయనాలు కూడా జరగాల్సి ఉంటుందని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో ఇవన్నీ ప్రక్రియలు జరుగలేదన్నారు. మేడిగడ్డలో గేట్ల నిర్వహణలో లోపాలున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఏ బ్యారేజీ సామర్థ్యం కూడా 3 టీఎంసీలకు మించి ఉండదని, కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు కట్టి.. రిజర్వాయర్లుగా వినియోగించారని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం నిర్మాణంతో రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి తెలంగాణకు కేసీఆర్ తీరని ద్రోహం చేశారని న్యూడెమోక్రసీ రాష్ట్రనేత వేములపల్లి వెంకట్రామయ్య మండిపడ్డారు. కాళేశ్వరంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులైన అధికారులందరినీ వెంటనే తప్పించాలని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టి, వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు.

దమ్ముంటే సీబీఐ దర్యాప్తు కోరండి

- 48 గంటల్లో విచారణ మొదలవుతుంది
- రేవంత్.. ఎందుకు లేఖ రాయడం లేదు
- కాళేశ్వరం భవితవ్యమేంటి..?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అతి పెద్ద అవినీతి ప్రాజెక్టు అయిన కాళేశ్వరంపై చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణకు లేఖ రాయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. న్యాయ విచారణ పేరుతో కేసీఆర్‌కు మేలు చేసేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. సీబీఐ విచారణకు జ్యుడీషియల్ విచారణ దోహదపడుతుందని చెప్పారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పూర్తి స్థాయి మెజారిటీ లేదు కాబట్టి బీఆర్ఎస్‌తో అవగాహనలో భాగంగానే జాప్యం చేస్తున్నట్లు అనిపిస్తోందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేసి, ఇప్పుడు ఎందుకు కేంద్రానికి లేఖ రాయడం లేదో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరిన 48 గంటల్లో దర్యాప్తు ప్రారంభమవుతుందని ప్రకటించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు ఏమిటి..? దెబ్బతిన్న పిల్లర్లను మళ్లీ కడతారా..? బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోంది..?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అవినీతి, కేసీఆర్ కుటుంబ పాలనతోనే కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేశారు తప్ప, రాహుల్‌పై విశ్వాసంతోనో, కాంగ్రెస్‌పై ప్రేమతోనో కాదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సిటింగ్ ఎంపీలకు సీటు ఖరారుపై పార్టీలో చర్చ జరగలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు రాష్ట్ర పార్టీతో పెద్దగా సంబంధం ఉండదని చెప్పారు. తెలంగాణలో జనసేనతో పొత్తు ఉండక పోవచ్చని, తాము 17 స్థానాల్లో ఒంటరిగానే పోటీకి సిద్ధమవుతున్నామని వివరించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోటీపై కూడా చర్చ జరగలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నియోజకవర్గాలవారీగా ప్రత్యేక కమిటీలను వేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు ఈ నెల 17న విచారణకు రానుందని తెలిపారు. ఈ లోగా కేంద్రం వర్గీకరణకు అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేస్తుందన్నారు. బీజేఎల్పీ నేత ఎంపిక ఎప్పుడైనా ఖరారు కావొచ్చని కిషన్‌రెడ్డి తెలిపారు.

8-12 ఎంపీ సీట్లు గెలుస్తాం: సంజయ్

కరీంనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. సర్కారు వద్ద ఉద్యోగులకు జీతాలివ్వడానికే డబ్బులు లేవని, ఇక హామీలు అమలు దేవుడెరుగని అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షులు, మండల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ 8 నుంచి 12 ఎంపీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని చెప్పారు. ఎన్నికల హామీలతో పాటు, మంత్రులు కొత్త హామీలు ఇస్తున్నారని, వాటిని ఎలా అమలు చేయాలో తెలియక సీఎం సతమతమవుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ముఖంలో నవ్వు కన్పించడం లేదని ఆయన అన్నారు.

నేతల చేరికలపై బీజేపీ కొత్త కమిటీ

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి వచ్చే నేతలను చేర్చుకునే అంశంపై బీజేపీ కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. ఇతర పార్టీల నుంచి చేరే నేతల ట్రాక్ రికార్డ్‌తో పాటు తమ పార్టీ పట్ల వారి నిబద్ధతను పరీక్షించిన తర్వాతే ఆ నేతలు పార్టీలోకి రావడానికి ఈ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. అవకాశాల కోసం పార్టీలోకి వచ్చే నేతలకు మొదట్లోనే చెక్‌పెట్టేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 6న పార్టీ కేంద్ర కార్యాలయంలో కమిటీ తొలి భేటీ జరగనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. షరతులతో వచ్చే నేతలను నివారించేందుకు, ఎన్నికల అనంతరం పార్టీని వదిలేసి వెళ్లే నేతల సంఖ్యను తగ్గించేందుకే కమిటీ ఏర్పాటుకు పూనుకున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల వ్యూహాలు, అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవంపై చర్చించేందుకు బీజేపీ సీనియర్ నేతలు మంగళవారం భేటీ అయ్యారు. కేంద్ర మంత్రులు భూపేంద్రయాదవ్, అశ్వినీ వైష్ణవ్, అసోం సీఎం హిమంత విశ్వశర్మ, ప్రధాన కార్యదర్శులు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్ సమావేశంలో పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయండి.. లేదంటే ప్రాణాలు పోతాయ్!

ఎమ్మెల్యే దానం మమ్మల్ని బెదిరిస్తున్నారు.. ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు

వీడియో తీస్తున్న ఎమ్మెల్యే అనుచరుడిని చితకబాదిన బాధితులు

బేగంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తమను ఇళ్లు ఖాళీ చేయాలని, లేదంటే ప్రాణాలు పోతాయని రౌడీలతో బెదిరిస్తున్నారంటూ పలువురు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు.. బేగంపేట డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన వంద మందికిపైగా బాధితులు మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చి దానంకు వ్యతిరేకంగా ఫిర్యాదుతో కూడిన దరఖాస్తులు ఇచ్చారు. 50 నుంచి 100 గజాల చొప్పున స్థలాలు కొనుక్కొని ఇళ్లు కట్టుకున్నామని.. జీహెచ్ఎంసీ అధికారులు ఇంటి నంబర్లు కూడా ఇచ్చారని, అయితే రెండేళ్లుగా స్థలం తమది అంటూ దానం అనురుచులు వచ్చి ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 9 ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయించారని, మరో 50 ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ప్రజాభవన్ వద్ద బాధితులు మీడియాతో మాట్లాడుతుండగా దానం అనుచరులు వచ్చి వీడియో తీశారు. గుర్తించిన బాధితులు వీడియో తీస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని చితకబాదారు. అనంతరం పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు.

ఇళ్ల పక్కనే ఖాళీ స్థలం కొని.. ఆపై బెదిరింపులు

బాలనగర్ మండలం బేగంపేట డివిజన్‌లోగల ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలోని సర్వే నెంబరు 194/8/1లో నవాబు వారసుల నుంచి 50 నుంచి 100 గజాల స్థలాలను కొనుకున్నాం. అనంతరం ఇళ్లు నిర్మించుకున్నాం. కరెంటు మీటరు, నల్ల కనెక్షతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు ఇంటి నంబరు కూడా ఇచ్చారు. డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్లు వచ్చాయి. రెండు సంవత్సరాల నుంచి ఈ స్థలం తమది అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన మనుషులతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. సమీపంలోని 184,185,186 సర్వే నంబరులోని ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసిన దానం నాగేందర్ సమీపంలోని మరో సర్వే నంబరులో (194/8/1) ఉన్న ఇళ్లు ఉన్న స్థలం కూడా తనదేనంటూ బెదిరిస్తున్నారు. పలుమార్లు రౌడీ ల ద్వారా మమ్మల్ని ఇంటికి పిలిపించుకొని మాట్లాడారు. ఇచ్చినంత తీసుకుని ఖాళీ చేసి వెళ్లిపొండి.. లేదంటే ప్రాణాలు పోతాయని బెదిరిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా పోలీసుల సహకారంతో తొమ్మిది ఇళ్లను ఖాళీ చేయించారు. గత ప్రభుత్వంలో న్యాయం జరగకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో ఫిర్యాదు చేశాం.

- బాధితులు, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, బేగంపేట డివిజన్



ఎమ్మెల్యే దానంపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ వాసులు

ప్రజావాణికి 1301 దరఖాస్తులు

మంగళవారం ప్రజావాణికి 1301 దరఖాస్తులొచ్చాయి. భూ సమస్యలు, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉద్యోగుల బదిలీలు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు కోరుతూ దరఖాస్తులు అందజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీని ప్రకటించాలని పలువురు కోరారు. ఖాళీగా ఉన్న స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ 1523 పోస్టులను డీఎస్సీతో పాటుగా ప్రకటించాలని పలువురు అంధ బాలికలు దరఖాస్తు సమర్పించారు.

55ఏళ్లు దాటిన వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలి

55 నుంచి 61 సంవత్సరాల గల వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాలి. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 81, 85లను సవరించాలి. ఈ వయసు గల వీఆర్ఏలం రాష్ట్రవ్యాప్తంగా 2500 మందిమి ఉన్నాం. 61 సంవత్సరాల పై బడిన వీఆర్ఏ వారసులకు అవకాశం ఇచ్చిన విధంగానే 55 నుంచి 61 సంవత్సరాల వయస్సు గల వీఆర్ఏ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- తెలంగాణ రాష్ట్ర 55-61 మధ్య వయసుగల వీఆర్ఏలు

శ్మశాన వాటికలను మాల బ్యాగరీలకు అప్పగించాలి

మృతదేహాలను దహనం చేయడం, పూడ్చిపెట్టడం మాల బ్యాగరీలుగా మా వృత్తి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్మశాన వాటికలను అభివృద్ధి చేసి ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు మెయింటనెన్స్‌కు అప్పగించింది. ఫలితంగా తాతల నుంచి కుల వృత్తి చేసుకుంటున్న మాల బ్యాగరీలమంతా రోడ్డున పడ్డాం. శ్మశాన వాటికలను మాకు అప్పగించాలి.

- మాల బ్యాగరీల వృత్తిదారుల సంఘం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు



సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పీఆర్‌టీయూటీఎస్

టీచర్ల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

హైదరాబాద్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పీఆర్‌టీయూటీఎస్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డితో కలిసి సంఘం ప్రతినిధులు సచివాలయంలో సీఎంని కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సంఘం క్యాలెండర్‌ను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే పరిష్కారం చేస్తామని సీఎం హామీ ఇచ్చారని సంఘం ప్రతినిధులు నేడొక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్ రెడ్డి, పూల రవీందర్, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశం రెడ్డి ఉన్నారు.

సింగరేణి అక్రమాలపై న్యాయవిచారణ చేపట్టండి

» ముఖ్యమంత్రితో భేటీలో సీపీఐ నేతల వినతి

హైదరాబాద్/రాజేంద్రనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో జరిగిన అక్రమాలపై న్యాయవిచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ, అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌ను సచివాలయంలో కలిశారు. సుమారు గంట సేపు జరిగిన ఈ భేటీలో సీపీఐ నేతలు అనేక అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ రంగంలో అక్రమాలపై అసెంబ్లీలో న్యాయవిచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేస్తూ సింగరేణి అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే కూనంనేని తెలిపారు. సింగరేణి, జెన్ కో, ట్రాన్స్ కో సంస్థలకు సమర్థులైన అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాగా, కొత్త ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటున్నదనే భావన సర్వత్రా ఏర్పడిందనే విషయాన్ని సీఎంకు చెప్పామన్నారు. శాసనసభ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, సీపీఐ మధ్య అవగాహన కొనసాగుతుందని కూనంనేని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన విద్యుత్ ఇంజనీర్ల సంఘం

తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం రేవంత్‌ను మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యుత్ సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమ వినతుల పట్ల సీఎం సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు పి.రత్నాకర్ రావు, కార్యదర్శి పి.సదానందం తెలిపారు.

కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి రండి..

చేర్యాల : సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లికార్జున స్వామి ఆలయంలో 7న జరగనున్న స్వామివారి కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు సీఎం రేవంత్‌ను కలిసిన కొమురవెల్లి ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్ ఆహ్వానపత్రిక అందజేశారు.

కాళేశ్వరంలా కాకూడదనే..

బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతలలో మార్పు

» తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టు సాగుకు ప్రణాళిక

» వైద్యశాఖలోని ఖాళీలు భర్తీ : మంత్రి దామోదర



నారాయణఖేడ్, జనవరి 2: కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగా కాకుండా ఉండాలనే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలలో మార్పులు చేపట్టాలని ఆలోచిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ పథకాలను రద్దు చేయకుండా తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టు సాగులోకి వచ్చే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభలలో పాల్గొనడానికి మంత్రి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ఏరియా వైద్యశాలలో నిర్వహించిన వైద్య సిబ్బంది సమీక్షలోనూ మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్యం సమాజానికి ప్రధానమైనందున ఆయా రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. వైద్యఆరోగ్య శాఖలోని ఖాళీలను అంచెలంచెలుగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రైవేట్‌కు దీటుగా పర్యాటక హోటళ్లు

» అనుగుణంగా చర్యలు తీసుకోండి:మంత్రి జూపల్లి




హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు పర్యాటక కేంద్రాల వద్ద మౌలిక వసతులను మెరుగుపర్చడంపై దృష్టిని కేంద్రీకరించాలని పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేట హరిత ప్లాజాలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యకలాపాలను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రైవేట్ కు దీటుగా హరిత హోటల్స్ ను తీర్చిదిద్దాలని, ఆక్యుపెన్సీ రేషియో పెంచుకునేలా వినూత్న మార్గాలను అన్వేషించి ఆదాయం పెంపొందించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 13, 14, 15వ తేదీల్లో మూడురోజుల పాటు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

'స్త్రీనిధి' దుర్వినియోగంపై విచారణ: మంత్రి సీతక్క



హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని, రుణాలివ్వడంలో అధికారులు జాగ్రత్త వహించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆ సంస్థ పనితీరుపై, ఇతర అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి నిధులు దుర్వినియోగమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా, ఇతర ప్రాంతాల్లో వస్తున్న ఆరోపణల గురించి ఆమె ప్రస్తావించారు. ఆరోపణలు, ఫిర్యాదులపై శాఖపరంగా విచారించేందుకు ఓ కమిటీ వేయాలని సూచించారు. పిల్లలను దత్తత ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న నిబంధనలను సులభతరం చేయాలని, అనాథ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 2శాతం కోటాను కేటాయించే అంశాలపై కసరత్తు చేయాలని ఆదేశించారు.

గ్రామస్థాయిలో ప్రభుత్వ పాలన:మంత్రి పొంగులేటి



ఖమ్మం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్న ప్రభుత్వ పాలనను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఖమ్మం జిల్లా మంగళగూడెంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో, ఖమ్మంలో మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇకపై గ్రామస్థాయిలోనే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని, మండల, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరంలేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందని, అయినా పేదల సంక్షేమంకోసం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు అందిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్యపాలన రావడానికి మీడియా కీలకంగా పనిచేసిందని, జర్నలిస్టులు కూడా తమవంతు కృషి చేశారని పేర్కొన్నారు.

ప్రైవేటు వర్సిటీలపై నిపుణుల కమిటీ!

» రిజర్వేషన్లు, అడ్మిషన్లపై అధ్యయనం

» ఇతర రాష్ట్రాల్లోని చట్టాల పరిశీలన

» కమిటీ నివేదిక ఆధారంగా వర్సిటీల చట్ట సవరణకు యోచన

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం ప్రైవేటు వర్సిటీలు పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి. వీటిపై ప్రభుత్వ నియంత్రణ ఏ మేరకు ఉందన్న విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆరా తీశారు. ఈ క్రమంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా యూనివర్సిటీల చట్టానికి సవరణ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. విద్యాశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు యూనివర్సిటీలపై ప్రభుత్వ నియంత్రణ ఏ మేరకు ఉందన్న అంశంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ముఖ్యంగా అడ్మిషన్ల ప్రక్రియ, రిజర్వేషన్ అమలు వంటి అంశాలపై ఆయన అడిగిన ప్రశ్నలకు అధికారుల వద్ద తగు సమాచారం లేకపోవడంతో ఈ వర్సిటీల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రస్తుతం అడ్మిషన్లు, ఫీజుల ఖరారు, పరీక్షల నిర్వహణ వంటి అన్ని అంశాల్లో ప్రైవేటు వర్సిటీలు సొంత షెడ్యూల్‌ను అమలు చేస్తున్నాయి. అడ్మిషన్లలో ఎలాంటి రిజర్వేషన్లను అమలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, ఇప్పుడున్న చట్టం ద్వారా ఇది సాధ్యం కాదు. దాంతో చట్ట సవరణ చేయాలని సర్కారు యోచిస్తోంది. ఈ సవరణ ఎలా ఉండాలి? కొత్తగా ఏం చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్ వర్సిటీల చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. తెలంగాణలోని విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చట్టంలో ఎలాంటి మార్పులను తీసుకురావాలనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

ప్రభుత్వ వర్సిటీల్లోనూ దిద్దుబాటు చర్యలు?

ప్రభుత్వ యూనివర్సిటీల విషయంలోనూ కొన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యంగా అన్ని వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని భావిస్తోంది. అందుకోసం సమర్థులైన ప్రొఫెసర్ల పేర్లను పరిశీలిస్తున్నారు. ఇక వివాదాస్పద వీసీల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంపై కూడా దృష్టి పెట్టారు. బాసర ట్రిపుల్ ఐటీపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇక్కడ విద్యార్థులు గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అయినా వారి సమస్యలు పరిష్కారం కాలేదు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఈ వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని కూడా నియమించాలని భావిస్తున్నారు. గతంలో వివాదంగా మారిన భోజన కాంట్రాక్టర్లను తొలగించి, ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు.

అదనపు అప్పు ఇప్పించండి

కేంద్ర గ్రాంట్లు విడుదల చేయించండి.. కేంద్రం, రాష్ట్రానికి మధ్యవర్తిత్వం నెరపండి

» నీతి ఆయోగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం



మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ సీఎం రేవంత్‌ను కలిశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతల స్వీకరణ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లు, అదనపు అప్పు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి గళమెత్తింది. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందని, దీని నుంచి బయట పడాలంటే రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకోక తప్పదని పునరుద్ఘాటించింది. అందుకుగాను 'నీతి ఆయోగ్' మధ్యవర్తిత్వం నెరపాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణకు రావాల్సిన గ్రాంట్లను ఇప్పించాలని, అదనపు అప్పు కోసం కేంద్రాన్ని ఒప్పించాలని కోరింది. 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో నిధులు వచ్చేలా చూడాలని విన్నవించింది. నీతి ఆయోగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తుందని, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొంటుందని, నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని భరోసా ఇచ్చింది. నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్‌కుమార్ బేరి, సభ్యుడు విజయ్‌కుమార్ సారస్వత్, డీఎంఈవో డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్, డైరెక్టర్ అవినాష్ దాస్, మరో ఐఏఎస్ అధికారి ముత్తుకుమార్ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన విధాన రూపకల్పన, సహకారాత్మక వ్యూహాలు, ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పలు అంశాలను నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగా లేదని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులన్నింటినీ వాడేసిందని తెలిపారు. పర్యవసానంగా కొత్తగా ఏర్పాటైన తమ ప్రభుత్వం కొత్త పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించాలన్నా- నిధుల సమస్య తలెత్తుతోందన్నారు. ఈ దృష్ట్యా కేంద్రం నుంచి న్యాయబద్ధంగా, విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు.

కేంద్ర గ్రాంట్లు ఇప్పించండి..

వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంటు కింద నాలుగేళ్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి రూ.1800 కోట్లు రావాల్సి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్‌కు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 94(2) కింద కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమ అమలుకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2019-20 నుంచి ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున నాలుగేళ్ల నిధులు రావాల్సి ఉందని, వీటిని వెంటనే విడుదల చేయించాలని కోరారు. దీంతోపాటు రాష్ట్రానికి 14వ, 15వ ఆర్థిక సంఘాలు సిఫారసు చేసిన నిధులు కూడా రావాల్సి ఉందని, వీటి విడుదలకు కేంద్రంతో మధ్యవర్తిత్వం చేయాలని విన్నవించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న 16వ ఆర్థిక సంఘం ద్వారా కూడా రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో నిధులు వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు బలపడాలంటే 16వ ఆర్థిక సంఘం నిధులు ఊతమివ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి సంబంధించి 13 వేల కోట్ల అదనపు అప్పు తీసుకోవడానికి కేంద్రాన్ని అనుమతి కోరామని, ఈ విషయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో పొందుపరిచిన అప్పుల లక్ష్యం దాదాపు పూర్తయిందని, అదనపు అప్పే శరణ్యమని తెలిపారు. రాష్ట్ర విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధుల కేటాయింపు ఉండాలన్నారు. రాష్ట్రంలో సౌర విద్యుత్తును మరింత వినియోగించుకోవడానికి కేంద్రం సహకారం అందించాలని, సౌర విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్రం ఇచ్చే రాయితీలు, సబ్సిడీలను రాష్ట్రానికి వర్తింపజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌ను కాలుష్య రహిత 'అర్బన్ గ్రోత్ హబ్'గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికను సూచించాలని నీతి ఆయోగ్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు.

సహకారాత్మక సమాఖ్య విధానం అవసరం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనుసరించాల్సిన సహకారాత్మక సమాఖ్య విధానంపై సమావేశంలో చర్చించారు. ప్రభావవంతమైన పాలనకు సహకారాత్మక సమాఖ్య విధానం ఒక మార్గదర్శక సూత్రమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వం కలిసికట్టుగా పని చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలు, కీలక రంగాల అభివృద్ధి, ఇందుకు అనుసరించాల్సిన మార్గాలను సీఎం వివరించగా.. నీతి ఆయోగ్ సభ్యులు సావధానంగా విన్నారు. వినూత్న పాలనా పద్ధతులు, విజయవంతమైన నమూనాలను పరస్పరం అందిపుచ్చుకోవడానికి సహకరించుకోవాలని నిర్ణయించారు. స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడంలో మెరుగైన పద్ధతులను అవలంబించాలని నీతి ఆయోగ్ సూచించింది. కాగా, రాష్ట్రంలోని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేస్తున్న యువతలో నైపుణ్యాన్ని పెంపొందించాలన్న చర్చ కూడా ఈ సందర్భంగా జరిగింది. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర సౌజన్య పథకమైన(సీఎస్‌ఎస్) 'స్టేట్ సపోర్ట్ మిషన్' కింద స్టేట్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను ఏర్పాటు చేయడంపై చర్చించారు.

పీపీపీ పద్ధతిలో మూసీ పరివాహక అభివృద్ధి

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని రాబోయే మూడేళ్లలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తొలుత హైదరాబాద్ నగరం పరిధిలోని 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న చారిత్రక కట్టడాలు చార్మినార్, తారామతి బరాదరీ, ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్ డిజైన్‌ను రూపొందించాలన్నారు. హెచ్‌ఎండీఏ కార్యాలయంలో ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో మూసీ నదీ పరివాహక అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్. ఇలా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ ఉండాలన్నారు.

సీఎం సార్.. బిజీబిజీ

సీఎం రేవంత్ మంగళవారం తీరిక లేకుండా గడిపారు. సమీక్షలు, సమావేశాల్లో పాల్గొనడమే కాకుండా తనను కలిసేందుకు వచ్చిన వారిని కలుస్తూ బిజీబిజీగా ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నానికి సచివాలయానికి చేరుకున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టితో కలిసి తొలుత నీతి ఆయోగ్ బృందంతో భేటీ అయ్యారు. అనంతరం హైదరాబాద్ మెట్రోరైల్ పొడిగింపు సహా తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం తన కోసం సచివాలయానికి వచ్చిన వివిధ వర్గాల నేతలు, ప్రతినిధులతో ముచ్చటించారు. ఆ తర్వాత మూసీ నది అభివృద్ధి అంశంపై నానక్‌రామ్‌గూడలోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మూసీ రివర్ ఫ్రంట్‌కు సహకరించండి..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి సాంకేతిక సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నీతి ఆయోగ్‌ను కోరారు. సబర్మతి రివర్ ఫ్రంట్, నమామీ గంగే వంటి జాతీయ, అంతర్జాతీయ పీపీపీ మోడల్స్‌ను వర్తింపజేయాలన్నారు. మూసీనది కోసం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్‌టీపీ) ఏర్పాటుకు సహకరించాలన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాత్మక సమాఖ్య స్ఫూర్తితో పని చేయాలని నిర్ణయించారు. కాగా, నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశాల్లో భాగం పంచుకోవాలని రాష్ట్రాన్ని నీతి ఆయోగ్ కోరగా.. తప్పకుండా పాల్గొంటామని, నీతి ఆయోగ్‌కు నిర్మాణాత్మక మద్దతు, సహకారాన్ని అందిస్తామని సీఎం రేవంత్ తెలిపారు.

మెట్రో ఫేజ్-2లో మార్పులు

ఇన్నర్ రింగ్ రోడ్డుపై రాజేంద్రనగర్ వరకు మెట్రో.. కొత్తగా ఏర్పాటయ్యే హైకోర్టుకు రవాణా సౌకర్యం

» నాగోలు-చాంద్రాయణగుట్ట మీదుగా ప్లాన్

» ఎంజీబీఎస్- ఎయిర్‌పోర్టుకు మరో మార్గం

» చాంద్రాయణగుట్ట -ఎయిర్‌పోర్టు లింక్‌కు మైలార్‌దేవ్‌పల్లి పీ7 రోడ్డును పరిశీలించాలి

» మరో మూడు పొడిగింపులకూ అనుమతి


» మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు

» రాయదుర్గం - ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు

» ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు

» 76 కిలోమీటర్ల మేర కొత్తగా మెట్రో

» అధికారులతో సమీక్షలో సీఎం నిర్ణయాలు



మొదటి దశలో పూర్తయిన మార్గం (69 కిలోమీటర్లు)

మియాపూర్-ఎల్‌బీనగర్	29 కిలోమీటర్లు
జేబీఎస్-ఎంజీబీఎస్	11 కిలోమీటర్లు
నాగోలు-రాయదుర్గం	29 కిలోమీటర్లు

మెట్రో మొదటి దశ, మార్చిన రెండోదశ ప్రతిపాదనలు

1. మియాపూర్ మెట్రో స్టేషన్-బీహెచ్ఈఎల్-పటాన్‌చెరు — 14 కిలోమీటర్లు
2. ఎంజీబీఎస్-ఫలక్‌నుమా-చాంద్రాయణగుట్ట-మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్-పీ7 రోడ్డు- విమానాశ్రయం — 23 కిలోమీటర్లు
3. నాగోలు-ఎల్బీనగర్-ఒవైసీ ఆసుపత్రి, చాంద్రాయణగుట్ట-మైలార్‌దేవ్‌పల్లి-ఆరాంఘర్-కొత్త హైకోర్టు — 19 కిలోమీటర్లు. కొత్త హైకోర్టు జాతీయ రహదారి 44 మీద రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వస్తుంది.
4. రాయదుర్గ్ మెట్రోస్టేషన్-బయోడైవర్సిటీ జంక్షన్-ఐఐఐటీ జంక్షన్-ఐఎస్‌బీ రోడ్డు- విప్రో చెరువు-అమెరికా కాన్సులేట్. — 12 కిలోమీటర్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర రవాణాలో అత్యంత కీలకమైన మెట్రో ప్రాజెక్టుల విస్తరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టత వచ్చింది. అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రెండో దశకు పలు మార్పులు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఓఆర్‌ఆర్ మీదుగా ఎయిర్‌పోర్టు మెట్రోకు బదులుగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు మెట్రోను ఖరారు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డుపై నాగోలు నుంచి ఎల్బీనగర్ వరకు గత ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రోను ఏకంగా చాంద్రాయణగుట్ట, ఆరాంఘడ్ మీదుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వరకు పొడిగించారు. హైదరాబాద్ తూర్పు ప్రాంత ప్రజలు చాంద్రాయణగుట్ట జంక్షన్ వద్ద రైలుమారి విమానాశ్రయానికి వెళ్లిపోవచ్చు. వీటికి తోడు గత ప్రభుత్వం ప్రతిపాదించిన రాయదుర్గం-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్బీ నగర్- హయత్‌నగర్ పొడిగింపులను చేపట్టడానికి రేవంత్ సర్కారు నిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హెచ్‌ఎండీఏ కమిషనర్ దాన కిశోర్, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి, సీఎంఓ కార్యదర్శి షానవాజ్ ఖాసీం, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఇప్పటికే 69 కిలోమీటర్ల పొడవున మెట్రో ఉండగా, కొత్తగా రెండో దశలో ప్రతిపాదించినవి 76 కిలోమీటర్ల పొడవు ఉన్నాయి. కాగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో దశలో 67.5 కి.మీ ప్రతిపాదించింది.

రాయదుర్గం-శంషాబాద్ కారిడార్‌కు బ్రేక్!

మెట్రో రెండో దశలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాయదుర్గం రహేజా మైండ్‌స్పేస్ జంక్షన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రూ.6,250 కోట్ల అంచనాతో 31 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ మార్గంతో పెద్దగా ప్రయోజనం ఉండదని, ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని రేవంత్ గత నెల 13న జరిగిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి సమీక్ష నిర్వహించారు. రాయదుర్గం-శంషాబాద్ కారిడార్‌ను పూర్తిగా రద్దు చేసి, పాతబస్తీ నుంచే ఎయిర్‌పోర్టు మెట్రోను వేసేందుకు నిర్ణయించారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి

ఇటు ఎంజీబీఎస్ నుంచి అటు ఎల్బీనగర్ నుంచి పాతబస్తీ మీదుగా సవరించిన మార్గాల అలైన్‌మెంట్ కోసం ట్రాఫిక్ అధ్యయనాలు, డీపీఆర్‌లను త్వరగా పూర్తి చేయాలని రేవంత్ హైదరాబాద్ మెట్రో ఎండీని ఆదేశించారు. చాంద్రాయణగుట్ట దగ్గర జంక్షన్ ఖరారు అయినప్పటికీ ఎయిర్‌పోర్టు కోసం మైలార్‌దేవ్‌పల్లి వద్ద వేసిన విశాలమైన పీ7 రోడ్డు మధ్యలో ఏకంగా 40 అడుగుల మీడియన్ ఉందని, దాన్ని ఆధారంగా చేసుకొని లక్ష్మీగూడ-జల్‌పల్లి-మామిడిపల్లి మీదుగా తక్కువ ఖర్చుతో నేల మీదనే వెళ్లే విధంగా మెట్రో వేసే విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. దాంతో దాన్ని కూడా పరిశీలనలో చేర్చారు. అంతేకాకుండా ఈ రవాణా మార్గంలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు ఖర్చు తగ్గడంతో పాటు పాత బస్తీ, దాని పరిసరాలను అభివృద్ధి చేయవచ్చని సూచించారు. కొత్త అలైన్‌మెంట్‌తో నగరంలోని పలు ప్రాంతాలకు తేలిగ్గా ఎయిర్‌పోర్టు ప్రయాణం సాధ్యమవుతుందని, దూరం, ఖర్చు తగ్గుతుందని చెప్పారు.

పాతబస్తీలో ప్రతికూల ప్రభావం పడొద్దు

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఎల్ అండ్ టీ నిర్మించాల్సి ఉన్న 5.5 కిలోమీటర్లను పూర్తి చేసేందుకు తీసుకునే చర్యల్లో అక్కడ ప్రజల్లో ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండాలని రేవంత్ అధికారులకు స్పష్టం చేశారు. దారుల్‌షిఫా నుంచి ఫలక్‌నుమా జంక్షన్ వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. ఎంజీబీఎస్ స్టేషన్ దాటిన తర్వాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, శంషేర్‌గంజ్, జంగంమెట్, ఫలక్‌నుమా స్టేషన్లు రానున్నాయి. ఈ 5.5 కిలోమీటర్ల స్ట్రెచ్‌లో 21 మసీదులు, 12 హిందూ దేవాలయాలు, 12 అషూర్‌ఖానాలు, 33 దర్గాలు, 7 సమాధి యార్డులు, 6 చిల్లాలతో పాటు చిన్నాచితక అంతా కలిసి మొత్తంగా దాదాపు 103 మతపరమైన, సున్నితమైన నిర్మాణాలు అడ్డుగా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగర అవసరాలను తీర్చేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓఆర్‌ఆర్ చుట్టూ ఇప్పటిదాకా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను గ్రోత్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. శ్రీశైలం హైవేపై ఎయిర్‌పోర్టు ప్రాంతం నుంచి కందుకూరు వరకు మెట్రో రైలు కనెక్టివిటీని కూడా ప్లాన్ చేయాలన్నారు. ఇక్కడ ఫార్మాసిటీ కోసం భూములను సేకరించడం జరిగిందని, తద్వారా ఇక్కడ మెట్రో కనెక్టివిటీ అవసరమని చెప్పారు. జేబీఎస్ మెట్రోస్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు, కండ్లకోయ/మేడ్చల్ వరకు మెట్రో రైలు మూడో దశ విస్తరణ జరగాలని ఆయన ఆకాంక్షించారు. వీటికి సంబంధించి ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరికి సమర్పించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, మెట్రో ఎండీలను ఆదేశించారు.

పెట్రోలు, డీజిల్ కొరత లేకుండా చర్యలు: చౌహాన్

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. సమ్మె చేస్తున్న డ్రైవర్ల సమస్యలపై సానుభూతితో చర్చలు జరపాలని సూచించారు, ఆయిల్ కంపెనీలకు, డ్రైవర్లకు తాము పూర్తి సహకారం అందిస్తామని, తక్షణమే విధుల్లో చేరి పెట్రోల్, డీజిల్ రవాణా చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని కమిషనర్ స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు యతేంద్ర పాల్ సింగ్, రవీంద్ర కుమార్, టి. శ్రీనివాస్ రావు, సితేష్ కిషన్, సుదీప్ విఽత్ర, పార్థివ్ ధార్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఐఐటీ గువహటిలో తెలంగాణ విద్యార్థిని మృతి

- నలుగురు స్నేహితులతో కలిసి న్యూ ఇయర్ వేడుకల కోసం హోటల్‌కు... గది వాష్‌రూంలో మృతదేహం

గువహటి, జనవరి 2: ఐఐటీ-గువహటిలో తెలంగాణకు చెందిన యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గువహటిలోని ఓ హోటల్‌లో ఈ ఘటన జరిగింది. మృతురాలిని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతున్న ఐశ్వర్య పుల్లూరిగా గుర్తించారు. నూతన సంవత్సర వేడుకలను జరుపుకొనేందుకు డిసెంబరు 31న ఐశ్వర్య తన బ్యాచ్‌మేట్స్ అయిన ఇద్దరు అబ్బాయిలు, ఓ అమ్మాయితో కలిసి విద్యాసంస్థకు 25 కిలోమీటర్ల దూరంలోని ఓ హోటల్ గదికి వచ్చారు. ఆ సమయంలో నలుగురూ కొంత మద్యం మత్తులో ఉన్నారు. అంతకుముందే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రెండు గదుల్లోకి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వాష్‌రూంలో ఐశ్వర్య అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అదే గదిలో బస చేసిన ఆమె స్నేహితురాలు గుర్తించింది. ఐశ్వర్యను వెంటనే గువహటి మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు, ఆమె స్నేహితురాళ్లను ప్రశ్నిస్తున్నారు.

'తబ్లీగీ'కి నిధులపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తబ్లీగీ జమాత్ అనే సంస్థ సమావేశాల నిర్వహణకు దాదాపు రూ.2.5 కోట్లు ఏ ప్రాతిపదికన విడుదల చేశారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. జనవరి 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో సమావేశాల నిర్వహించుకునేందుకు ఆ సంస్థకు నిధులు విడుదల చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీవో విడుదల చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఎండీ అప్సర్ పాష హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తబ్లిగి సంస్థను సౌదీఅరేబియా, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ సహా ఇతర దేశాలు నిషేధించాయని.. అయితే భారత్‌లో మాత్రం నిషేధం లేదని పేర్కొన్నారు. ఈ సంస్థపై ఆరోపణలు ఉన్నందున ప్రభుత్వం నిధులు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది.

కేడర్ కేటాయింపు అధికారం క్యాట్‌కు లేదు

- ఏపీకి అధికారుల బదిలీపై హైకోర్టు స్పష్టీకరణ

అఖిలభారత అధికారుల (ఐఏఎస్, ఐపీఎస్)ను రాష్ట్రాలకు కేటాయించే అధికారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)కు లేదని, క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై తాము అప్పీలేట్ అథారిటీగా వ్యవహరించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా ఏపీకి కేటాయించినా తెలంగాణలో కొనసాగుతున్న అధికారుల వ్యవహారంపై మంగళవారం జస్టిస్ అభినందన్ కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'సోమేశ్ కుమార్' తీర్పును జవదాటలేమని తెలిపింది. ఈ పరిస్థితుల్లో క్యాట్ ఆదేశాలను కొట్టేసి.. అధికారుల కేటాయింపుపై తాజాగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి ఆదేశాలు జారీచేస్తామని తెలిపింది. అధికారుల తరఫున న్యాయవాదులు సుధీర్, లక్ష్మీనర్సింహా, గోడ శివ తదితరులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌లకు సంబంధించిన కేసుల్లోని వేర్వేరు అంశాలు 'సోమేశ్‌కుమార్' తీర్పులో కవర్ కాలేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

బౌరంపేటలో ప్రభుత్వ భూముల తారుమారుపై పిల్

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు అక్రమంగా పది ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డును ప్రైవేటు పార్టీల పేరిట రికార్డులు తారుమారు చేశారంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని పేర్కొంటూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ కం కమిషనర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రిజిస్ట్రార్, కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్, కలెక్టర్, ఆర్డీవో, దుండిగల్ గండిమైసమ్మ మండల తహసీల్దార్, వజ్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం, బౌరంపేట సర్వే నంబర్ 166 సబ్ డివిజన్ 2, 3, 4, 5, 6, 7లో వజ్ర బిల్డర్స్ పీ రాఘవ రావు వారసులకు భూమి ఉండగా రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కై సబ్ డివిజన్ సర్వే నంబర్లు మార్చడం ద్వారా ఓఆర్ఆర్ పక్కన విలువైన ప్రభుత్వ భూమిని తారుమారు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

సీబీఐ జేడీగా దాట్ల శ్రీనివాస వర్మ



హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తెలుగు ఐపీఎస్ అధికారి దాట్ల శ్రీనివాస వర్మ సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఈయన ఇప్పటి వరకు అక్కడి హోంశాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఆయన్ను సీబీఐ జేడీగా నియమిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు.

ట్రాఫిక్ చలానా చెల్లిస్తున్నారా..?

- నకిలీ వెబ్‌సైట్లతో తస్మాత్ జాగ్రత్త!

హైదరాబాద్ సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెండింగ్ చలాన్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిస్కౌంట్ ఆఫర్‌కు పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. ఒకేసారి పెద్ద సంఖ్యలో యూజర్లు వెబ్‌సైట్‌ను సందర్శిస్తుండడంతో.. తరచూ సర్వర్ డౌన్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను సైబర్ కేటుగాళ్లు అవకాశంగా మలచుకుంటున్నారు. అచ్చంగా ఈచలానాల పోర్టల్ మాదిరిగా నకిలీ వెబ్‌సైట్ల(ఫిషింగ్)ను సృష్టించి, గూగుల్‌లో 'ట్రాఫిక్ పెండింగ్ చలానా' అని సెర్చ్ చేస్తే.. తమ సైట్లకు రీడైరెక్ట్ అయ్యేలా గిమ్మిక్కులు చేస్తున్నారు. వాటిని నమ్ముతున్న యూజర్ల జేబులను గుల్ల చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు.. అప్రమత్తంగా ఉండాలంటూ వాహనదారులను హెచ్చరిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు.

హైదరాబాద్ అల్వాల్‌లోని యాదవనగర్‌లో పెట్రోల్‌బంకు వద్ద బారులుతీరిన వాహనదారులు, ఎంజే మార్కెట్ వద్ద ట్రాఫిక్ జాం





ప్రజలకు పెట్రో నరకం

ట్యాంకర్ డ్రైవర్ల సమ్మెతో వాహనదారుల్లో ఆందోళన.. వాహనాలతో పెట్రోల్‌బంకుల వద్ద భారీగా బారులు

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్/కూకట్‌పల్లి/రెజిమెంటల్‌బజార్/పద్మారావునగర్/హయత్‌నగర్/ఎర్రగడ్డ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తెచ్చిన కొత్త చట్టానికి నిరసనగా ట్రక్కు డ్రైవర్లు సమ్మె చేస్తున్నారన్న వార్తలతో.. మంగళవారం ఉదయం వరకూ ప్రశాంతంగా ఉన్న రాజధాని నగరం మధ్యాహ్నానికి ట్రాఫిక్‌జామ్‌తో స్తంభించిపోయింది! వేలాది మంది తమ వాహనాలతో పెట్రోల్ బంకుల వద్దకు క్యూకట్టి.. ట్యాంకులు ఫుల్ చేయించుకునే ప్రయత్నాలు చేయడంతో.. ఆ క్యూలు బంకుల బయట కిలోమీటరు దూరానికి పైగా వ్యాపించి జంక్షన్లు జామైపోయాయి! నగరానికి ఆ మూలన ఉన్న ఆటోనగర్ నుంచి.. వనస్థలిపురం, చింతలకుంట, బీఎన్‌రెడ్డినగర్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, అబిడ్స్, నాంపల్లి, లక్డీకాపూల్, సోమాజీగూడ, ఖైరతాబాద్, పంజగుట్ట, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, జేఎన్‌టీయూ-హైటెక్‌సిటీ రోడ్డు, మాధాపూర్, కొండాపూర్, యూసఫ్‌గూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, పద్మారావునగర్, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, సీతాఫల్‌మండి.. ఆ పేట, ఈ బస్తీ అనే తేడా లేదు! ప్రతి రోడ్డు.. ప్రతి చౌరస్తా.. వాహనాలతో కిటకిటలాడిపోయాయి. ట్రక్కు డ్రైవర్ల సమ్మె గురించిగానీ.. పెట్రోల్ బంకుల వద్ద రద్దీతో జంక్షన్లు జామైపోయిన విషయంగానీ తెలియక బయటకు వచ్చిన సామాన్యులు చాలా మంది.. ఈ ట్రాఫిక్ దెబ్బకు అల్లాడిపోయారు. సాధారణంగా అరగంట పట్టే దూరానికి రెండు గంటలకు పైగా సమయం పట్టడంతో.. అడుగుతీసి అడుగు వేసినట్టుగా మంద్రంగా కదులుతున్న ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించలేక.. విలవిలలాడిపోయారు. 'అనవసరంగా బయటికొచ్చాంరా భగవంతుడా' అని వాపోయారు. అసలు పెట్రోల్ బంకుల వద్ద బారులుతీరినవారిలో కూడా చాలా మందికి అసలు ఈ సమ్మె ఏమిటి? ఎన్నిరోజులు? అనే విషయాలే తెలీవంటే అతిశయోక్తి కాదు. సమ్మె మూడురోజులని కొందరు.. కాదు వారమని మరి కొందరు.. నెలరోజులని ఇంకొందరు.. ఇలా సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రచారం చేయడంతో వాటిని నమ్మి వచ్చినవారే చాలా మంది. కారణమేదైనాగానీ.. నగరంలోని వాహనదారులకు, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, ఫుడ్ డెలివరీ బాయ్స్, క్యాబ్, ఆటో డ్రైవర్లకు పట్టపగలే చుక్కలు చూపించిన ఈ ట్రాఫిక్ రాత్రి దాకా కొనసాగింది.

ఇదీ నేపథ్యం

హిట్ అండ్ రన్ కేసుల్లో.. రూ.7 లక్షల జరిమానా, పదేళ్ల దాకా జైలు శిక్ష విధించేలా కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ట్రక్కుడ్రైవర్లు సోమవారం సమ్మెకు దిగారు. మంగళవారం ఆ సమ్మె రెండోరోజుకు చేరింది. సమ్మె ఇలాగే కొనసాగితే ఇంధన కొరత ఏర్పడుతుందన్న ఆందోళన సహజమే. కానీ.. సోషల్ మీడియాలో చాలా మంది ఈ విషయాన్ని విస్తృతంగా వైరల్ చేయడంతో అందరిలో ఆందోళన పెరిగిపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణం. ఆ భయంతోనే చాలా మంది పెట్రోల్ బంక్‌ల వద్దకు వాహనాలతో, పెట్రోల్ క్యాన్లు, బాటిళ్లతో చేరుకున్నారు. అవకాశం దొరికినవారంతా ట్యాంకులు ఫుల్ చేయించుకున్నారు. దీంతో మధ్యాహ్నానికే చాలా బంకుల్లో నిల్వలు నిండుకున్నాయి. దీంతో నోస్టాక్ బోర్డులు పెట్టేశారు. ఆ బోర్డులను మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో మరింత మంది తమకు దగ్గర్లో ఉన్న బంకుల వద్దకు చేరుకుని ఆయిల్ పోయించుకునే ప్రయత్నం చేశారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. చాలాచోట్ల.. నోస్టాక్ బోర్డులు పెట్టినా కదలడానికి వాహనదారులు ససేమిరా అనడంతో పోలీసులు జోక్యం చేసుకుని, వారిని అక్కణ్నుంచీ బలవంతంగా పంపించాల్సి వచ్చింది. మరి కొన్నిచోట్ల వాహనదారుల మధ్య.. ప్రజలకు, బంకు సిబ్బందికి నడుమ ఘర్షణలు జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో ఆయిల్ పోయడం ఆపేశారు. పోలీసు బందోబస్తు నడుమ ఒక్కొక్కరికీ రెండు లీటర్ల పెట్రోల్/డీజిల్ మాత్రమే పోసి పంపించారు.

తాత్కాలికమే..

చర్లపల్లి నుండి చెంగిచెర్ల వరకు ఉన్న ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి గ్యాస్, ఆయిల్ కంపెనీల వద్ద వాహనాలను నిలిపివేసి నిరసన ప్రదర్శన చేపట్టిన డ్రైవర్లు.. మధ్యాహ్నానికి తాత్కాలికంగా సమ్మెను విరమించి తమ ట్యాంకర్లను కంపెనీలలోకి తీసుకు వెళ్లి ఇంధనాన్ని నింపుకొని బయటకు వచ్చారు. ట్రాన్స్‌పోర్టర్ ఒత్తిడి మేరకే సమ్మెను తాత్కాలికంగా విరమించామని, కేంద్ర కమిటీ పిలుపు మేరకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని వారు స్పష్టం చేశారు. తాత్కాలికంగానైనా సమ్మె విరమిస్తున్నట్టు ట్రక్కు డ్రైవర్లు, యజమానులు మంగళవారం రాత్రి ప్రకటించడం, బంకులకు పెట్రోల్ యథావిధిగా సరఫరా అవుతుందన్న సమాచారం వాహనదారులకు ఊరట కలిగించింది. అయితే.. సమ్మె విరమణ ప్రకటన వచ్చినప్పటికీ చాలా మంది బంకుల నుంచి వెళ్లడానికి ఇష్టపడలేదు. పెట్రోల్ పోయించుకునేదాకా.. అర్ధరాత్రి అయినా సరే వారు క్యూలైన్లలోనే వేచి ఉన్నారు.

బంకుల్లో కొరత లేదు

- ప్రైవేటు లారీలు, ట్యాంకర్ల ద్వారా సరఫరాకు పెట్రో డీలర్ల చర్యలు
- రాత్రి తొమ్మిది గంటల సమయానికి బంకుల వద్దకు చేరిన స్టాక్

హైదరాబాద్ సిటీ/కుషాయిగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె విరమణతో మంగళవారం రాత్రి హుటాహుటిన బంకులకు ఇంధన సరఫరా చేసేందుకు పెట్రో డీలర్లు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. సమ్మెలోకి దిగిన ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు అందుబాటులో లేకపోవడంతో.. ప్రైవేట్ డ్రైవర్లు, ఆయిల్ కంపెనీల డ్రైవర్లు, పెట్రోల్ బంకులకు చెందిన ట్యాంకర్ల డ్రైవర్లతో సరఫరా ప్రారంభించారు. అయితే సాయంత్రం 4 గంటలకు రావాల్సిన ట్యాంకర్లు రాత్రి 9 గంటలకు బంకులకు చేరుకున్నాయి. పెట్రో ట్యాంకర్లను పెద్ద ఎత్తున సరఫరా చేస్తామని.. బుధవారం మధ్యాహ్నానికి పరిస్థితులు పూర్వస్థితికి వస్తాయని.. అన్ని బంకుల్లో పూర్తిస్థాయిలో పెట్రోల్ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటామని డీలర్లు తెలిపారు. ప్రస్తుతానికి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఎలాంటి కొరతా లేదని... తెలంగాణ పెట్రోల్ బంక్ డీలర్స్ అసోసియేషన్‌కు చెందిన అమరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె చేశారని.. మంగళవారం వారితో సమ్మె విరమింపజేశామని ఆయన వెల్లడించారు. పెట్రోల్ బంకులు బంద్ అయిపోతాయంటూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం చేశారని.. ఈ గందరగోళం సృష్టించినవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డెలివరీబాయ్స్, క్యాబ్ డ్రైవర్ల ఆందోళన..

ట్రాఫిక్ జామ్ దెబ్బకు సామాన్య వాహనదారులు ఒకరకంగా ఇబ్బంది పడితే.. ఫుడ్ డెలివరీ బాయ్స్, క్యాబ్, ఆటో డ్రైవర్లది మరో సమస్య. ఒకవైపు వాహనంలో ఇంధనం నిండుకుంటుంటే.. మరోవైపు ఆర్డర్లు, బుకింగ్‌లు వెల్లువలా వచ్చిపడుతుండడంతో ఏంచేయాలో వారికి అర్థం కాలేదు. ఈ టెన్షన్ తట్టుకోలేక చాలా మంది కొత్తగా ఆర్డర్లు/బుకింగ్‌లు తీసుకోవడం నిలిపివేశారు. ఫోన్లు సైతం స్విచాఫ్ చేసేశారు. దీని వల్ల.. బయటకు వెళ్లడానికి యాప్‌లపైనే ఆధారపడినవారు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎన్నిసార్లు బుక్ చేసినా క్యాబ్‌లు, ఆటోలు, బైక్‌లు క్యాన్సిల్ అయిపోతుండడంతో ఇంటికి ఎలా వెళ్లాలో తెలియట్లేదంటూ వాపోయారు.

లొంగిపోతే బెయిల్.. లేకపోతే కఠిన శిక్ష..!

హిట్-అండ్-రన్ కేసులకు భారీ మూల్యం.. భారత న్యాయ సంహిత చెబుతుందిదే

- ప్రమాదం జరగ్గానే ఠాణాకు వెళ్తే.. ఐదేళ్లు.. లేకుంటే పదేళ్ల ఖైదు, రూ.7 లక్షల జరిమానా
- ఐపీసీలో ఈ తరహా నేరానికి 2 ఏళ్ల శిక్ష



కేంద్రం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత(బీఎన్‌ఎస్)లో హిట్-అండ్-రన్ కేసులపై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. బీఎన్‌ఎస్‌లో పేర్కొన్న సెక్షన్లకు పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్లు, ట్రక్కు డ్రైవర్లు ఇప్పటికే ఆందోళనబాట పట్టగా.. ప్రైవేటు బస్సులు, క్యాబ్‌ల డ్రైవర్లు కూడా అదే మార్గంలో పయనిస్తున్నారు. ఈ ఆందోళనల ప్రభావంతో దేశవ్యాప్తంగా హైవేలు, కీలక నగరాల్లో ట్రాఫిక్ జామ్‌లు నెలకొన్నాయి. పెట్రోల్ బంకులకు వాహనదారులు పోటెత్తారు. అసలు ఏమిటీ హిట్-అండ్-రన్ కేసులు? భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లో శిక్షలెలా ఉండేవి? బీఎన్‌ఎస్ అమల్లోకి వస్తే శిక్షలు ఎలా ఉంటాయి?

ప్రమాదం చేసి, పారిపోవడం..

రోడ్డు ప్రమాదాలు చేసి, పారిపోవడాన్నే హిట్-అండ్-రన్ అని పిలుస్తారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాద మరణాల్లో వీటి వాటా దాదాపుగా పదోవంతు దాకా ఉంటోంది. హత్య కేసుల్లో మరణాల కంటే వీటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటున్నాయని జాతీయ నేరాల నమోదు విభాగం(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు చెబుతున్నాయి. 2019లో హత్య కేసుల్లో 28,915 మరణాలు నమోదైతే.. హిట్-అండ్-రన్ డ్రైవింగ్ వల్ల 47,504 మంది చనిపోయారు. 2020లో 41,196.. 2021లో 43,499 మరణాలకు హిట్-అండ్-రన్ డ్రైవింగే కారణం. శిక్షలు కఠినంగా ఉంటే ఈ తరహా మరణాలను తగ్గించవచ్చనే న్యాయ నిపుణుల అభిప్రాయాలు, పలు కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఐపీసీలో పేర్కొన్న శిక్షలకు బీఎన్‌ఎస్‌లో సవరణలు చేసింది.

డ్రైవర్ల ఆందోళన ఏంటంటే..!

హిట్-అండ్-రన్ కేసులో గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానాలను విధించాలని బీఎన్‌ఎస్ స్పష్టం చేస్తోందని ట్రక్కు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పదేళ్ల జైలు శిక్ష పడితే.. అంతకాలం తాము కుటుంబాలకు దూరంగా ఉండాలని, రెక్కాడితేగానీ డొక్కాడని తమ భార్యాపిల్లలు రోడ్డుపాలవుతారని వాపోతున్నారు. కొత్త చట్టంలో శిక్షలను 1-2 సంవత్సరాలకు తగ్గించాలని భోపాల్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం ఏమంటోంది?

పలు రాష్ట్రాల్లో ట్రక్/ట్యాంకర్ డ్రైవర్ల ఉధృత ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రమాదం గురించి, డ్రైవర్లు పోలీసులకు సమాచారం అందిస్తే.. వారిపై కఠిన చర్యలు ఉండవని, తప్పుచేసి, తప్పించుకునే ప్రయత్నం చేసేవారికే కఠిన శిక్షలని పేర్కొంది.

సెక్షన్ 104 ఏం చెబుతోంది?

బీఎన్‌ఎస్ సెక్షన్ 104 హిట్-అండ్-రన్ నేరాలను గురించి ప్రస్తావిస్తోంది. ఇందులో రెండు క్లాజులున్నాయి. డ్రైవర్ ఏదైనా ప్రమాదానికి కారకుడైతే.. క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, మరణాలు సంభవిస్తే.. ప్రజలు పట్టుకుని కొడతారనే భయం ఉంటే పోలీసులకు(డయల్-100కు ఫోన్ చేసి అయినా) లేదా మెజిస్ట్రేట్‌కు సమాచారం అందించాలి. లేదంటే.. సమీప పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలి. ఇలా చేస్తే.. నిందితుడికి ఐదేళ్లలోపు జైలు శిక్ష పడుతుందని సెక్షన్ 104(1) చెబుతోంది. ఈ సెక్షన్ బెయిలబుల్. ఇలా కాకుండా.. ప్రమాదం జరగ్గానే పరారయ్యే వారి గురించి సెక్షన్ 104(2) ప్రస్తావిస్తోంది. ఇలాంటి వారిని దర్యాప్తు అధికారులు గుర్తించి, అరెస్టు చేస్తే.. 104(2) సెక్షన్‌ను ప్రయోగిస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, లేదా.. జైలు శిక్షతోపాటు.. రూ.7 లక్షల దాకా జరిమానా పడుతుంది. 104(2) సెక్షన్ నాన్-బెయిలబుల్. ఇప్పటి వరకు ఈ తరహా కేసుల్లో ఐపీసీలోని సెక్షన్ 304(ఏ) కింద అభియోగాలు మోపుతున్నారు. ఐపీసీలో రెండేళ్ల దాకా గరిష్ఠ జైలు శిక్ష, లేదా జరిమానా, లేదా రెండూ విధించే అవకాశాలున్నాయి. బీఎన్‌ఎస్‌లో జైలు శిక్షలు పెంచారంటూ ఇప్పుడు పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు ఆందోళన చేపడుతున్నారు.

- సెంట్రల్ డెస్క్



బిహార్‌లోని హాజీపూర్‌లో డ్రైవర్ల నిరసన

ట్రక్కుడ్రైవర్ల ఆందోళన విరమణ

న్యూఢిల్లీ, జనవరి 2: భారత న్యాయ సంహిత(బీఎన్‌ఎస్) చట్టంలో హిట్-అండ్-రన్ శిక్షలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన ట్యాంకర్/ట్రక్కు డ్రైవర్లు తమ సమ్మెను విరమించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సోమవారం ప్రారంభమైన డ్రైవర్ల సమ్మె.. మంగళవారం పలు ప్రాంతాల్లో ఉధృతంగా సాగింది. ట్యాంకర్, ట్రక్కు డ్రైవర్లకు ప్రైవేట్ బస్సులు, క్యాబ్ డ్రైవర్లు కూడా సంఘీభావంగా నిలవడంతో.. మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో హైవేలపై రాకపోకలు స్తంభించిపోయాయి. మూడ్రోజుల సమ్మె అంటూ తొలుత ప్రకటన వెలువడడంతో ఆందోళన చెందిన వాహనదారులు పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కనిపించింది. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 90% పెట్రోల్ బంకుల్లో నిల్వలు నిండుకున్నాయని పెట్రో డీలర్ల సంఘాలు ప్రకటించాయి. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్(ఏఐఎంటీసీ) ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐఎంటీసీ ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టారు. హిట్-అండ్-రన్ కేసుల్లో భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లో శిక్షలు తక్కువగా ఉండగా.. బీఎన్‌ఎస్‌లో పదేళ్ల వరకు జైలు శిక్షలున్నాయని, పేద ట్రక్కు డ్రైవర్లకు ఇవి తీవ్ర శిక్షలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన అజయ్ భల్లా.. "కొత్త చట్టాన్ని అమలు చేయడానికి ముందు మీ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాం. అప్పుడు మరోసారి సమీక్షిద్దాం. ఆందోళనలను విరమించండి" అని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఏఐఎంటీసీ ప్రతినిధులు.. సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ట్యాంకర్/ట్రక్కు డ్రైవర్లు హైవేలను దిగ్బంధించడం, ప్రైవేటు బస్సు, క్యాబ్ డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొనడంతో పలు రాష్ట్రాల్లో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు. మహారాష్ట్రలోని ముంబై, నవీముంబై, నాగ్‌పూర్, షోలాపూర్, ధారాశివ్, పాల్ఘర్, బీడ్, హింగోలీ, ఛత్రపతి సంభాజీనగర్, నాసిక్, గడ్చిరోలి, వార్ధాల్లో జాతీయ రహదారులను దిగ్బంధం చేయడంతో.. కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు-మనాలి, బిలాస్‌పూర్, ధర్మశాల, హమీపూర్, చంబా, షిమ్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దాదాపు అన్ని రాష్ట్రాలు.. ముఖ్యంగా ప్రధాన నగరాల్లో పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి. చాలాచోట్ల పెట్రోల్ నిల్వలు నిండుకున్నాయి. ఒక్క ఢిల్లీలోనే 2 వేలకు పైగా పెట్రోల్ బంకుల్లో 'నోస్టాక్' బోర్డులు కనిపించాయి.

హింసాత్మక ఘటనలు


పలు చోట్ల ట్రక్కు/ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె హింసాత్మక ఘటనలకు, పోలీసు లాఠీచార్జికి దారి తీసింది. రాజస్థాన్‌లోని కేక్రీ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఆందోళనకారులు పోలీసు వాహనానికి నిప్పుపెట్టారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఓ వాహనం ధ్వంసమవ్వగా.. ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. నవీముంబైలోనూ ట్రక్కు డ్రైవర్లు పోలీసులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఓ పోలీసుకు గాయాలయ్యాయి.

డ్రగ్స్ తరలిస్తూ పట్టుబడ్డ వైసీపీ నేత

- ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు కారులో మాదకద్రవ్యాలు
- మధ్యలో అడ్డుకున్న నిజామాబాద్ పోలీసులు
- డ్రగ్స్ స్వాధీనం.. నిందితులు ద్వారంపూడి విక్రమ్, మొయినుద్దీన్ అరెస్టు, జైలుకు తరలింపు

నిజామాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి విక్రమ్‌ను.. కారులో డ్రగ్స్ తరలిస్తుండగా నిజామాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. విక్రమ్‌తోపాటు మరొకరిపైనా కేసు నమోదు చేశారు. నార్కోటిక్స్ యాక్ట్ కింద నిజామాబాద్ జైలుకు పంపించారు. వీరికి పరిచయం ఉన్న మరో ఇద్దరిని కూడా డిచ్‌పల్లి పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. ఏపీలోని కోనసీమ జిల్లా అలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి విక్రమ్ వైసీపీ నాయకుడు. అదే రాష్ట్రంలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ ఖాజా మొయినొద్దీన్ చిస్తి ఇతనికి స్నేహితుడు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరిద్దరూ ఇతర ఫ్రెండ్స్‌తో కలిసి కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకొనేందుకు, ఢిల్లీలో రాహుల్, షైక్ అనే వ్యక్తుల ద్వారా కొకైన్, గంజా పౌడర్, ఎండీఎంఏ డ్రగ్‌ను సేకరించారు. వీటిని కారులో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారం మేరకు ఆదివారం రాత్రి వీరిని అడ్డుకొని కారు తనిఖీ చేసి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బరువు తూచగా.. ఎండీఎంఏ డ్రగ్ 3.2 గ్రాములు, కొకైన్ 12.3 గ్రాములు, గంజాయి పౌడర్ 3.1 గ్రాములు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. ద్వారంపూడి విక్రమ్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి (బొటానికల్ గార్డెన్ రోడ్)లో నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. విక్రమ్ తండ్రి సత్యనారాయణరెడ్డి గతంలో జొన్నాడ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం వైసీపీలో గ్రామస్థాయి నేతగా ఉండటంతో పాటు పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పట్టుబడ్డ మరో వ్యక్తి షేక్ ఖాజా మొయినొద్దీన్ హైదరాబాద్‌లోని మణికొండలో గల పంచవటి కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతను ఓ హోటల్ నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా హైదరాబాద్‌లో మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. నిందితులకు ఢిల్లీకి చెందిన వ్యక్తులతో ఎలా పరిచయమైంది? గతంలో ఇదే విధంగా డ్రగ్స్‌ను తీసుకొచ్చారా? వీరి వెనుక ఉన్న వారెవరు? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం

టీఎస్‌పీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

1600 సంవత్సరంలో ప్రారంభం అయిన ఈస్టిండియా కంపెనీ గురించి తెలుసుకున్న తరవాత, 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1781 విస్తరణ చట్టం, 1784 పిట్స్ ఇండియా చట్టం గురించి తెలుసుకోవాలి. 1600 నుంచి 1784 మధ్య కాలంలో ఇతర అంశాలను ఆధునిక భారతదేశ చరిత్రతతో అనుసంధానం చేసుకోవాలి. 1793 చార్టర్ చట్టం నుంచి 1853 చార్టర్ చట్టం వరకు ఉన్న నాలుగు చట్టాలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలి. అదేవిధంగా 1858 భారత రాజ్యాంగ చట్టం అర్థం చేసుకున్న తరవాత 1909, 1919 చట్టాలను పరిశీలించాలి. అనంతరం 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 1793, 1813, 1833, 1853, 1909, 1919, 1935 చట్టాల్లోని ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ పాలన పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవాలి. ఆధునిక భారతదేశ చరిత్ర చదివిన అనంతరం ఈ చట్టాలను చదవడం అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నుంచి భారత రాజ్యాంగం ఆమోదం పొందే వరకు జరిగిన పరిణామాలను వరుసక్రమంలో అభ్యర్థులు గుర్తుంచుకోవాలి. అలాగే దేశవిభజన అనంతరం రాజ్యాంగ పరిషత్‌లో వచ్చిన మార్పులపై కూడా దృష్టి సారించాలి. ఆబ్జెక్టివ్ తరహా పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు రాజ్యాంగ పరిషత్‌కు సంబంధించిన భిన్న కమిటీలు, వాటి చైర్మన్‌లు, ముసాయిదా కమిటీకి సంబంధించిన ఫ్యాక్ట్స్ గుర్తుంచుకోవాలి. రాజ్యాంగ పరిషత్‌పై వచ్చిన విమర్శలను కూడా పరిశీలించాలి.

చార్టర్ అంటే ఒప్పందం

రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడానికి ఆ దేశ పూర్వ పరిస్థితులను అధ్యయనం చేయడం చాలా అవసరం. భారత రాజ్యాంగానికి సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇండియాలో వ్యాపార నిమిత్తం ఈస్టిండియా కంపెనీకి సంబంధించి బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఒక చార్టర్ ద్వారా 1600 డిసెంబరు 31న అనుమతిని ఇచ్చింది. చార్టర్ అంటే ఒప్పందం అని అర్థం. భారతీయ పరిపాలన వ్యవస్థ ప్రధానంగా బ్రిటిష్ పరిపాలన విధానాన్నే అనుసరించి ఉంటుంది(బ్రిటిషర్లు ఇండియాను కొన్ని వందల సంవత్సరాలకు పైగా పరిపాలించడం వలన వారి విధి, విధానాలు భారతదేశాన్ని ప్రభావితం చేశాయి). భారత రాజ్యాంగ పూర్వ చరిత్రపై పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు అనేక సందేహాలు ఉత్పన్నం అవుతాయి. చాలా మంది అభ్యర్థులు ఆధునిక భారత దేశ చరిత్రను, రాజ్యాంగ పరిణామక్రమాన్ని ఒకటిగానే భావిస్తారు. పాలిటీ విభాగంలో 1600 సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీ(బ్రిటిష్) ప్రారంభం అవడం గురించి తెలుసుకొని, ఆ తరవాత 1773 రెగ్యులేటింగ్ చట్టం నుంచి కీలకమైన చట్టాల గురించి తెలుసుకోవాలి.

ఉదా:- 1773, 1793, 1813, 1853, 1858, 1861, 1909, 1919, 1935 మొదలైనవి.

అభ్యర్థులు ఆధునిక భారతదేశ చరిత్రపై పట్టు సాధించిన అనంతరం ఈ చట్టాల గురించి తెలుసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఈ చట్టాలను అర్థం చేసుకునే క్రమంలో వచ్చిన క్రమానుగత మార్పులను కూడా అవగతం చేసుకోవాలి. ఆ తరవాత 1946లో రాజ్యాంగ పరిషత్ ఎన్నికల అనంతరం, 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు జరిగిన పరిణామాలను తెలుసుకోవాలి.

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ

1600 డిసెంబరు 31న భారతదేశంలో వ్యాపారం చేసుకోవడం కోసం ఈస్టిండియా కంపెనీ బ్రిటిష్ రాణి అనుమతి పొందింది.(ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో వ్యాపారం కోసం ఏకస్వామ్య హక్కులను పొందింది అని గమనించాలి). ఆర్థికంగా బలమైన మూలాలు కలిగిన ఈస్టిండియా వ్యాపారాన్ని విస్తరించి క్రమంగా భారత భూభాగాలపై పాలనాపరమైన పట్టు సాధించింది. ఆ క్రమంలోనే 1639లో మద్రాస్‌ను, 1668లో బొంబాయిని, 1698లో బెంగాల్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. ఆ తరవాత కూడా ఈస్టిండియా కంపెనీ అనేక భారత భూభాగాలపై తన పాలనాపరమైన ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆ క్రమంలో ఏకస్వామ్య హక్కులు కలిగిన ఈస్టిండియా కంపెనీ భారత్‌లో అవినీతి కార్యకలాపాలు, లంచగొండితనానికి పాల్పడింది. అలాగే ఉన్నతస్థాయి ఉద్యోగులు కూడా భారత పౌరుల నుంచి బలవంతంగా బహుమతులు కోరేవారు. ఇలాంటి కార్యకలాపాలను నివారించడానికి బ్రిటిష్ పార్లమెంట్ 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేసింది.

రాజ్యాంగ అభివృద్ధి క్రమము

భారత రాజ్యాంగ చరిత్ర బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ పాలనలో క్రీ.శ.1600లో ప్రారంభమైంది. ఇండియాలో రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని ఆరు దశలుగా అధ్యయనం చేయవచ్చని 'బి.సి.రావత్' అభిప్రాయం.

1వ దశ: క్రీ.శ. 1600 - 1773 **2వ దశ:** క్రీ.శ. 1773 - 1858 **3వ దశ:** క్రీ.శ. 1858 - 1909
4వ దశ: క్రీ.శ. 1909 - 1919 **5వ దశ:** క్రీ.శ. 1919 - 1935 **6వ దశ:** క్రీ.శ. 1935 - 1947

1773 రెగ్యులేటింగ్ చట్టం - ముఖ్యాంశాలు

రెగ్యులేట్ అంటే నియంత్రణ. బ్రిటిష్ పార్లమెంట్ ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను నియంత్రించడానికి చేసిన చట్టం కాబట్టి, దీన్ని రెగ్యులేటింగ్ చట్టం అంటారు. రెగ్యులేటింగ్ చట్టం- 1773 భారతదేశానికి సంబంధించి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం. ఈ చట్టంలోని ముఖ్యాంశాలు....

- కలకత్తాలోని పోర్టు విలియంలో సుప్రీం కోర్టు ఏర్పాటుకు ఈ చట్టం ఆధారం
- బెంగాల్ గవర్నరును గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా పదోన్నతి కల్పించారు (బొంబాయి, మద్రాస్ ప్రాంతాల గవర్నర్‌లు బెంగాల్ గవర్నర్ జనరల్‌కు అధీనులుగా మారారు).(మొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ - వారెన్ హేస్టింగ్స్).
- ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు ప్రైవేట్ వ్యాపారం చేసుకోవడం, స్థానికుల నుంచి లంచాలు, బహుమతులు తీసుకోవడాన్ని నిషేధించారు.
- ఈస్టిండియా కంపెనీ పాలకమండలి సభ్యులైన కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ భారతదేశంలో రెవెన్యూ, సివిల్, మిలిటరీ వ్యవహారాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక పంపాలి.
- 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసినప్పటికీ ఈస్టిండియా కంపెనీ లంచగొండితనాన్ని, అవినీతిని, బహుమతులు స్వీకరించడాన్ని బ్రిటిష్ పార్లమెంట్ నివారించలేకపోయింది. ఫలితంగా 1784 బ్రిటన్‌లో విలియం పిట్స్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పిట్స్ ఇండియా చట్టం రూపొందించారు.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు




రిటర్న్

రహస్య మార్గం

ఒక రాజ్యంలో విశ్వక్షేనుడు అనే రాజు ఉండేవాడు. ధీరుడు, శూరుడు, వీరుడు. అతని పేరు పొరుగు రాజ్యాలకు హడల్. తనకోటను చూడటానికి కూడా శత్రువులు చూసేవారు కాదు. అంతటి బలమైన సైన్యం అతనికి ఉండేది. అతనికి విశ్వుడు, వినయుడు అనే కుమారులుండేవారు. విశ్వుడు తన తండ్రి మాదిరే సాహసి. రాజ్యభావన మెండు. ఎప్పటికైనా తానే రాజును అవుతాననే నమ్మకం ఉండేది. అందుకే అతన్ని రాజుగారు ప్రోత్సహించేవారు.

రాజుగారి చిన్నకొడుకు తీరు మరొకటి. అతనికి భయాలు ఎక్కువ. వినయుడుకి విధేయత, వినయం లేకపోగా భీతి, భయం, అసహనం ఉండేవి. పిరికివాడు, బలహీన మాటలు మాట్లాడేవాడు. రాజుగారికి చిన్న కొడుకంటేనే విపరీతమైన కోపం ఉండేది. రాజ్యాన్ని నిలబెట్టే శక్తి అతనికి లేదని తెలుసు. ఒక రోజు సభలో ఉండగా చిన్న, పెద్దకొడుకులు ఇద్దరూ రాజు ఎదురుగా ఉన్నారు. వాళ్ల పరాక్రమాల్లో పెద్ద కొడుకే పరాక్రమవంతుడని ప్రజలకున్న నమ్మకాన్ని చవిచూశాడు.

సభలోంచి ఇంట్లోకి వెళ్లినవెంటనే వినయుడు తన తండ్రి దగ్గరకు వెళ్లి.. 'నాన్న.. ప్రతి రాజ్యంలో, ప్రతి కోటలో రహస్య మార్గాలు ఉంటాయి కదా?' అన్నాడు. 'అవును.. ' అన్నాడు రాజుగారు. 'అయితే తక్షణమే చూస్తాను' అని




కోరాడు. 'నాకు, మంత్రికి తప్ప ఎవరికీ తెలియకూడదు. దాని సమయం వచ్చాక చెబుతాను' అన్నాడు. అంతలోనే రాజుగారి భార్య కలగచేసుకుని చిన్న కొడుకంటే అంత అలుసు ఎందుకో? అన్నది. వెంటనే మంత్రితో కలసి రాజు వారి రహస్య మార్గాన్ని చూడటానికి బయలుదేరాడు. తనతోనే చిన్న కొడుకును తీసుకెళ్లాడు. కోటలో ఉండే రహస్య మార్గం చూశాక.. కొడుకు ఆశ్చర్యపోయాడు. 'ఇక పోదాం.. నీకెందుకు' అన్నాడు రాజుగారు. 'ఏమీ లేదు నాన్నగారు.. మన దేశంమీదకు శత్రుమూకలు వస్తే.. మనం చచ్చిపోతాం కదా. అందుకే తప్పించుకుపోవటానికి ఈ మార్గం తెలిసి ఉండాలి కదా.. మనకు' అన్నాడు. కోటలోని రహస్యమార్గంలో కొద్దిగా కిందకు దిగాడు వినయుడు. ఏమాత్రం ఆలోచించకుండా రాజుగారు ఆ తలుపు మూసేశారు. పది నిముషాల తర్వాత కొడుకు వచ్చి తలుపు గట్టిగా కొట్టాడు.. 'తీయండి' అని అరుస్తూ. రాజుగారు ఇలా గట్టిగా పక్కన ఉండే చిన్న కిటికీలోంచి ఇలా అన్నాడు.. 'నీలాంటి పిరికిపందకు రాజు అయ్యే అవకాశం లేదు. ఆ రహస్య మార్గంలో వెళ్లు. ఇంకో రాజ్యం వస్తుంది. అక్కడ ఏదైనా పని చేసుకుని బతుకు. అంతేకానీ రాజుగా తిరిగి రావద్దు' అన్నాడు.




దారి కనుక్కోండి

10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



28 నుంచి గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు యుఎం-మార్సల్ గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ న్యూఢిల్లీ, ముంబై నగరాల్లో జరుగనుంది. ఇండియన్ ఎడ్యుకేటర్స్, స్కూల్ లీడర్ల కోసం దీన్ని ఉద్దేశించారు. మిచిగాన్‌కు చెందిన యుఎం మార్సల్ ఫ్యామిలీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో కలిసి గ్లోబ్‌స్టార్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. మిచిగాన్ విశ్వవిద్యాలయానికి తోడు టౌబౌకాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ ప్లానింగ్‌లోని మార్సల్ ఫ్యామిలీ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ సభ్యులు ఇందులో పాల్గొంటారు. వర్క్‌షాప్‌లు, పాఠశాల సందర్శన, కేస్ స్టడీస్, ప్యానల్ డిస్కషన్స్ ఈ సమ్మిట్‌లో భాగంగా ఉంటాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు

లేట్ పాస్‌లు: రూ.1,50,000 (చెల్లింపునకు చివరి రోజు జనవరి 12)

స్కూల్ ప్యాకేజీ: రూ. రూ.3,25,000(ఒక్కో నగరంలో గరిష్ఠంగా పది పాఠశాలలు అందుబాటులో ఉంటాయి) (ఫీజుపై 18 శాతం జీఎస్‌టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.)

వెబ్‌సైట్: https://globestarcs.com/ummarsa-l-globestareducationsummit2024

ఈమెయిల్: info@globestarcs.com

ఫోన్ నెంబరు: +9191678 64136/37

సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ



సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీ హెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి. స్టయి పెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ అప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్‌ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్ఎఫ్ (యూజీసీ/సీఎస్ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్, అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్‌టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in



Nehru Trust's UK Travel Awards 2024

Description: Nehru Trust's UK Travel Awards 2024 is an opportunity offered by the Nehru Trust for the Indian Collection at the Victoria and Albert Museum (NTICVA), for scholars or professionals working in museums, galleries, universities, or other specified institutions concerned with the preservation, study, and display of India's art and cultural heritage.

Eligibility: Open for Indian citizens who scholars or professionals working in museums, galleries, universities or other specified institutions concerned with the preservation, study and display of India's art and cultural heritage.

Prizes & Rewards: Up to £1,000 (one-time)

Last Date to Apply: 15-02-2024

Application mode: via email or post at: The Secretary Nehru Trust for the Indian Collections at the Victoria & Albert Museum The School of Arts and Aesthetics SAA Building II Jawaharlal Nehru University New Delhi - 110067 India; Email ID: info@nehrutrustvam.org

Short Url: www.b4s.in/aj/NUT1

ADB Internship Program 2024

Description: ADB Internship Program 2024 is an opportunity offered by the Asian Development Bank (a regional development bank, headquartered in the Ortigas Center located in the city of Mandaluyong, Metro Manila, Philippines), to students enrolled in master's or Ph.D. degrees.

Eligibility: Open for ADB member countries national including India who are enrolled in a master's or Ph.D. level program. Students must have an excellent command of English and be engaged in academic study in a field related to ADB's work. Applicants must have professional experience relevant to the assignment.

Prizes & Rewards: Stipend for the duration of the internship

Last Date to Apply: 15-02-2024

Application: Online Only *Short Url:* www.b4s.in/aj/ADBI6

Colgate Keep India Smiling Scholarship Programme

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.

Prizes & Rewards: Financial assistance of 75,000

Last Date to Apply: 31-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSI3

Nikon Scholarship Program 2023-24

Description: An initiative of Nikon India Private Limited to financially support students from underprivileged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1 lakh

Last Date to Apply: 15-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/NSP10

buddy4study.com

డైలీ సుడోకు - 194

		2	4	5	8			
				9				
	3	7				8		
5				1	7			8
	6			4			2	
3			8	2				4
		1				5	6	
				7				
			6	8	1	9		

సుడోకు - 193 సమాధానం

8	2	9	4	5	3	1	6	7
7	5	1	9	8	6	2	4	3
4	6	3	7	2	1	8	5	9
1	8	7	2	4	5	9	3	6
6	9	2	8	3	7	4	1	5
5	3	4	1	6	9	7	2	8
2	1	6	3	9	8	5	7	4
3	4	8	5	7	2	6	9	1
9	7	5	6	1	4	3	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.